శ్రీ

చింతామణి.

ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౪.] రాజమహేంద్రవరము. [సంచిక. ౭.
జయసంవత్సర పుష్యమాసము.

బరోడారాజ్యము. (Baroda)

బొంబయిరాజధానిలోఁగల స్వదేశీయ సంస్థానములలోనెల్ల బరోడారాజ్యము మిక్కిలిగొప్పది. దానివైశాల్యము ౮౫౭౦ చదరపుమైళ్లు. ఆరాజ్యమునందు ౧౮౯౧వ సంవత్సరములలో చేసిన జనపరిగణననుబట్టి ౨౪౧౫౩౯౬ జనులున్నారు. ఆదాయము సంవత్సరమునకు నూటనలువదిలక్షల రూపాయలు వచ్చును. ఈరాజ్యమంతయు నించుమించుగా ఘూర్జరదేశములోఁ జేరియున్నది. దేశము మిక్కిలి ఫలవంతమయినది. ఇక్కడిజనులలో దాదాపుగా రెండులక్షలు మహమ్మదీయులును, ఏఁబదివేలు జైనులును, ఎనిమిదివేలు పారసీలును, ఉన్నారు. ఈదేశమును పాలించు ప్రభువునకు గాయకవారనునది బిరుదనామము. ఆపదమునకు గోపాలుఁడని యర్థము. శ్రీకృష్ణుని బట్టి యీపేరాదేశపు ప్రభువులకుఁ గలిగినది. ఈ మహారాష్ట్ర సంస్థానము నూటడెబ్బదియేండ్లక్రిందట స్థాపింపఁబడినది. ౧౮౫౬ వ సంవత్సరమునందు ఖండేరావను నతఁడు గాయకవారయ్యెను. అతఁడు ౧౮౫౭ వ సంవత్సరమునందు జరగిన బంగాళా సిపాయల కలహములో నింగ్లీషువారిపక్షముననుండి తోడ్పడినందున, ఇంగ్లీషుదొరతనమువా రాతని రాజ్యముమీఁద సంవత్సరమునకు మూడులక్షలరూపాయల పన్నును తగ్గించిరి. అతఁడు ౧౮౭౦ వ సంవత్సరమునందు మృతినొందఁగా, అదివఱకన్నగారికి విషము పెట్టించుటకుఁ బ్రయత్నముచేసెనన్న యనుమానముమీఁద చెఱసాలయందుఁ బెట్టఁబడియున్న యాతని తమ్ముఁడగు మల్హారిరావు సింహాసనమునకువచ్చెను. అతఁడు బంగారముతోను వెండితోను పిరంగులు చేయించుట మొదలయినవానిక్రింద ధనమును దుర్వ్యయముచేయుచు దుష్పరిపాలనముచేయుచు వచ్చినందున, రాజ్యముయొక్క క్షేమమున కావశ్యకములయిన కొన్ని మార్పులను జేయుటకయి యింగ్లీషుప్రభుత్వమువారు ౧౮ మాసములు గడువేర్పఱిచిరి. ఆగడువులోపలనే మల్హారిరావు గాయకవారక్కడి రెసిడెంటగు కర్నల్ ఫేరుదొరవారికి విషముపెట్టించుటకు ప్రయత్నముచేసినట్టు నేరము మోపఁబడి విమర్శమీఁద రాజ్యపదభ్రష్టుఁడుగాఁ జేయఁబడెను. తదనం

తరమున ఊారతనమువారు వెనుకటి గాయకవారగు ఖండేరావుగారి భార్యకు శాయాజీరావుగారిని పెంచుకొనుట కనుజ్ఞయిచ్చి, ఆతనికి యుక్తవయస్సు వచ్చువఱకును దేశపరిపాలనము చేయుటకయి శ్రీరాజా - సర్ - టీ - మాధవరావుగారిని నియమించిరి. శ్రీ మాధవరావుగారు దేశాభివృద్ధికయి పెక్కులు మార్పులు కలిగించి రాజ్యమునందు సత్పరిపాలనము నెలకొల్పిరి. ఇప్పటి గాయకవారగు శాయాజీరావుగారికి మంచి విద్య చెప్పించుటచేత, ఆయన యిప్పటి సంస్థానాధిపతులలో మిక్కిలి విద్యాధికులుగాను జనక్షేమమునకు పాటుపడువారుగాను ఉన్నారు. ఆయనరూప మీ క్రిందిపటమునం జూపఁబడియున్నది—



మహారాజా సర్ శాయాజీరావు గాయకవారు బహదూర్ జీ - సీ - యస్ - ఐ -

ఈయనవయస్సిప్పుడు ఇరువదియేడు సంవత్సరములు. అతిబాల్యవివాహములు తగ్గించుట మొదలయిన విషయములలో శాసనములు చేయుట కీయన కృషి చేయుచున్నారు. ఈయన యింగ్లాండుదేశమునకుఁ బోవుటయే కాక యిప్పుడు యూరపుఖండమునందు యాత్రచేయుచున్నారు. ఈయన తమరాజ్యములోని ప్రతి ముఖ్యగ్రామమునందును పాఠశాలలను స్థాపించుటకు ఏర్పాటుచేయుచున్నారు. ౧౮౮౧వ సంవత్సరము నాటికి

బరోడా రాజ్యమునందు ౫౧౧ పాఠశాలలు స్థాపింపఁబడినవి. బరోడానగరమునం దొక శాస్త్రపాఠశాలయున్నది. రాజ్యములో నలువదిరెండు బాలికాపాఠశాలలు పెట్టఁబడినవి; అందయిదువేలబాలికలు విద్యాభ్యాసము చేయుచున్నారు. రాజధానియైన బరోడానగరమున ౧౮౯౧ వ సంవత్సరమున ౧౧౬౪౬౦ ల జనులున్నారు.

ఈ ఘూర్జరదేశములో వల్లభాచార్య మతస్థులైన యొకతెగ వైష్ణవులు విస్తారముగా నున్నారు. ఈమతములో వణిజులైన బట్టియాజాతివారు విశేషముగాఁ జేరియున్నారు ఈ వైష్ణవగురువులు మహారాజులనఁబడుదురు. వీరు శ్రీకృష్ణులవారి యపరావతారములుగా భావింపఁబడి గోపికలవిషయమున శ్రీకృష్ణులవారు ప్రవర్తించినట్టుగా శిష్యురాండ్రవిషయమునఁ బ్రవర్తించు స్వాతంత్ర్యము కలవారుగా నెంచఁబడుదురు. అందుచేత మూఢవనితలు తా మా మహారాజులతో సంభోగించిన కృతార్థురాండ్ర మగుదుమని నమ్మి యట్లు వర్తిల్లుదురు. ఈప్రకారముగా పుణ్యమువచ్చునని నమ్మి గొప్ప కుటుంబములలోనివారుకూడ భర్తలు తమ భార్యలను, తల్లిదండ్రులు తమ కూఁతులను, అత్తలు తమ కోడండ్రను వెంటఁబెట్టుకొనిపోయి యీ మహారాజులకు సమర్పించి యానందింతురు. ఇటువంటి మహారాజు లాదేశమునందు డెబ్బండ్రవఱకును గలరు. మతముపేరుచెప్పి యీ మహారాజులు నరరూపమునున్న మృగములవలెఁ దమ శిష్యకాంతల పాతివ్రత్యమునకు భంగము కలిగించుచుండుటయేకాక, రాసమండలి యని పేరుపెట్టి యేటేట తామందఱు నొక్కచోటఁగూడి యొండొరుల భార్యలతో సహితము యథేచ్ఛముగా వ్యభిచరింతురు. ఓహో! దుర్మతములు వివేకమునుబోఁగొట్టి మనుష్యులను మృగములకంటెను నికృష్టజీవులనుగాఁ జేయుచున్నవిగదా! ఈ మహారాజులు శిష్యులవలన దర్శనమిచ్చినందున కయిదురూపాయలును, శరీరము ముట్టనిచ్చినందున కిరువదిరూపాయలును, కాళ్లు కడుగనిచ్చినందునకు ముప్పదియైదు రూపాయలును, ఉయ్యెలలోఁబెట్టి యూచనిచ్చినందునకు నలువది రూపాయలును, గంధముపూయనిచ్చినందునకు నలువదిరెండు రూపాయలును, సరసఁ గూర్చుండనిచ్చినందున కఱువది రూపాయలును, ఏకశయ్యాగతులు కానిచ్చినందున కేఁబది మొదలుకొనియే నూఱు రూపాయలవఱకును, కలిసి రాసక్రీడచేయ నిచ్చినందునకు నూఱు మొదలుకొనియిన్నూఱు రూపాయలవఱకును, ఉమిసిన తాంబూలమును తిననిచ్చినందునకు పదునేడురూపాయలును, తాము స్నానముచేసినట్టిగాని తాము కట్టుకొన్న బట్ట యుతికినట్టికాని నీరు త్రాగనిచ్చినందునకు పందొమ్మిదిరూపాయలును, గ్రహింతురఁట! మనుష్యజన్మమెత్తినవారికింతకంటె నెక్కువగాఁ జెడుట సాధ్యమగునా?

క్ష ణ మా య.

గీ. నీవు దిగవిడ్చునట్టియు నిన్నుఁదాన । విడుచునట్టియు సిరిఁగూర్పఁ గడఁగనేల?
అన్నమర్త్యుఁడ పాఱిపోనున్ననీకు । భారమును మోవ మదిలోనఁ గోరనేల? ౧.

గీ. అన్నమంటిలోఁ గలయంగనున్ననీకు । మేడలును మిద్దెలునుగట్ట వేఁడనేల
మొలకనాటియుఁ గనఁబోవు ఫలము మృత్యు । దేవిచల్లిన విత్తనమీసయగుట. ౨.

గీ. అకటచంచలచిత్తయైనట్టిలక్ష్మిఁ । గాలునేతులు త్రాటిచేఁగట్టిపెట్టి
యనుభవించుచు భోగముల్ తనుజులకును । నిలుపుదువు సిరిఁబోయిందు నేర్పుమీఱ. ౩.

ఆ. ఐనమృత్యుదేవి నీనేర్పునవ్వఁజు । మ్మొక్క కాపకాచి యుర్విఁజచ్చు
మొలకశాశ్వతముగ నిలుచుబ్రాకుననంటు । గట్టుతోటవానిఁ గాంచినగరె. ౪.

ఆ. నేర్పరిని బాదపరి నెఱిఁబాటుపడువాఁడ । సంచుమదిని సంతసించెదీవు
వెఱ్ఱినరుఁడనీవు వెలతొత్తువోలెను । బరులకొఱకు శ్రమము పడుదుసుమ్మి. ౫.

ఆ. నీదికానిపనికి నాదినాదనుచుఁ బూ । నికొని తిరిగెదీవు సిగ్గులేక
ఉత్తరమ్మునకును రిత్తజిజ్ఞాసమ్ము । పడుటనీదుపనియె వెడఁగునరుఁడ. ౬.

గీ. వృద్ధులకు దేహబుద్ధులు పృథ్విలోన । వశముగామినివారల బాలురంద్రు
మూఁడుఁగాళ్ల ముసళ్లయ్యు మూఢులగుచు । వారొడమె గోరఁగనుటచే బాలురౌర.

గీ. చీమలు వసంతమునయందు శిశిరమునకు । వస్తుతతిమెల్పుతోఁ గూర్పవచ్చుఁగాక
పుట్టినెలలోనఁ జచ్చెడు నట్టిమిడుత । లట్టిపాటుపడుట వ్యర్థమగునకాదె. ౮.

ఆ. బ్రదికినన్నినాళ్లు పరికింపభోగంబు । లనుభవింపఁగలుగ నగునయేని
మనమదాంధకారమునఁ గన్నుఁబ్రమయుట । వసుధఁగొంతసైప వచ్చియుండు.

ఆ. కానిమబ్బులోనఁ గడుబొబ్బలిడుచును । మెఱయుచును జనించు మెఱుపువోలెఁ
బుట్టివెలిఁగియుంచు కట్టె యరిష్టంబు । గొట్టిపోవుభోగ కోటిమనకు. ౧౦.

గీ. ఓయదృష్టమ దవ్వులనున్నవారి । కెంతయును రమణీయమై యెసఁగుదాన
దంబమును దాల్చునల దరిద్రతరొనీదు । చెన్నకట యెండలోవాన చినుకుచెన్ను.

గీ. కన్నుదెఱచి నీపోనున్న కందువగను । మన్నకడవ నీదఁగఁబోకు మన్నకడలి
ఈశ్వరునికీవు నతిమింటి కెగయుమన్న । పుడమినడఁచువ బ్రదుకంగఁ గడఁగుమన్న.

తాడూరి - లక్ష్మీనరసింహారావు.

భామినీవిలాసమున శృంగారవిలాసము. (౨౮౪-పుట శేషము)

మ. సిసి యేతెంచెన; ముగ్ధ? చందువెలుఁగుల్నిండారె దిఙ్మధ్యమం
దు; సుభూషావళి భాములంగముల యందున్నింతురిందుండు; నీ
విసుమంతే విడవల్కుయిప్డనయరో; యీకిన్కచే నీమొడ
ల్వసివాళ్వాడు బిసంపు మొల్కను మృదుత్వంబందు నోడించుటన్. ౫౬.

మ. శయనంబౌతటి మేలుపల్కులు జనుల్సాకన్మనోజోత్సవా
లయవాతాయన వక్త్రమందునిచి బాలారత్నమాస్యాబ్జము,
న్నయనమ్ముల్చలియింప నూరుపుఁ నెండన్మోవి,నానంగుచ
ద్వయిక న్నీటిజడి,ననుస్నివశివా! తజ్జీవితాధీశ్వరున్. ౫౭

ఆ. గీ. వల్లభుఁడు దైవ వైపరీత్యమ్మున | నయనయుగళిదూరుఁ డయిననాఁడు
మొదలు నాయవయవములు దమపనులపైఁ | జెలిమికలిమినెల్ల మలఁపెఁ జెలియ?

ఆ. గీ. కదల నన్నుమేలు కనిపె రేయెల్ల దూ | రగతుండుదయితుఁ; డదనమింత
కన్నఁబలుకఁజాలఁ; గలికి? నన్నడుగకా; | నలువనీకు నిసువనాల్కఁ జేసె.

క. నిపతద్భృగంబురోధ | వ్యపగత చాంచల్యతారకాంచితము మృగీ
విపులాక్షిలోచనోత్పల | మెపుడు గనుఁగొనెడు పున్నెమేఁ గాంచెదనో.

తే. గీ. అమృగేక్షణ నా యీక్షణాధ్వమంద | కున్న లక్ష్మణ యీమందమోలమేల;
సౌఖ్యమింతేని గలిగించు సాధనమ్ము | లేని యీ భువనము ఫలహీనమేల.

తే. గీ. సదనమధ్యముఁజూచ్చుచుఁ జాలిఁబాల. | చననొకింతేని యానతి గొంకఁగఁజాల
వలచుతరుణుల పయినేత్ర వనజమాల | మార్గమునవై చెనప్రతిమానలీల.

మ. హతుఁడన్పాపమరో పొనర్చితిని; సీతాబ్జాస్యనుద్గాన కం
చితి; నాసుందరి నన్నుఁబాసి వని హా జీవమ్ములందాల్చనో;
కృతపుణ్యాననమెట్లుగాంతు; నను వారేమందురో; పొందనీ
క్షితిరాజ్యమ్ము రసాతలమ్మిది; మదింజింతింపనూర్వ్యాననేన్.

ఆ. గీ. వేగసవతియిల్లు విడిచి సమీపముఁ | జెందవల్లభుండు సితనయనకు
నరుణకాంతియుదయమందె వేగ విలోచ | నాంబుజాతకోణ యమళమందు.

క. క్షమియింపఁ జేయఁ బరమప | దములైన పదమ్ములందు దయితుఁడు వడఁ,బ
ద్మములంబోలెడు కోమ నయ | నములందలి యరుణవిభలు నాశముఁ జెందెన్.

తే. గీ. అంగనాజనధైర్యాపహారిశౌరి | రూపుద్రావెడు నేణాక్షిరోసము చిర
కృత బహువిధాపరాధ సంస్మృతివివృద్ధ | మయ్యుఁదత్క్షణగంతుకంబయ్యెనోర.

క. అతిభయమాసన్నము మ | త్ప్రతికూలుం డైనరాజు వలన; న్బాలా?
హతమొనరింపుము తెరువరి | కితవైన నివాసభూమి యిచ్చెదు విధిచేన్. ౬౭.

తే. గీ. విరహమున నైద వికలతఁ బెరయ, నిమును । మున మలయపవనముఁ గను చనలము వలె,
మహిళ నిర్జలమీనసమానమై, య । రణ్యమున వలె మణిమందిరమున నుండె ౬౮.

క. కాలాగురురసమునకు । న్హాలాహలమునకుఁ బోలె నతిభయమందుః
న్నీలోత్పలమాలిక నా । బాలిక వ్యాలాలి పోల్కి భావించును గా. ౬౯.

ఆ. గీ. మోసపఱుచుదైవమునఁ బ్రియుఁ గంకేత । మందిరంపుఁ బోక మానితినను
కామభూమిపాలుఁ డేమియిప్పుడొనర్పఁ దలఁచుకొన్నవాఁడొ దెలియఁ జెలియ?

క. విరహమునఁ గలఁత పడనైద, । పరిదేవించుచును బ్రాణవల్లభ? ప్రాణే
శ్వర? యచుఁ బ్రియుఁడు డాసినఁ । బరిచయహీనవలె బాలపాఱంజూచున్.

మ. కను నీచంద్రుఁడు కాంతిహీనతను; రాకారాత్రివాడొందుః నెం
డు నైసంగుంగుముదంపుఁ గానలనుగందుం బెంపు; సొంపొందు వె
ల్గున దిగ్మధ్యముఁ లాత్మమిత్రులకుఁ గల్గున్మోదముత్తప్తకాం
చనగాత్రీ? వదనాంబుజమ్మున వికాసశ్రీల నీవొందినన్. ౭౨.

మ. అనిలమ్ముల్మలయాచలాలయ భుజంగాధీశ వక్త్రాగత
మ్మన వీచున్బెనుఁ గాఁక తోడ నిదిగో; నామ్రమ్ములా తామ్రము
ల్గనులేర్పుఁ న్బలుకన్హాలాహలము చల్లన్సాగెనీకోయిల;
త్తనువుద్వద్బిసకోమలంబు; సుఋబాలారత్నమెట్లోర్చెడిన్. ౭౩.

మ. నిసి వేంచేసెఁ, మేలుకొల్పుచును నేణీలోచనాచిత్తముః
ల్పొసఁగున్నాహృది నెట్లు కిన్క కిపుడున్బోకున్కియే యిట్టుఁలం
చు, సరోజాక్షి తలంచి తత్తరపడ న్సానాస్త్రరాగాతప
త్రసమంబైన సుధాంశుబింబము దివిభ్రాజిల్లెఁ దానంతలోన్. ౭౪.

మ. తనచేతన్బ్రియుకన్నుమూసెఁ బ్రియ ప్రాతఃకాంతిఁ గప్పన్దలం
పునలీలం జనువొంది, యాతఁడెఱిఁగెన్పూర్వాతి రమ్యంబుగా
దినినాథోదయ మబ్జినీపరిమళస్తైన ప్రభాతానిలో
పనిపాతమ్మున మోదమబ్బ నెపగల్వాంఛిప సంభోగమున్. ౭౫.

మ. దవులన్విస్మయనిశ్చలం, బెఱుకచేఁ దర్వాత నీషచ్చలం,
బవలన్విస్తృతకాంతి యంతటను, లజ్జాభ్రాంతతారంబు, క
న్గవ, యేణార్భక నేత్రకుస్తురల సంఘాతంబులోనుండఁగా
నపు నే నేగినయప్పుడిట్లు బహులీలావాప్తి హృద్యంబాయెం.

చ. పులకలుపైని గ్రమ్మెడుగపోలము లించుక నేస్పృశింప, లో
మొలచెడుమందహాసమున మొత్తముగా ముఖవారిజాతకాం

తులు, కువలాసితాక్షి ఫణితుల్ప్రకటింపఁగ నెట్లు మృద్వికా
ఫలరసమాధురీ మదవిభంజనరీతులు నాతరంబగున్. ౨౭.

శా. ఓ జైవాతృక? రాజుఁజేసెనవిమర్శోద్వృత్తి నిన్నేఁడా
రాజీవాసనుఁడేగె వృద్ధఖిలసారంబూడి నేఁడున్మద
భ్రాజిష్ణుంజనలోచనాసుఖము శశ్వల్లక్ష్మిఁజేయున్మహా
రాజున్నాత్మవిధాత మారుఁడనికారస్థైర్యముంగోరుచున్. ౨౮.

చ. జననయనాపకర్షణ విచక్షణ తేనెలయూటనందనం
దనురుచియేమొ లోచన పథంబును జెందిననాఁటనుండి మో
మునఁ బొడవయ్యె నిశ్వసితము, ల్దెలనయ్యెఁగపోలమూలమం
దు; నడరె శూన్యవృత్తి,కుల తోయరుహాక్షుల నెమ్మనమ్మునన్. ౨౯.

మ. గురుమధ్యమ్మున వల్లవుల్వలుక శ్రీగోపాలబాల ప్రథా
గరిమమ్మున్విని చెక్కులంగురుపు ఘర్మమ్ముఁ గ్రమ్మ న్జ్వల
ద్గరమున్బగ్గునఁ గ్రక్కు పెంజిలువ భోగశ్రేణిపైనట్టువ
ల్గరమాశ్చర్యమటంచు మెచ్చివలపిల్లాల్మాటె బల్మైకుణిన్. ౩౦.

మ. వరుసన్బాల్యము నెందుచుండఁ దనుభావం బింతిమేన, ప్రతీ
శ్వరుఁడే తేరఁగలట్టికాలమునఁ, దత్ప్రమాణ్వదేశమ్మున,
న్బరిపూర్ణేందుతమోమునందు, వికచాబ్జత్వంబుగన్పోయి, సుం
దరసాచిస్మితమందుఁ దాల్చికసుధాతాదాత్మ్యమయ్యెన్వడిన్. ౩౧.

క. దయితయొకర్తుక శైవల। శయనమ్మున శయితబాల చంద్రకళవలె
న్మెయిజిగిమిగుల, సమీపముఁ। బ్రియుఁడొందిన నాదరించుఁ బ్రేక్షణములనే.

తే. గీ. చెలియవాతెరజిగి నిరసించుఁజిగురు;। మోముగెలిచెడి నెరచందమామగోము,
తనువుననుపమ మీవిరించనుని రచన। కామితెలిపెడి నానత భ్రూమతల్లి ౩౩.

చ. తడఁబడఁబల్కు సుంతవడి; దాల్చును మౌనమొకింతసేపు; చూ
చెడు నొకయింతకాలమెదినెందని చూపులఁ నూర్చుఁదద్దయు,
న్బడయఁ డొకించుకం గములపాటువమయ్యెయొ సింహశేశ్వరుం
డుడుగకజానకీ విరహముత్తల పెట్టఁగ నంతరంగమున్. ౩౪.

క. పొడిచెను సుధాంశుబింబము;। విడిచెను గన్నీరుపధిక బృందమ్మపుడే,
పడతుకకెల్లరుదలపై। నిడికొనఁ దనయాన మదనుఁ డెలమివహించెన్. ౩౫.

ఆ. గీ. జలదుఁడుదయమందఁ జదలుకాటుకవలె। నల్లవాఱెఁ; బధికు నల్లమందు
రాగమెసకమెసఁగె; రాజవదనచెక్కు। నందుఁబొండుభావ మగ్గలించె. ౩౬.

క. నిరుపమము చూడుమీసర । సరవింద వృతమ్ము; వదరకటునెచ్చెలి? సుం
దరులనయనములు భస్మీ । కరణ సమర్థములు నాదు గాత్రమ్మునకున్. ౮౭.

క. వదలకు నేఁడును రోస; । మ్ముదయించెను మదిరమూల రోభామినిపయిం
చు, దయితుపలుకులు గ్రోలెను । సుదృగక్షి సరోజకోణశోణద్యుతులన్. ౮౮.

ఉ. సుందరిమందహాసమున శోభిలునీవదనమ్ముఁగాంచి యిం
దిందిర బృందమంబురుహధీ ముదమందున మందమేఁగ చి
హ్నుందలపోసి నల్లని కనుల్లలకల్కు? చకోరము ల్లద
ల్చుందము చంచువుల్తడవు లోఁ చెదునాకలి దీఱునద్దమిన్. ౮౯

చ. ఇది చిఱునవ్వనంజన, దిఁకేమి; నిసర్గలసద్వికాసమా;
నిదిమొవఁడే మొగఁబునసె' యిప్పడతాపులు పుట్టుపువ్వె.యా;
నిది చనుదోయియంటనిజమే, కనకాభ ఫలద్వయంబె, యా;
నిదియొలనాగగాదఖల యేడ్తెఱవంగు లతామతల్లియే. ౯౦.

ఉ. ఆలమునందు ముందుఁబడి యంతమునొందినరాజు లెండలో
వ్రీలుప, మధ్యభాగబిలవిస్ఫురదంబర నీలిమంబుతోఁ,
గాలఁగలోక మిన్ని ఖరకాంతుల భానుఁడు దోఁచునీతఁ;డే
నాలుగుకాళ్ళప్రాణి భువనమ్మున వీని శరించలంచెడిన్. ౯౧.

ఆ. గీ. కావుకలువకంటి కనులకు సహజము । లసిత సితములు; గరళామృతములె;
స్ఫుటము; కాదయేని చూచినయప్పడే। చొక్కలమియు యువలకెక్కు లెట్లు.

క. అలిరో మృగంబో నేత్రము । పోలఁచునెదోయిందుఁ; బద్మమో మృగధరుఁడో
మొలనాగమొగము యిదియని । వలనగునే నిర్ణయింప వలఁతులఁకైనన్. ౯౩.

మ. అలరుంజుక్కలునాఁగడుం బలుచముత్యమ్ము;ల్వెలుఁగొంబర
మ్ముల నించుక్కిత చంద్రికావిభవమై; పాల్పారు నీనెమ్మొగ
మ్మలపూర్ణేందునిమాడ్కి; సుందరి చకోరాక్షీ? శరద్రాకవీ;
వలుపంబైనను సందియంబు వలదీయర్థంబునందుక్కలీ! ౯౪.

క. రూపముసలిలము, కన్నులు । చేఁపలు, నాభిసుడి వేణి, చిలువ, మునుఁగు ని
ష్పాపగణమొందుఁ; దరుణి ఘు । నాపత్తి తరంగిణి యవెయహాజగతిన్. ౯౫.

ఆ. గీ. తన్వి? నీదుమోము తమ్మినిగెల్చోవి । కాంతిమిశ్రములగు కాంతదంత
ముల వరుసలవెలుఁగు లలరు నకరువుల । కరణిఁదోఁచుఁజూచు కవులమదికి.

ఆ. గీ. దయితే? దశనకాంతి దంభమునను గేస । రమ్ములమరుఁ; గుసుమరసముఁగోరి
యలకవేషధారు లళులివియలరెడు; । నీమొగంబుగాదె నీరజంబు. ౯౬.

310 (సశేషము) ఆ- వ్యాసమూర్తిశాస్త్రి.

రామచంద్రవిజయము.(౩౩౨-పుట శేషము)

తెల్లవారినదాఁక కంటిమీఁద నొక్కమారయిన కునుకులేక విలపించుచు రామచంద్రుఁడు కోడికుయ్యగానే రాజగోపాలమును లేపి తనకు మనుష్యుఁ డక్కఱలేదనియు తాను మార్గమునంతయు నెఱుఁగుదుననియు చెప్పి యతనియొద్ద కొంచెము లెక్కపుచ్చుకొని దొడ్డవరమునకెళ్లి మధ్యాహ్నమక్కడ భోజనముచేసి కొంచెము చల్లబడినతరువాత గోదావరిని దాటుటకు వెళ్లెను అప్పుడు గోదావరి జ్యేష్ఠమాసమగుటచే విస్తారభాగమెండిపోయి తాను ధవళేశ్వరముదగ్గర నీప్రకారముగనే పాయలయితినని తెలియఁజేయుటకో యనునట్లు చిన్నచిన్న చీలికలయ్యెను. కాలము మారిపోయినప్పుడు గొప్పవారికైన తిప్పలు గలుగుట సత్యమని తెలుపుటకుఁ గాఁబోలు నసుమ నిసుకతిప్పలుగలవు. ఈ పాయలన్నిటియందును చివరపాయ మిక్కిలి వెడల్పుగలదై యున్నది గాని తక్కినవన్నియు పేరునకుమాత్రము నీరుగల్గి మనుష్యులు చులకనగా నడచిపోవుటకు పాటిరేవులుపడియుండెను. మెత్తని మనస్సుగలవారి చేమున్నను నీప్రకారమేగనే నాటునని తెలియఁజేయుటకో యనునట్లడుగులు వేయగానే దించుకొని పోవుచున్న యిసుకతిప్పలనుండి మూటలు తలలమీఁదఁ బెట్టుకొని పాటిరేవులదాటి చివరపాయ దాటవలెనని రేవుపడవనెక్కుట కనేకమార్గస్థులు పోవుచుండిరి. వారితో గూడ రామచంద్రుఁడు పోవుచు పూర్వకాలమునందు వఱదలువచ్చి యిద్దరొడ్డులకు నీరు దాఁకినపుడు తేరి చూడనైనజాలని బాలకులుగూడ నేడు సునాయాసముగ దాటుచున్న యీ మహానదియొక్క శుష్కస్థితినిజూచి తన తండ్రిగారు సజీవులగునపుడు తన్నతిగౌరవముతో నాదరించినవారును, తనతో మాటలాడుట కనర్హమయినవారును నేడు తన్నవమానపరచుచున్నందున తన దీనావస్థ జ్ఞాపకమువచ్చి కొంచెము విచారించి యూరకొనెను. ఆవచ్చినజనులలో ముక్తేశ్వరగ్రామ కాపురస్థుఁడగు నొక బ్రాహ్మణుఁ డుండెను. అతఁడు లక్షాధికారియని చుట్టుప్రక్కలనున్న యీ జనులందఱు చెప్పిరిగాని యతఁడు కట్టుకొన్న జేబరాపంచెను మీఁదనున్న మాసిన చిరుగుల యుత్తరీయమును చేతులోనున్న పెద్దమూటనుజూచి రామచంద్రుఁడు, భిక్షాధికారిగా నుండఁదగిన యీ మహాలోభియొక్క సంపదలకాశ్చర్యపడెను. మూటతెచ్చిపెట్టుటకొక్క చాకలివానినైనను నతఁడు దెచ్చుకొనలేదు. వారందఱు నీటియొడ్డుననుండగా నింతలో పడవయద్దరినుండి రాగా పడవవాండ్రదివఱ కిచ్చట గుట్టవేయఁబడియున్న చింతపండు కట్లనులను పడవ పడిచెక్కవఱకను మునుగునట్లువేసిరి. పడవప్రాంతము తాగానే తెఱచాపఁద్రొక్కి పడవవాండ్రు దానిని నడుపఁజొచ్చిరి. పడవనడచిన కొలఁది దానితో కదలి నడచివచ్చుచున్నట్లున్న గట్టుమీఁది వృక్షములును లంకలలో మేసి గోదావరియందు నీరుద్రాగుచున్న పశువులును, లంకలయందు కాపులుపెట్టిన

తుమ్మ, తోస, గుమ్మడి మొదలగు పచ్చనిపాములను, “అత్యుచ్ఛ్రయః పతనహేతుః” అను నీతిని తెలియఁజేయుటకో యన మొదట నుత్తుంగముగా లేచి తుదకు పడిపోవుచున్న కెరటములను, నదిమీఁదినుండి వచ్చుచున్న మందమందమారుతమును రామచంద్రుని దుఃఖమును కొంత పోఁగొట్టెను. తప్పత్రాగి స్మారకము తెలియకుండనున్న యా మగ్గురు పడవవాండ్రలో నొకఁడు కూర్చుని కునికిపాట్లుపడుచు చుక్కానిపట్టుచుండెను. తక్కిన యిద్దరును పడవలో మర్యాదగల స్త్రీలు కూర్చున్నను, సందేహములేక నోట నుచ్చరింపరాని బండబూతులుగల కీర్తనలను పాడుచుండిరి. కొంతదూరము పడవ నడవగానే సరంగు డబ్బులను పుచ్చుకొనుటకు వచ్చెను. పాపమొక కాపువానిదగ్గఱ మొదట నాలుగుడబ్బులను పుచ్చుకొనుటకు నొప్పుకొని సగమునదిని దాటినతరువాత నాఱుడబ్బులను పుచ్చుకొందుననియు, అట్లియ్యనియెడల మధ్య నొకతిప్పమీఁద దిగుమనియు, నతఁడు బాధపెట్టనారంభించెను. అతనిదగ్గఱ సొమ్ముపుచ్చుకొని సరంగు రెండవవానిదగ్గఱకుఁ బోయి యడిగెను. అతఁడు, “నేను రేవుదగ్గఱ పడవయజమానునికిచ్చినాను. అతఁడు నీతో చెప్పలేదా?” అని యడుగగానే సరంగు కోపముతో “నాకీసంగతి పనికిరాదు. డబ్బులియ్యగలిగిన నియ్యి లేనిచో దిగిపో” అని చెప్పి మొదట పడవయజమానుఁడు డబ్బులు పుచ్చుకొన్నసంగతి తానెఱిఁగియు తిరిగి సొమ్ము పుచ్చుకొనెను. ఇట్లు పడి చెక్కవఱకును పూటమైన పడవ దైవవశముచేత సుడిగాలికి వశమయ్యెను. రామచంద్రుఁడు తనకు దాహమగుటచే ముక్తేశ్వరగ్రామ కాపురస్థునిదగ్గరనున్న చెంబాకమారడిగెను. అతఁడు మహాకోపముతో “మైలవాఁడవు నీకు బ్రాహ్మణులము చెంబేలాగున నివ్వగలము” అనిచెప్పెను. తరువాత నెండబాధచే రామచంద్రుఁడా బ్రాహ్మణునియొద్ద గూర్చుండుటకు రాగా నతఁడు కోపముతో “ముట్టుకుంటావు కళ్లుకనపడవూ? యెవరనుకున్నావు” అని కోపపడి వానిని లేవగొట్టెను. అప్పుడు సుడిగాలితో గాలిదుమారమువచ్చి భూమ్యాకాశమధ్యమంతయు నొక యిసుకతెరలో నింపి పడవకపాయమును కలుగజేయునట్లు చేసెను. ఆసమయమిట్లుండెను.

మ. నటదుత్తుంగ తరంగ సంఘములరన్ బాత్రౌఘమై రంగము
ద్భటగోదావరిగాంగ భూ గగనమధ్యవ్యాప్తధూళి వ్రజం
బటనే పథ్యనుగాంగ రౌద్రరస దృశ్యగ్రంథమాడించెడున్
జటుజంఝానిల సూత్రధారుఁడు మహాపాండిత్య మేపారఁగన్.

కెరటములు మహోత్తుంగముగలేచి పడవను పగులునట్లు కొట్టుచుండెను. దోనె యిటునటు నూరుగుచు కొంచెకొంచెము నీరుపోసుకొన నారంభించెను. పడవలో

స్త్రీలు, బాలురు, వృద్ధులు, నల్లకల్లోలముగా ధ్వనిచేయుచు సరంగును తెఱచాప దింపుమని ప్రార్థించిరిగాని యతఁడు భయములేదనియు త్వరగా దింపుదుననియు చెప్పెను. ఒకపర్యాయము నదికి వంగివంగి నమస్కారము చేయుచున్నదో యనునట్లు దోనె మిక్కిలి యొరుగగా నందఱును పెద్దపెట్టున గోలపెట్టి యేడ్చిరి. పడవ మునుగక మానదని యందఱికును తోఁచెను. ఆసమయమందు తల్లులను కౌఁగిలించుకొని యేడ్చు బిడ్డలును, బిడ్డలనుజూచి యేడ్చు తల్లులును, పడవవాండ్రను గట్టిగా తిట్టి కొట్టబోవు వారును, నారాయణ నారాయణయని ధ్యానముచేయువారును, గంగాస్తవము పఠించు వారును, కొబ్బరికాయలు, పసపు, కుంకుమ, చీరెలు, గంగకు సమర్పించువారును, దేవతలకు మ్రొక్కువారును, చేయుధ్వనులు ప్రతిధ్వనులిచ్చుచుండెను. ఆసమయమందు ముక్తేశ్వరబ్రాహ్మణుఁడు రామచంద్రునియొద్దకువచ్చి యతనికేమైన కొంచెమీఁతవచ్చు నేమోయని యడిగెను. రామచంద్రుఁ డూరకుండెనుగాని యతని శాంతమును మనస్స్థిమిత మునుజూచి యీఁతవచ్చునని యూహించి యాబ్రాహ్మణుఁడు రామచంద్రుని గడ్డమును, కాళ్లను, చేతులను, పట్టుకొని తనప్రాణము నెట్లైన రక్షింపుమని బ్రతిమలాడ నారంభించెను. ఇప్పటికి దోనె దాదాపుగా నొడ్డున కేబది గజములదూరములోనుండెను. పడవ మునుగుటకు సిద్ధముగా నుండినపుడు రామచంద్రుఁడు జందెము మెడకుజుట్టి నడుమునకు బట్ట గట్టిగాఁగట్టి ముందుగా నదిలోనికిదుమికి పడవలోనున్న నిద్దఱు పిల్లలను తనమీఁద నెక్కించుకొని యీఁదియొడ్డున దింపెను. అదిజూచి యందఱును మము రక్షింపుము, మము రక్షింపుమని వేఁడుకొనిరి. ఈలోపుగా నొక పెద్దగాలిరాగా పడవ తలక్రిందై మునిగిపోయెను. త్వరగా దింపుదునని వాగ్దానముచేసిన సరంగు తన మాట దప్పకుండ వారిని త్వరగా గంగలో దింపెను. ముక్తేశ్వరబ్రాహ్మణుఁడు రెండు మునుఁగులుమునిఁగి నాలుగు గుక్కలు నీళ్లుత్రాగి మూఁడవమాఱు తేలినతోడనే, పిల్లలను దింపి తిరిగి యెవరికైన సహాయముచేయుటకు పడవదగ్గరకు వచ్చుచున్న రామచంద్రుని గొంతు గట్టిగాఁ బట్టుకొనెను. రామచంద్రుఁడు వదలుమని ప్రార్థించెనుగాని వదలు మనుకొలఁది మఱింతగట్టిగాఁ బ్రాహ్మణుఁడు పట్టుకొన నారంభించెను. రామచంద్రుఁడును, బ్రాహ్మణుఁడునుగూడ చచ్చిపోవునట్టి సమయమువచ్చినట్లు కనఁబడెనుగాని రామచంద్రుఁ డుపాయశాలిగనుక బ్రాహ్మణుఁ డెంతకును వదలనప్పుడు వానిని గట్టిగా కొఱికెను. తోడనే బ్రాహ్మణుఁడును పట్టువదలెను. రామచంద్రుఁడును భూతదయాళుఁడు కాఁబట్టి యాబ్రాహ్మణునియందు మహాదయగల్గి వెనుకకువచ్చి రెండుమూఁడు తన్నులతో యొడ్డునకుపంపెను. పిమ్మట రామచంద్రుఁ డాబ్రాహ్మణుని గట్టునకెత్తు కొనిపోయి నీరుద్రాగుటచేత నెత్తుగానుబ్బియున్న పొట్టమీఁద నడుగువేసి త్రొక్క

నీటిని వెలికిదీసి వానిని బ్రతికించెను. ఇంతలో నొక పడవవచ్చి యీ జనులను రక్షించుటకు ప్రయత్నము జేసెనుగాని సగముకంటె నెక్కువ జనులా దుర్దినమునందు మృతినొందిరి. రామచంద్రుఁడు సహాయమియ్యనియెడల ముక్తేశ్వర బ్రాహ్మణుఁడును పడవ వచ్చునప్పటికి స్వర్గంబున పాతకాఁపైయుండును. అంతట బ్రాహ్మణుఁడు రామచంద్రునితో "అయ్యా! మీఋణము నేనెన్నటికైనను దీర్చలేను నా యావదాస్తిం మీకిచ్చినను నా ఋణముతీరదు. మీకు తగిన బహుమాన మేదైన నివ్వవలెననియున్నది. మీరు నాతోకూడ ముక్తేశ్వరము దయచేయవలెను. నా ప్రార్థన మంగీకరింపవలసినది." యనిచెప్పగా రామచంద్రుఁడు "సరిసరి; ఈమాత్రపుపనికి బహుమానమీయవలెనా? నాచేతనైన సహాయము నేను చేసినాను మీరేమియు నియ్యనక్కఱలేదు. దయమాత్ర ముంచండి! తమరు పెద్దలు" అని ప్రత్యుత్తరముచెప్పి యొక్క తృణమైనను పుచ్చుకొనకయే రామచంద్రుఁడు రాజవోలునకుఁబోయెను ఆ బ్రాహ్మణుఁడుగూడ శివకోడు గ్రామమునుచేరెను. రామచంద్రుఁడు రాజవోలు వెళ్లునప్పటికి సాయంకాలమైనందున మేనమామ కుమారుఁడు వీధి యరుగుమీఁద కూర్చుండెను. ఆ పిల్లవానినిఁజూడగానే రామచంద్రుఁడు "నాయనా! యెంతకష్టమువచ్చినదని యతనినిఁ గౌగలించుకొని యేడువనారంభించెను. ఈతడెందుకేడ్చుచున్నాడో తెలియకుండ కుఱ్ఱవాఁడుకూడ పెద్దపెట్టున నేడ్వసాగెను. ఇద్దఱును లోపలికిపోగానే వారినిజూచి మహావిపత్తు తటస్థమైనదనుకొని మేనత్తగూడ నేడువనారంభించెను. చుట్టుప్రక్కలనున్న మనుష్యులందఱునుఁజేరి "యేమి? యేమి?" యని యడిగిరిగాని వారు ప్రత్యుత్తరమునుఁ జెప్పకయే వెక్కివెక్కి యొకరిసంగతి నొకరెఱుఁగకుండ వారందఱును దుఃఖపడుచుండిరి. ఆ వినోదమునుఁ జూడవచ్చినవారును; కష్టమేమో గలిగినదని యూరడింప వచ్చినవారును, సంగతిని తెలిసికొనవలెననువారును గుమిగూడి యింటిచుట్టునుఁ జేరిరిగాని యొకరికిని దుఃఖకారణమేమో తెలియదయ్యెను. అప్పుడు రామచంద్రునివలెనే యున్న యొక నలువదియేండ్ల బ్రాహ్మణుఁడు గుంపుగూడిన జనులనందఱిని చేతులతో తోసుకొని యతిత్వరితముగా వచ్చి గుండె బాదుకొనుచు "ఏమి? నాయనా ఏమి? నాయనా" యని రోజుచు లోనికివెళ్ళెను. అతనినిఁజూచి రామచంద్రుఁడు మిక్కిలి యాశ్చర్యపడి నోటివెంట మాటరాక నిశ్చేష్టుఁడై తెలివిదెచ్చుకొని లేచి యావచ్చిన మనుష్యుని కవుగలించుకొని "మామయ్యా! నీవు బ్రదికియున్నావా? ఎవరో దుర్మార్గులు నీవు చచ్చిపోయినావని చెప్పినారు. అందుకు నేనిక్కడికివచ్చినాను" అని చెప్పిన యీ విపరీత వృత్తాంతమునంతయు మేనమామ విని యెవరో విరోధులా పనిచేసినారని నిశ్చయించి యింటసందడిని నూరకొమ్మని చెప్పి తరువాత రామచంద్రుఁడును తానును కష్ట

సుఖముల జెప్పుకొనుచుండిరి. మేనల్లుఁడు మేనమామతో తాను రాజవోలు బయలుదేరి వెళ్ళినది మొదలుకొని యీ నాటివఱకు జరిగిన యావద్వృత్తాంతమును పూసగ్రుచ్చి నట్లు చెప్పగా మేనమామయు, శోభనాచలము మొదలైనవారి చరిత్ర విన్నప్పు డాశ్చర్యమును, కష్టముల విన్నప్పుడు విచారమును, కష్టనివారణమగునపుడు సంతోష మును, గనుపరచుచు, శరభరాజుగారి యుదారగుణముల స్తోత్రముచేయుచు, రామ చంద్రునితో మాట్లాడుచుండెను. అతఁడక్కడ నొకవారము దినములుండెను ఆలోపుగా నా గ్రామ నివాసుడొకఁడు మంత్రిప్రగడ వెంకటరత్నమునకు తమపిల్ల నియ్యవలెనని యాతని గుణావగుణములనుగూర్చి రామచంద్రుని నడుగగా నతఁడు వెంకటరత్నముయొక్క దుర్గుణాదులనుగురించి తనకు తెలిసినంతమట్టుకు నిజమును చెప్పెనుగాని కల్లలాడి యిల్లు నిలుపు మనుశాస్త్రము నతడనుసరింపలేదు. వారముదినములక్కడ నిలిచిన తరువాత మేనమామదగ్గర సెలవుపుచ్చుకొని ప్రయాణమై సుఖముగా రామచంద్రుఁ డచలాపురముజేరి యక్కడి వారందఱితో నీ ఘోరమయిన వృత్తాంతమునుజెప్పి వారందఱి నాశ్చర్యమగ్నులజేసెను. రాజవోలులో రామచంద్రుఁడు వెంకటరత్నము యొక్క వివాహమునుగురించి మాటలాడిన మాటలతనికి నేలాగుననో తెలిసినందున రామచంద్రుఁడు తనకుఁజేసిన మహోపకారమునకు మిక్కిలి కోపించి అతఁడొకనాఁడు రామచంద్రునితో నిట్లు మాట్లాడనారంభించెను.

వెం— ఏమోయి! రాజవోలు విశేషములు. మీ మామగారు బాగున్నారా?

రామ— ఆః బాగున్నారు. విశేషము లేమియు లేవు.

వెంక— రాజవోలులో నాకు వివాహవిషయమై సహాయము నీవు చక్కగా చేసినావు.

రామ— నేనుజేసిన దేమున్నది. వారు నన్నువచ్చి యడిగినారు.

వెంక— అడిగితే నన్నుగురించి నీవేమిచెప్పినావు? నీకు నామీఁదనున్న కసి యంత తీర్చుకున్నావు కాబోలును!

రామ— నాకు తమమీఁద కసియేమున్నది. నా పెద్దలను మీరు చంపినారా? మీ పెద్దలను నేను చంపినానా? నాకు తమమీఁద కోపముండుటకు నేనెంతవాడను?

వెంక— ఎంతవాడవు గాకేమి? ఎంతవాడవు గాకుండ నీ యచలాపురము వచ్చినావు? నీవు పొట్టకూటికి మాయింటియొద్దనున్నను నీకున్న గీర్వాణ మెవరికిని లేదు నీకు కన్నులు నెత్తికివచ్చినవి. నీముందఱ మేమెంతవాళ్ళము? పీటలమీఁద పెండ్లి చెడగొట్టి యేమి బావుకొన్నావు? నీకు సిగ్గుభిడియములు లేవేమి!

రామ — అయ్యా! తమకంతకోపమెందుకు? నాకుతోచిన యభిప్రాయమును నేను దైవముఖమునుజూచి నిశ్చయముగా చెప్పినాను.

వెంక — నీకు నాసంగతి యేమితెలుసును? నేను వుండనుంచుకుంటే నీకేమి. నాయంతవాడను నేను నీయంతవాడవు నీవు. ఒకరిదగ్గఱ నాప్రచారము నీవెందుకెత్తవలెను? నీవు మంచివాడవాయేమిటి? గురువిందగింజ తన క్రింది నలుపెఱుంగదట. నీయిష్టమువచ్చినట్లు ప్రేలుటకు నేనెవరనుకొన్నావు? పెండ్లివచ్చినప్పుడు వేయియబద్ధములాడియైన నొకకొంప నిలువబెట్టవలెనన్నమాటయయినను నీవు వినలేదు? నీవది వెందుకు తగలబెట్టినా? ఒకరు పచ్చగానున్నపక్షమున నీకింత యోర్వలేవేమి? ఆహాహా! యెంతబుద్ధిమంతుడవయ్యా! సత్రములో రాళ్లువేయునట్టిముచ్చులాగుననున్నది.

రామ — నేను మీయందుగల మొగమోటముచేత నబద్ధము జెప్పినపక్షమున నాప్రాణమునకు సూరుకుని యాపిల్ల యేడ్చును. నూఱేళ్లు బ్రతుకవలసిన బ్రతుకు.

వెంక — సత్యవాదివి బయలుదేరినావు. భూలోక హరిశ్చంద్రుఁడవు. తిన్నయింటి వాసములు లెక్కపెట్టుటలో తెలివిగలవాడవు. తల్లిపాలుత్రాగి రొమ్ముగుద్దినాడన్న సామ్యము నీదగ్గఱనే నిజమైనది. ఇందుకే నియోగపువానిని జేరఁదీయగూడదని శాస్త్రము చెప్పినవాఁడు వెఱ్ఱివాడా?

అనియిట్లు వెంకటరత్నము తానుకూడ శరభరాజుగారియింట పొట్టకూటికిఁ జేరినవాఁడే యనుమాట మఱచిపోయి రామచంద్రుఁడు తనయింటనే యుండినట్లును, వానిని తానే సంరక్షించుచున్నట్లును తలచి, తలవాచిపోవునట్లు వానిని చీవాట్లుపెట్టి మాటలతో తన వాదమును ముగింపక చేతులుకూడ కలుపుటకు సిద్ధముగానుండెను గాని రామచంద్రుని యదృష్టము బాగుండి యింతలో లోపలినుండివచ్చి శరభరాజుగారు వెంకటరత్నమును రామచంద్రుని కేకలువేసి వారి వివాద నివారింపఁజేసిరి. రామచంద్రుని సత్యవాదమతనిని మహాపదలపాలుజేసెను. ఒకనాడు వెంకటరత్నము మనస్సులో నేదో తలచుకొని రెండువేళ్లుచాపి యిందులో నొకవ్రేలుపట్టుకొమ్మని నరసింహమునడిగెను అతడే రెంటిలోపొడుగువ్రేలుపట్టుకొనగా నదియతనిమనస్సులోనున్న యభిప్రాయమునకు సరిపడకుండునను, నశుభసూచకముగానున్నందునను వెంకటరత్నము, కోపమువచ్చి "శకునపక్షి వెధవా! ఎప్పుడునింతే; చవటచేతులపెద్దమ్మ" యని టెంగున నొకమొట్టికాయ మొట్టెను. దానితో కుఱ్ఱవాఁడు కెవ్వున గుక్కదిరుగకుండ నేడ్వగా లోపలినుండి కృష్ణవేణమ్మగారువచ్చి రొంపదు కొట్టినారని యడుగగా రామచంద్రుడు సంగతినంతయు జెప్పెను. కృష్ణవేణమ్మ వెంకటరత్నమును కొంచెము చివాట్లు పెట్టెను. ఇట్లొకదానికంటె నొకటి బలమైన కారణములచేత వెంకటరత్నమునకును

రామచంద్రునకును మనస్పర్థ హెచ్చగుటచేత వెంకటరత్నము తనకసిదీర్చుకొనుటకు రామచంద్రుఁడు చదువుకొనుచున్నప్పుడతని కేదైనపనిచెప్పి యతడు చేయుటకు వీలులేదనగానే యావార్త శరభరాజుగారితోను వారితల్లితోనుచెప్పి "తిండికిసిద్ధముగానుండును గాని పనికినల్లగాదు. మా యింటనున్న వారికి మాకంటె నెక్కువ రాజసము" అని చెప్పుచు తనచేతనైన యిబ్బందులు పెట్టుచుండెను. దేవుడు వరమిచ్చినను పూజారి వరమియ్యడన్నట్లు శరభరాజుగారికి దయయున్నను వెంకటరత్నమునకు కటాక్షములేకుండుట యొక పెద్దచిక్కుగా నేయుండెను. ఒకనాఁడు రాత్రి భోజనములయినతరువాత శరభరాజుగారు లోపల సావటిలో పచారుచేయుచుండగా రామచంద్రుఁడు దీపము వెలుగున చదువుకొనుచుండెను. అప్పుడు వెంకటరత్నము రామచంద్రుని మెల్లగా పిలిచి యిట్లనిచెప్పెను.

వెంక.— అబ్బాయి! ఆమధ్య నిన్ను నేనన్నమాటలు మనస్సులో నుంచుకోవద్దు సుమీ! నామనస్సులో కల్మషములేదు. అప్పటికప్పుడు కోపమువచ్చినప్పుడు పిచ్చముండాకొడుకువలే నాలుగు కేకలువేయడమేగాని దీర్ఘక్రోధముంచుకోను— మన మందఱముగూడ నొకయింట నుండేవారము. ఈవేళ నాలుగనుకొన్నను రేపు తిరిగి కలిసేవాళ్లము మనమే. నన్ను నీవన్నను నిన్ను నేనన్నను నది లెక్కలోనిదిగాదు. నేను పయికీలాగున కోపముగా కనుపడుటేగాని నీవిషయమైన సంగతి నేదయిన శరభరాజుగారితో ప్రసంగించవలసినపుడు నేనెంత కట్టుదిట్టముగ చెప్పుచుందునో పరమాత్మునకు తెలుసును.

రామ.—చిత్తము. తమదయ యున్నపక్షమున నాకేకొఱఁతయునుండదు. నేను మిమ్మునందగను నమ్ముకొన్నవాడనే గనుక నాభారమే మీది.

వెంక.— ఒకపర్యాయము వీధిలోకిరా (అని వీధిలోనకి తీసికొనివెళ్ళి) సూర్యనారాయణగారూ! దయచేయండి.

అని యతడు పిలువఁగానే తెల్లని తలపాగనుఁ బెట్టుకొని నిలువుటంగీ దొడుగుకొని మంచి జరీపంచెగట్టి, చేతిలో నొక వెండిపొన్నువేసిన కఱ్ఱపట్టుకొనయున్న యొకబ్రాహ్మణుడువచ్చెను. అతనినిజూచి రామచంద్రుఁడు "తివాసీపట్టుకొనిరానా?" అని యడిగెనుగాని యా వెంకటరత్నమును బ్రాహ్మణుఁడును, వద్దనిచెప్పగా వారందఱు వీధి యరుగుమీఁద మూలకూర్చుండిరి.

వెంక— రామచంద్రుఁడూ! నీవు ఒక్క సహాయము చేయవలయును యీయన దేశిరాజు సూర్యనారాయణగారు. వీరు దేశపాండ్యాలు, కోటిపల్లి కాపురము. తాతముత్తాతలనాటనుండియు శ్రీ విజయనగరము మహారాజాగారిదగ్గర పెద్దయుద్యోగము

లను జేయుమన్నవారే వారిది నూఱుపుట్లభూమి. వెనుకటి నందనసంవత్సరపు కఱవులకు వీరుజేసిన యన్నదాన మింతింతయని చెప్పనలవిగాదు. మూడేండ్లు జనులు కుటుంబములతోవచ్చి వారిగ్రామములో కాపురమున్నారు. నీవు వినియుందువు. జగత్ప్రసిద్ధులు.

రామ— నేనెన్నడు నెఱుఁగను మహానుభావులుంటారు.

సూర్య— అవి అన్నియు నెందుకు? ఆదినములువేరు ఆకథవేరు చావలేక నీలాగున బ్రతుకుచున్నాము. ఈస్థితి ఈవేషము యిది లేదు.

వెంక—అందుచేత నప్పులు విస్తారముకాఁగా భూములు తాకట్టులోనున్నవి. ఇంటనున్న జవాహిరీనంత విక్రయించి వీరు కాలక్షేపము చేయుచున్నారు అయితే యీనగలను కోటిపల్లిలోను చుట్టుపట్లనుమాత్ర మమ్మరు. పూర్వులమ్మినచోటనే కట్టెలమ్మవలసివచ్చెను. ఆనగలను మాగ్రామము తెచ్చి యమ్ముచుందురు.

రామ— నేనిప్పుడేమి సహాయము చేయవలెను? పాపము నాకు విచారముగానే యున్నది.

వెంక— మరేమి గొప్పసహాయము లేదు. నీయందు కోమట్లకు మహా గౌరవము గలదు నీవమ్మినపక్షమున మోసముచేయరు. నీకు బంగారము నాణెము తెలుసును. ఈవస్తువులు నీవమ్మిపెట్టి యతనిమర్యాద కాపాడవలెను.

రామ— యీమాత్రపుపని కింతమనవిగావలెనా? నాచేతనైన దానిలో మీకు తగినంత సహాయము చేయగలవాఁడను.

సూర్య—అయ్యా! యిది రెండవవానికి తెలియనివ్వవద్దు నాకు సిగ్గుగానున్నది. అందుచేతనే యీవస్తువులను అంతదూరమునుండి యింతదూరము తెచ్చి యమ్ముచున్నాను. అక్కడ ధరరాకపోలేదు.

రామ— తమరు చెప్పినతరువాత నెవరికైన తెలియనిత్తునా? నాకు బంగారము నాణెము చక్కగా తెలియును.

వెంక— తెలిసినంతమట్టుకుచాలు. రాజగోపాలమునకైన తెలియనీయకు. ఇవిగో వస్తువులు. కంటె నూఱురూపాయలు ధర. ఉంగరము యేబదిరూపాయలు. ఈయన తిరిగి రేపురాత్రి మనదగ్గఱకువచ్చి ఈసొమ్ము పుచ్చుకొందురు. రేపుపగలు నీవివి విక్రయించుము.

రామ— ఆయన రాత్రి రావడమెందుకు? పగలు రారాదా?

వెంక— పగలువచ్చినపక్షమున శరభరాజుగారు బలవంతపెట్టి భోజనమునకు రమ్మనుమని నిష్ఠూరములాడగలరు ఎందుకు? రాత్రేమంచిది.

348 (సశేషము) చిలకమర్తి లక్ష్మీనరసింహము.

భాస్కరవిలాసము. (౩౨౮-పుట శేషము)

వెంటనే నామొదలగు ఇరువదిమంది పేరులను వ్రాసి. అప్పటికిఁ దనకోర్టులోనున్న ప్లీడరులు చాలక జనులు బాధపడుచుండిరనియు, ఎలమంచిలి పర్వతప్రాంతదేశమగుట వలన అక్కడకుఁ బరీక్షలోఁ దేరిన యితరస్థలస్థులు రానొల్లకుండిరనియు, పరీక్షలీయ కున్నను మేము ప్లీడరు గుమాస్తాలుగానుండి అనుభవమువలనఁ బనియెఱిఁగియున్న వారమనియుఁ, గాఁబట్టి మాకుఁ బట్టాలిప్పింపఁదగుననియు, జిల్లాజడ్జిగారికి ఆయన విన్నపముఁబంపెను. జడ్జిగారును మఱికొన్నిదినము లయినతరువాతఁ గార్యాంతరము మీఁద ఎలమంచిలి విజయంచేసి ప్లీడరు పట్టాలకొఱకు విన్నపముపంపినవారిని తాను స్వయముగా చూచెదననియు, వారందఱును ప్రాతఃకాలమున నేఁమిదిగంటలవేళ కోర్టుకు రావలయుననియు, మునసబుగారితో సెలవిచ్చి మాకందఱకును వార్తలను బంపించెను. మాలో తక్కినవారందఱును ఏడుగంటలు సరకే వెళ్లి కనిపెట్టుకొని యుండిరి. కాని నేనుమాత్రము ఎనిమిదిగంటలకు రమ్మన్నప్పుడు తొందరపడనేల యనియు దేహము శుభ్రముగా నుంచుకొన్నవారినిజూచిన దొరలకుఁ బ్రీతియనియు నెంచి క్షౌరముచేయించుకొని స్నానముచేసి బయలుదేఱి వెళ్లితిని. నేను వెళ్లునప్పటికి ఎనిమిదిగంటలమీఁదఁ బదినిమిషములకంటె హెచ్చుకాలేదుగాని అప్పుడే జడ్జిగారు తాను పట్టాలిప్పింపఁ దలఁచుకొన్న పదిమందిపేళ్ళు వ్రాసికొని కలము క్రిందఁబడవైచెను. నేనువెళ్లి సలాముపెట్టి నిలువఁబడఁగా 'ఎవర'ని దొరగారు మునసబుగారి నడిగెను. నేనును పట్టాకోరుచుండినవారిలో నొకఁడనని మునసబుగారు చెప్పఁగా, 'మఱి యెవ్వరికిని బట్టాలనిప్పింప' నని చెప్పి దొరగారు లేవఁబోయెను. అప్పుడు నామాంద్య మును నేను మిక్కిలి దూషించుకొంటిని. కాని అట్లే విషణ్ణుఁడనయి యూరకుండక దొరగారికి సంస్కృతమెఱిఁగిన పనిచువాండ్రయెడ మిక్కిలి ప్రీతియని నేనంతకు మునుపు వినియుంటినిగనుక, నేను సంస్కృతమును ఇంగ్లీషునుగూడ ఎఱిఁగినవాఁడ నగుటవలన ప్లీడరుపనికిఁ గావలసిన శాస్త్రములను చదివియుంటిననియు, నాన్నగారి యొద్దఁ బనిచేయుచు అనుభవమువలన ఆచారమునుగూడ నేర్చితిననియు, సంస్కృత భాషతో తొందరగాఁ జెప్పితిని. జడ్జిగారు నా సంస్కృత పరిచయమునకుఁ బ్రీతుఁ డయినవానివలెఁగనఁబడి, మునసబుగారివంకఁ జూచి, ఆయన, నాకు పనిపూర్ణముగాఁ దెలియుననియు, నాకు పట్టా యిప్పింపఁదగుననియు, మనవిచేయఁగా, నా పేరుకూడ వ్రాసికొనెను.

ఇట్లు కృతార్థుఁడనయి సంతోషించుచు మెల్లఁగా అక్కడను ఇక్కడను తిరిగి నేనింటికివెళ్లునప్పటికి, ఏమిచెప్పుదును? నాన్నగారు స్మృతితప్పి పడియుండెను. నేను కోర్టుకు వెళ్ళునప్పటికే వేళ మించెననియు, అంతకుమునుపే జడ్జిగారు తన

యెదుటకి వచ్చినవారిలో పదిమందినెంచి పట్టాలనిప్పించెదనని పేరులు వ్రాసికొనె ననియు, నేను వెళ్లి యడుగఁగా, మఱియెవ్వరికిని పట్టాలు దొరకవని సెలవిచ్చెననియుఁ నాన్నగారితో నెవ్వరో చెప్పిరఁట. ఆమాటవిని నాన్నగారు పెదవి విఱుచుకొని మాటాడకూరకుండెనఁట. క్రమక్రమముగా గుండెకొట్టుకొనుట హెచ్చయి తుదకు స్మృతికూడఁ దప్పెనఁట. నేను త్రోవలో జాగుచేయక వెంటనేవచ్చి నాకు పట్టా దొరకుననన్న శుభవార్త నాన్నగారితోఁ జెప్పనయితినిగదా యని నేనప్పుడుపడ్డ పరితాప మింతింతయని చెప్పఁజాలను. పరితాపమువలన నేమిలాభము? మఱియొక గంటసేపటికి నాన్నగారికూపిరిపోయెను. ఆ దుఃఖసమయమున అమ్మ యేసందుననో లేచి వెళ్లి నూతఁబడి ప్రాణము విడిచెను.

చతుర్థాశ్వాసము.

నాన్నగారియందలి విశ్వాసముచేత ఆయనను ప్లీడరుగా నుంచుకొనుచుండినవా రెవ్వరుగాని నన్ను విడువలేదు. నేనును మామగారు 'భాస్కరుఁ డెందుకును బనికి రాఁడ'ని చెప్పుచువచ్చిన మాటను అసత్యపఱుపవలయునన్న పూనికతో మిక్కిలి జాగరూకుఁడనయి చుఱుకుగా పనిచేసితిని. ఈ హేతువులచేత నాన్నగారి వచ్చుబడికి నా వచ్చుబడి అంతగా తగ్గలేదు. మామగారికిని నా భార్య వ్రాయుచుండిన జాబులను బట్టియు ఇతరులవలన ఆయన వినుచుండిన మాటలనుబట్టియు నాయందలి తొంటి దురభిప్రాయము పోయెను. కొన్నాళ్ళకాయన కొమార్తెకు వ్రాసిన యొకజాబులో చిరంజీవి భాస్కరుఁడు అశ్రద్ధవల్ల పనులు పాడుచేసికోకుండా వ్యవహారములు బాగా చక్కఁబెట్టుకుంటూ నిన్ను సుఖపెడుతున్నాడని వినడముకంటె నాకు ఎక్కువ సంతోషమేమున్నది. దీనితో నా మునుపటి యభిప్రాయమును వదలుకొన్నాను" అని తెలియఁజేసెను. నాభార్య ఆజాబును చిఱునవ్వుతో నా చేతికిచ్చి తానక్కడ నిలువక లోపలకుఁబోయెను. నేనది చదువుకొని పరుగెత్తివెళ్ళి దానిని ముద్దుపెట్టుకొనకమానఁ జాలనయితిని. మఱియును అప్పటికి నెలతప్పియున్న నాభార్య మగబిడ్డను గన్నయెడ ఆబిడ్డకు మామగారిపేరుపెట్ట నిశ్చయించుకొంటిని.

ఆ సంతోషముచేత నాఁటి కోర్టుపని నేనేమియుఁ జేయలేదు. మఱునాఁడయి నను నా సంతుష్టాంతరంగము పనిమీఁదికిఁ బోలేదు. ఇట్లు రెండుమూఁడు దినము లయినతర్వాత పని పెరిగినందువలన అదియంతయు ఆదివారమునాఁడు తెరపిచేసికొని దాఖలుచేయవలసిన కాకితములు సోమవారమునాఁటి కోర్టులో దాఖలుచేయ నిశ్చ

యించుకొంటిని. ఆదివారమునాఁడు క్రొత్త మునసబుగారు పంచధారకు విజయం చేయుచు కోర్టువారినందఱిని రండని సెలవిచ్చినందున నేనును వెళ్లితిని. మఱునాఁడు వచ్చి అలసటచేత ఏపనియుఁ జేయఁజాలనైతిని. ఇట్లొకనాఁటికొకనాఁడు పని మిక్కిలి పెరుగుచుండెను క్రొత్తగా దాఖలుచేయవలసిన దావాలును అమలుమోశనులు చేయవలసిన డిక్రీలును అచిరకాలములోనే కాలదోషముపట్టునవి పెక్కులు పడియుండెను. అమలుమోశను కాగితములెట్లెట్లో గుమాస్తాచేత వ్రాయించి దాఖలుచేసితినిగాని క్రొత్త దావాలు తేవలసిన పత్రములు అప్పటికి నెలదినములలోపలనే రాఁబోయెడి వేసంగిసెలవులలోఁ జూచి ప్లెయింట్లు వ్రాసియుంచి సెలవులపిమ్మట దాఖలుచేయ నిశ్చయించుకొంటిని. కొన్ని వ్యవహారములలో సలహాకోరి కొందఱు క్లయ్యెంట్లువ్రాసిన జాబులకును సెలవులలోనే ఉత్తరములు వ్రాయఁదలఁచుకొంటిని. కాని సెలవులీయఁగానేమామగారువచ్చి తమకూఁతును నన్నునుగూడ లింగరాజుపాలెము తీసికొనిపోయెను. నేను ఎనిమిదిదినములుమాత్ర మక్కడనుండి మరలివచ్చి కాగితములన్నియుఁ జూచుకొనవలయుననియెంచి వెళ్లితిని. అట్లే యెనిమిది దినములయినతరువాత బయలుదేరఁబోఁగా సెలవులింకను నెలకుఁబయిగా నుండఁగా ఇప్పుడేమి తొందరవచ్చెనని అత్తగారు మఱి నాలుగుదినము లుండుమనెను. నాభార్యకు కొంచెము స్వస్థత కలుగునప్పటికి కృష్ణచతుర్దశియు అమావాస్యయు శుక్లపాడ్యమియు వచ్చెను. విదియనాఁడు ప్రయాణము నిశ్చయించుకొని బయలుదేరఁబోవుచుండఁగా సాయంకాలము మూఁడుగంటలవేళ కెక్కడనుండియో పెద్ద వానమబ్బువచ్చి నాలుగు చుక్కలవానకురిసెను. నాఁటికినిల్చి మఱునాఁటి ప్రాతఃకాలమున బయలుదేరి రాయవరమువఱకు వచ్చితిని గాని, అక్కడనేఅందదయ్యెను. నాఁటికి మఱలిపోయి మఱునాఁడు పగలు పదిగంటలకు బయలుదేరి సాయంత్రము ఆఱుగంటలకు ఎలమంచిలి చేరితిని. నాఁడే కోర్టు మరల తెఱచినదినము నావి రెండు స్మాల్కాజుకేసులు నాఁడు వినవలసినవి నేను కోర్టులో లేనందున మునసబుగారు కొట్టివేసెనని యింటికిరాఁగానే గుమాస్తాచెప్పెను. దీపముపెట్టికూర్చుండఁగానే సెలవుదినములలోవచ్చిన జాబులన్నియుఁ జదువనారంభించితిని. వానిలోఁ బెక్కులు నాక్లయ్యెంట్లవద్దనుండి వచ్చినవి. 'సెలవులకు పూర్వము నెలకలదనఁగానే దావా దాఖలుచేయుమని మీయొద్దకు కాగితములను సొమ్మును బంపియున్నాను. ఇంకను సమనులురాలేదు. కాలదోషము పట్టఁగలదు గనుక ఇప్పుడయినను వెంటనే దావా దాఖలుచేయఁగోరుచున్నాను.' అని యొకఁడు వ్రాసెను. డిక్రీ అమలునిమిత్తము మీకు కాగితములును సొమ్మును మూఁడుమాసములక్రిందట చేయిచ్చి వెంటనే అమలు జరగనిపక్షమున ప్రతివాదితల్లి నాకొక్కడమ్మిడి అయినను

రాదని చెప్పియుంటిని. అతఁడు లోకులసొమ్మపహరించుటకుఁ దలఁచుకొని తన సొత్తంతయు అక్కడను ఇక్కడను దాచివేయుచున్నాఁడు.' అని యింకొకఁడు వ్రాసెను. '— వారి వ్యవహారములో మిమ్ము సలహాకోరి రెండు జాబులువ్రాసి యున్నాను. ఒకదానికిని ఉత్తరము వ్రాసినారుకారు. మీ తండ్రిగారికిని నాకును గల కోర్టుపని అంతయు మీకే యిచ్చుచున్నాను మీకుమాత్రము నామీఁదను నాపనిమీఁదను లక్ష్యమున్నట్టు కనఁబడదు. ఈజాబునకును ఇఁక నాలుగుదినములలోఁగా ఉత్తరము రానిపక్షమున నేను మఱియొక ప్లీడరును కోరవలసివచ్చును' అని నా పెద్దక్లయ్యంటు వ్రాసెను. మఱికొన్ని జాబులును ఇట్టి యంశములతోనే నిండియుండెను.

వీని కన్నింటికిని నాఁటిరాత్రి విశ్రమించి మార్గాయాసము తీర్చుకొని మఱునాఁ డుత్తరములు వ్రాయ నిశ్చయించుకొంటిని. కాని మఱునాఁటి ప్రాతఃకాలమందు నా చిన్ననాఁటి మిత్రుఁడును సహాధ్యాయుఁడును అయిన పత్రి రామదాసుపంతులు ఏలమంచిలికి తహసీల్దారుగా వచ్చెను. ఆతని నెదుర్కొని మాయింటికిఁ దీసికొనివచ్చి రెండుదినములు మాయింటనుంచి తరువాత ఆయనకు మంచిబస యొకటి కుదిర్చి యిచ్చితిని. ఈ తొందరలచేత నాలుగయిదు దినములు విలంబమయ్యెను. ఇంతలోఁ బయినిచెప్పిన డిక్రీ అమలుకోరిన క్లయ్యెంటు తన ప్రతివాది సొత్తంతయు దాఁచివేసె ననియుఁ, దనకిఁక సొమ్మువచ్చుమార్గము లేదనియు, తనకాడిక్రీకంటె నాధారము మఱియొకటిలేదనియు, తనకు బదులయినను ఇచ్చి తనయొక్కయుఁ దనకుటుంబముయొక్కయు ప్రాణములు నిలుపకున్నయెడఁ దామందఱును మాడి చావవలసినదే యనియు, మిక్కిలి దీనముగా జాబువ్రాసెను. అదిచూడఁగా నామనస్సు కలఁగెను. వెనుకనుండి డిక్రీ అమలుజరపి సొమ్మురాఁబట్టవచ్చునని యెంచి వెంటనే నూఱు రూపాయలు బదులుతెప్పించి ఆ క్లయ్యెంటుకుఁ బంపితిని. నాఁటి సాయంత్రమునకే మఱియొక క్లయ్యెంటువద్దనుండి తన డిక్రీకి తానెన్నిజాబులువ్రాసినను నేను అమలు చేయించలేదనియు, నా పొరపాటువలన దానికిఁ గాలదోషము పట్టెననియు, దాని సొమ్ముకు నేనుత్తరవాదము చేయవలయుననియు, ఆ మొత్తము అయిదువందలరూపాయలును అయిదుదినములలో తనకందఁజేయనియెడ అధికారులీవ్యవహారమును వినవలసి వచ్చుననియు, వ్రాసెను. అతఁడు నాకాడిక్రీ అమలుచేయింపుమని అయిదాఱుజాబులు ఒకదానికంటె నొకటి మఱింత కఠినముగా నుండునట్లు వ్రాసియుండుటవలన ఆతని పక్షము న్యాయ్యము కాదనుటకు నాకవకాశము లేదయ్యెను. మఱునాఁటి సాయంకాలము అయిదువందలును బదులుచేసి ఆతనికిఁ బంపి యూరకుంటిని. ఆరాత్రి మిక్కిలి వ్యాకులచిత్తుఁడనయి పరుండఁగా నాకొక యాలోచనపుట్టెను. అపాయ బహుళమైన

ప్లీడరు వృత్తి నాకుఁదగినది కాదనియు, గవరన్మెంటు జిరాయితీ భూములు కొన్ని సంపాదింపఁగలిగినయెడ వానిలాభమువలన నిర్విచారముగా జీవనము జరపవచ్చుననియు, అవి సంపాదించుటకు నా బాల్యస్నేహితుఁడయిన రామదాసుపంతులు తహసీల్దారుగా నున్నప్పుడే మిక్కిలి అనుకూలమయిన సమయమనియుఁ, దోఁచెను.

మఱునాఁడు నా యభిప్రాయమును రామదాసుపంతులకుఁ జెప్పఁగా, ఆతఁడు తనకును అట్టిభూములు కొన్ని సంపాదింపవలయునన్న కోర్కె కలదనియు, తాలూకాలో ఎక్కడ తగినభూములున్నవో వెదకుమనియు చెప్పెను నాఁడుమొదలు నేనదే ప్రయత్నముచేసి ఎక్కడెక్కడ గవరన్మెంటు 'భంజరు' భూములుగాని 'కుందకపు' భూములుగాని ఉన్నవని సమాచారము వచ్చుచుండెనో ఆయాస్థలములకు వ్యయప్రయాసములకోర్చి తిరిగి ఆ భూములనాడెము మొదలగు నంశములను సంపూర్ణముగాఁ దెలిసికొనివచ్చి రామదాసు పంతులతోఁ జెప్పుచుంటిని. ఈ పనిసందడిలో నాప్లీడరు పనిమీఁద మఱింత అశ్రద్ధచేయవలసివచ్చెను. క్లయ్యెంట్లు కొందఱు తాము దావాలు దాఖలుచేయుమనియు డిక్రీ అమల్చు జరపుమనియుఁ బంపిన కాగితములు తమకు తిరిగి పంపివేయుమనియు తాము మఱియొక శ్రద్ధగల ప్లీడరుచేత పనిచేయించుకొనెదమనియు జాబులు వ్రాయుచుండిరి. ఇట్టిజాబుల కుత్తరములను బడయనేరక కొందఱు స్వయముగా నేవచ్చి వెదకించి తమ కాగితములను గొనిపోవుచుండిరి.

ఇట్లు నా ప్లీడరుపని తగ్గిపోవుచుండినందులకు నాకు లేశమును ఖేదము కలుగలేదు. తగిన భూములు దొరకనున్నవని నిశ్చయించుకొని ప్లీడరు వృత్తిమీఁద నేను బుద్ధిపూర్వకముగానే అనాదరముచేయ నారంభించితిని.

అనేకభూముల వృత్తాంతము దొరకినతరువాత రామదాసుపంతులొకనాఁడు నన్నుఁ జేరబిలిచి నేను తనకు ముఖ్యస్నేహితుఁడనని లోకులందఱు నెఱుఁగుదురు గనుక భూములను మొదటనే నాపేరఁ బెట్టినయెడ తనమీఁదఁ బయి యధికారులకు ఓర్వలేనివాండ్రెవ్వరైనను చాడీలు వ్రాయుదురేమోయనియు, అందువలనఁ గొన్నాళ్లవఱకును వానిని మఱియొకరిపేర నుంచుట శ్రేష్ఠమనియు, కాఁబట్టి తనకు విధేయుఁడయిన భీమారావుపేర వానినుంచెదననియుఁ, జెప్పి ఆప్రకారము క్రమముగాఁ బని జరుప నారంభించెను.

ఈలోఁగడ, దావా దాఖలుచేయుమని చెప్పి రెండువేలరూపాయల పత్ర మొకటి అంతకుమునుపు ఏడెనిమిదినెలలక్రిందటనే నాచేతికిచ్చియున్న క్లయ్యెంటాకాయన, అన్నాళ్ళు దావా దాఖలు కాకుండుటకుఁ గారణమడుగుచు నాలుగయిదు జాబులువ్రాసెను. కాని నేను వానిలో నొక్కదానికిమాత్రము అప్పుడు నేను పని

తొందరలో నుంటినని యు, కనిమిని నెలవులు వెళ్లఁగానే దావా దాఖలుచేయఁబడు నని యు, ఉత్తరము వ్రాసితిని. కనిమిని నెలవులు వెళ్లినతరువాత నెలదినములు చూచి, దావా అంతకుముందు దాఖలయి యుండనియెడల దాని మఱియొకప్లీడరుచేత దాఖలు చేయించుకొనెదననియుఁ, బత్రము తనకుఁ బంపివేయుమనియు, ఆతఁడు జాబు వ్రాసెను. ఆదివారమునాఁడు పత్రము వెదకి సోమవారమునాఁడు తప్పక దాఖలుచేసి పిమ్మట ఆతనికుత్తరము వ్రాయనెంచి నేనప్పటికూరకుంటిని. ఆదివార సోమవారములు నేనింటివద్దనుండినయెడ ఆప్రకారము చేసియుందునేమో కాని ఆ రెండుదినములును కొన్నిభూములు చూచుటకు నేను గ్రామాంతరములకుఁబోయి యుండుటవలన దావా దాఖలు కాలేదు.

మఱుసటి ఆదివారమునాఁటి ప్రాతఃకాలమున నేను కాల్యకరణీయములను దీర్చుకొని కచేరిచావడిలోనికివెళ్లి కూర్చుండఁగానే కొవ్వో, కొవ్వోమని పల్లకిబోయీల ప్రోఁత వినఁబడెను మఱి రెండునిమిషములకు మా గడపలోనే పల్లకిదిగి నాక్లయ్యెంటే నాయెదుట నిలువఁబడెను. ఆయనను జూడఁగానే నే నులికిపడిలేచి తెల్లఁబోవుచు "నరసప్ప మామగారా! రండి," అంటిని. నరసప్పగారు నిలువఁబడియుండియే "నాపత్ర మిప్పించవలెను" అనెను.

నేను— క్షమించవలెను. రేపు తప్పకుండా దావా దాఖలుచేతాము.

నరస— రేపన్నమాట నేను వినను. నాకిప్పుడు పత్రము కావలెను.

నేను— ఈరోజు ఆదివారముగదా? రేపటి కోర్టులో మీయెదుటనే దావా దాఖలుచేస్తాను.

నరస— ఇటువంటి రేపులెన్నో అయినవి. మీరు నాపట్లన్యాయముగా నడచినారు కారు. నాప్రతివాది విరోధులు కొందరు రెండువేలఅయిదువందల రూపాయలిస్తామాపత్రమిమ్మంచునాన్నారు. పత్రము వెంటనే యిప్పించండి.

నేను— అలాగయితే పత్రము వెదకి రేపిస్తానులెండి.

నరస— ఇప్పుడే యిప్పించవలెను. నేను రాత్రికింటికి వెళ్లవలెను.

ఆమాటవిని నేను సందుగుపెట్టెలో చూడఁగాఁ బత్రము కనఁబడలేదు. డసుకు పెట్టెలోను లేదు. ఇల్లంతయు వెదకితిని. ఎక్కడను లేదు. అప్పటి నావ్యాకులత చెప్పఁజాలను. మఱికొంతసేపు వెదకియుఁ బత్రమును గానక, "గుమాస్తా పెట్టెలోనున్నదేమో అతడు వచ్చినతరువాత వెదకించి పంపుతాను" అంటిని. "గుమాస్తావచ్చేదాకా యిలాగే నిలువబడతాను" అని నరసప్పగారు దృఢముగాఁ జెప్పెను. అప్పుడే గుమాస్తా యును వచ్చెను. ఆతని పెట్టెలోను పత్రము కనఁబడలేదు "రెండుజాములకు పత్రము

నాబసకు పంపనియెడల ఇతరులిస్తామన్న రెండువేల అయిదువందల రూపాయలున్నూ మీవద్ద పుచ్చుకుంటాను" అనిచెప్పి గిరుక్కున మరలి వెళ్లి నరసప్పగారు పల్లకిలోఁ గూర్చుండెను. అప్పటికే పది పండ్రెండుగడియల ప్రొద్దెక్కినందున నేనును తరువాత వెదకవచ్చునని స్నానమునకు లేచితిని.

భోజనముచేసి కొంతసేపు విశ్రమించి లేచునప్పటికి నాక్లయ్యెంటొకఁడు నాతో మాటాడుటకువచ్చెను. అప్పుడు భంజరు భూముల ప్రస్తావము రాఁగా అతఁడు తన గ్రామమున మున్నూఱు ఎకరముల భూమి యొకటి కలదనియు, దానిమీఁదఁ గొంత పనిచేయించినయెడ నది మిక్కిలి ఫలవంతము కాఁగలదనియుఁ, జెప్పెను. నేను తత్క్షణమే బయలుదేరనెంచి బండికొఱకు ఆతనినే పంపితిని. ఇంతలో నాభార్య చేరవచ్చి "నరసప్పగారి పత్రము వెదకి యిచ్చివెళ్లరా?" అని యడిగెను.

నేను—అదియెంతవెదకినా కనబడలేదు అటుండివచ్చినతరువాత వెదకుతాను.

నాభార్య—ఆయనరూపాయలు మనమీద కడతానంటున్నాడు గాబోలునే.

నేను—అన్నాడుగాని అనగానే అయినదా అతనిమాటలకు జడిసి యీ భూములపని మానుకోనా?

నాభార్య—మీరు భూములు, భూములంటున్నారుగాని వాటివల్లలాభముంటుందో వుండదో. ఈవుద్యోగస్థులు వాళ్లచేతను వీళ్లచేతను మంచిభూములన్నీ వెదకించి, తమరే తుదకవన్నీ పుచ్చుకుంటారు నరసింహస్వామిపంతులు తానే తనకు ప్రాణస్నేహితుడని అందరితోనూ చెప్పుతూవచ్చిన వీరభద్రయ్య నేమిచేసినాడో యెరుగుదురుగదా? ఇలాంటి చెట్టుమీది విస్తరాకులకోసమపేక్షించి మీపనిమీద యెందుకశ్రద్ధచేస్తారు.

నేను—రామదాసుపంతులకు నామీదనున్న స్నేహము అలాంటిదికాదు. అతడు నాపట్ల మరొకలాగు నడువడు

నాభార్య—పోనియ్యండి. ఆయనను మీరు నమ్మండి గాని యీరోజున నరసప్పగారి పత్రము వెదకియిచ్చి వెళ్లడము మంచిదేమో? పత్రము దొరకకుంటే ఆయనతో మంచిమాటలాడి మనమీద దంపుగ కట్టకుండా చేసుకోవలెనుగదా?

ఇంతలో "బాబూ! బండివచ్చినది" అని కేక వినఁబడెను. "రేపువచ్చి ఆయనతో మాటలాడతాను" అనిచెప్పి బయలుదేరి ఆతనిని వెంటఁదీసికొని ఆతని గ్రామమునకుఁబోయి అక్కడ మూడుదినములుండి ఆతఁడుచెప్పిన భూమియఁ బరీక్షించి చూచితిని. తగినపని చేయించినయెడ అది మిక్కిలి లాభకరమయిన క్షేత్రమగుటకు సంశయములేదని తెలిసికొని అక్కడనుండి బయలుదేరి రామదాసు పంతులను గలసికొనుటకై యింటికివచ్చితిని. కాని రాఁగానే ఆయన అంతకు మునుపటి

దినముననే పెంటకోట వెళ్లెనని విని నేనును తోడనే మరల బయలుదేరి పెంటకోట వెళ్లితిని. అక్కడ రామదాసుపంతులతో మాటలాడి నేను మరలివచ్చునప్పటికి కోర్టు బంట్రౌతొకఁడు మా గడపలో నిలువఁబడియుండెను. వాఁడు నన్నుచూడఁగానే దండముపెట్టి యొక కాగితము చేతికిచ్చెను. అందలియంశములు నన్ను నిశ్చేష్టునిఁ జేసెను. నరసప్పగారు పత్రార్థమునకు నన్ను బాధ్యునిఁజేసి నామీఁద రెండువేల రూపాయలకు దావా తెచ్చెను.

ఈ మాటవిని మా కుభయులకు మిత్రులయినవారు కొందఱు కోర్టువెలుపలనే యీ తగవుతీర్పవలయునని ప్రయత్నించిరి. కాని నరసప్పగారు — ఇఁక నీతనిని నా ప్రతిపక్షియనవలయును — రెండువేలకు ఒకగవ్వ తక్కువపుచ్చుకోననియు, నేను నాలుగువందలకు ఒకగవ్వ యెక్కువయియ్యననియు, గట్టిగా పట్టుపట్టుటవలన వారి ప్రయత్నములు నిష్ఫలములయ్యెను.

కోర్టువారీదావా విన్ననాఁడు చూడవచ్చిన జనులతోఁ గోర్టు నిండిపోయెను. ఆపత్రము వ్రాసియిచ్చిన అధమర్ణుఁడు మిక్కిలి పేదవాఁడనియు పత్రము దొరకినను ఉత్తమర్ణునికి దానిసొమ్ము రాఁదగియుండలేదనియు నేను నమ్మఁదగిన సాక్ష్యము తెచ్చి యెంతవాదించినను కోర్టువారంగీకరింపక తుదకు నామీఁద వ్యయములుగలపి రెండువేల యయిదువందలరూపాయలకుఁ దీర్పుచెప్పిరి!

ఈ తీర్పు మిక్కిలి యన్యాయ్యమని యెంచి అప్పీలుచేయ నిశ్చయించుకొని వెంటనే నేను నకళ్లకు దరఖాస్తుచేసి యింటికిఁబోయితిని. కొన్నిదినములలో నకళ్లందెను. అప్పీలువలదనియు, అప్పడైనను మిత్రులసహాయమువలన ఈతీర్పు మొత్తములో కొంత సొమ్ము తగ్గింపఁజేసికొని భూములన్నియు అమ్మివేసి ఋణములు నిశ్శేషముగాఁదీర్చి మఱి ఋణముచేయకుండ శపథముచేసికొమ్మనియు, నేను వెఱ్ఱివెఱ్ఱియాశలను విడిచి కొంత శ్రద్ధతో నా ప్లీడరుపని యొక్కటియుఁ జేసికొన్నచో మాకుటుంబము సగౌరవముగాఁ గాలక్షేపము చేయుటకుఁ జాలినంతధనము దొరకుననియు, నా భార్య నాకు బహువిధముల బోధించెనుగాని, అప్పీలులో ఆతీర్పుతప్పక తిరిగిపోవునని నేను దృఢముగాఁజెప్పి దాని మొలనున్న యొడ్డాణమును మెడనున్న కంటెయును అడిగిపుచ్చుకొని అమ్మివేసి ఆఱువందలరూపాయలు తెచ్చి అప్పీలుచేయుటకై విశాఖపట్టణమునకుఁ బోవుటకుఁ బ్రయాణసన్నాహములు చేసికొని, మఱునాఁటి సాయంకాలము బయలుదేరుటకు నిశ్చయించుకొంటిని. కాని మఱునాఁటి ప్రాతఃకాలమున రామదాసుపంతులు మాయింటికివచ్చి తాను, నేనంతకుమునుపు పెంటకోటలోఁజెప్పిన భూములు చూచుటకు వెళ్ళుచుండెనుగనుక నన్నును తనవెంటరమ్మనెను.

రామాభ్యుదయము. (౩౫౬-వ-పుట శేషము)

గీ. తెలుపన త్రతి మూర్ఛిల్లి తెలిసి విభుఁడు । ధన్య దశరథ రాజమూర్ధన్య మాన్య
చని తెమమ్ముల నెడఁ బాసి యనుచు నడలి। తమ్ముఁడును దానుఁ గుంది రెంతయును వంత.

క. రామామణివరగచెం బర । భామాజనవిముఖ సార్వభౌమా భూమా
త్రామా దివి కేగితివా । మామా యో రాచచంద మామా యనుచున్.

వ. ఇట్లు బహుప్రకారంబుల వగచి సీతాలక్ష్మణ సమేతంబుగా రఘునందనుండు దండ్రికి విధ్యుక్తకార్యంబులు నిర్వర్తించి మునీంద్రగోష్ఠిం బ్రవర్తించుచున్నయెడ.

చ. భరతుఁడు రాజ్యమేలుమని ప్రార్థన చేసిన దాఁటవచ్చునే
నరవరు నాజ్ఞ నాకుఁ బదునాలుగు వర్షములోర్చి యంతఁ బ్ర
మ్మఱఁ జనుదెంచి పూనెద సమస్తమహీభర మన్నిమేండ్లు భా
స్వరనయవృత్తిఁ జేయుము ప్రజావరిపాలన మీవు నావుడున్.

గీ. మిహిరకులదీప రఘురామ మిమ్ముఁ బాసి । యుండునం దాఁక నేలాగు బొందిఁ బొంది
నిలువదిఁకఁ బ్రాణ మెట్లనఁ గొలిచి యనెద । నిమ్ము పాదుకలని వేఁడ నిచ్చెఁ గరుణ.

మ. భరతుం డా రఘురాము పాదుకలపై భక్తిం బ్రతిష్ఠించి ని
ర్భర భూచక్రము రామరాజ్యముగ మర్యాదానయౌదార్య సు
స్థిరశౌర్యంబుల నేలుచుండెఁ జని నందిగ్రామ సంస్థాయియై
సరవిం దత్పునరాగమక్రమ దిదృక్షాదక్షదీక్షాధృతిన్.

గీ. అంతనిక్కడఁ జిత్రకూటాద్రి నున్న । మునుల వీడ్కొని సజ్యకార్ముకధరుండు
జనకకన్యానుజ సహాయుఁడు రఘుమూర్తి । రాముఁడట దండకాటవీ సీమ కేగె.

క. ప్రతిపాదపమూలస్థితిఁ । బ్రతినిర్ఝర వివిధ సలిల పానాభిరతిం
బ్రతిగిరి దరీసరీత్యా । గతభీతిం జెరువునడవఁ గడఁగె నాసతియున్.

చ. అడుగులకున్ మెఱుంగుఁ జిగురాకుమడుంగులిడున్ విభుండు ప్రో
మ్మడి విడఁ జక్కనొత్తుఁ బలుమల్లమిఁ ద్రోవఁ దొలంగఁ ద్రోవఁగాఁ
గడఁగు బెడంగు వింటికొనఁ గర్కశఘోర శిలావితానముల్
కడఁబడఁ జిమ్ము గ్రొమ్ముఱుఁగుఁ గాళ్లలతాంగికి నేదదేర్చుచున్.

ఉ. చయ్యన నేగిడయ్యు నొక చక్కిఁ రవిచ్ఛవిఁ జూక్కి వేసలిం
బయ్యెదకొంగు చాటుగొను భర్తకరంబవలంబయుప్పిగా
నొయ్యనఁ జేరి యాఁతఁగొని యాఱటఁ గాంచు గమించు నిష్వధిం
దొయ్యలియవ్విధిం గనలి దూఱుచుఁ బూపొదరిండ్లు దూఱుచున్.

చ. అలజవరాలు తాలు విభుఁ డంఘ్రులఁ బోవఁగఁ ద్రోవఁ ద్రోవ బె
ట్టులికి సతీశతంబులగు నోయను శంక మెలంగి నాథుడా

నెఁవుల నూఁదమెట్టకొము నీ చరణాబ్జము కందు నావుడున్
వెలఁదితలంపెఱింగి రఘువీరుఁడు నవ్వుచు నేగె నవ్వలన్.

వ. ఇట్లు చనిచని దండకారణ్యంబు చేరి యచటనుండంగోరి సవిధ వివిధవిలసన లసదసమకుసుమ సముదయాలంకృత లతికానటీనటన నైపుణోపదేశ దేశిక లక్షణాభినయ మనోజ్ఞమారుత ప్రేరితాక్షీణ వేణూపాంగస్వర విశేషానుగుణ మత్తభృంగాంగనా సంగీతభంగీ తరగితానంగ నాట్యశాలా లీలావహంబులగు లతాగృహంబులును, సముద్దండచండశుండాదండ ముఖసముద్ధూత నిర్ఝరాంబుకణ కోరకతారకిత వియత్తలోత్తాలాఖిల మదవిజృంభి కుంభికుంభ ప్రదేశ చంక్రమణకేళీ చంగంబులగు కొదమసింగంబులును, ననల్పదర్ప హేలాలోల కాలకాయోద్వేల కోలకులకరాళ దంష్ట్రికుంత ధారావిదారితాఖర్వ పర్వజనితపరిత్యక్త సముదీర్ణముక్తాఫల కలాప కల్పిత దిక్పతిప్రతిగృహ ప్రాంగణరంగవల్లీవిచిత్ర శృంగారసంవిధానంబులగు ప్రాంశు వంశవితానంబులును, యథోచితత్రయీమంత్రోచ్చయోచ్చారణోచ్చైర్ముఖరముఖోద్గాతృహోతృ మునిజనప్రబుద్ధ హుతవహోద్ధూత పూతప్రాజ్యాజ్యధారా గంధిలాఖండల ప్రముఖ నిఖిలమఖభుక్షగ పరంపరావశీకరణ వాగురామయ శ్యామధూమ రేఖావలయంబులగు యజ్ఞనిలయంబులును నక్షుద్రవృక్షవాటీవధూటీ మధుకరచికుర సీమంత సీమాంతర సుందరసిందూర రేఖావైఖరీ శ్లాఘాకరంబులగు సహజమధుమధురతర పచేళిమఖదేళిమప్రసవ ఫలగుచ్ఛగళిత లలిత మధురసప్రవాహ నికరంబులును. నభ్రంకషాదభ్ర శాఖిశాఖా శిఖాలీలాడోలా సుఖవిహారవేళానిజ సహజ తరుణారుణ చరణవిన్యాస హాసామృతరస కిసలయిత ప్రసవితస్థాణు కందంబులగు నిలింపశంపా లతాంగీబృందంబులును, తరళతరవిలోకన విశేషచాతుర్యానందకర కురంగశాబక ముఖముహుర్ముహుర్నవీన ఘాసాంకురగ్రాస విన్యాసాచరణ క్షణక్షణ ప్రార్థనాత్వరాపరాయణోల్లాస భాజనంబగు ధన్యముని కన్యాజనంబును, ధరిత్రీపుత్రికింజూపుచు, నచటనచట విహరింపుచుఁ, బ్రతిక్షితిరుహోదగ్ర శాఖాంచల ఫలాహరణ లంఘనవిశృంఖల జంఘాలప్లవంగ సంఘాతంబును సరసకిసలయాస్వాదనోత్కంఠాకుర కలకంఠకులకంఠ కలకలారావసంకులంబును రసాలసాలతాలతమాల తక్కోల కదళీగంధసార కర్పూర భూరుహచ్ఛాయా శీతలంబును నగు నొక్కచక్కం బాశ్రమంబరసి విశ్రమించె నివ్విధంబున.

క. అంతవిరాధుండను దే। వాంతకుఁడేతెంచి సీత నయావిఖ్యాతం
గాంతామణిఁ గొనియరుగ దు। రంతపరాక్రముఁడు రాముఁడపుడిట్లనియెన్.

క. నీలోత్పల బెగడొందను । నీలోత్పలచికుర వీని నేలంగూలం
దూలింతు నొక్కకోల న । రాళితరక్రోధు సాపరాధు విరాధున్.

గీ. అని నిరవరోధుని విరాధు నపుడు గూల్చి । యంత శరభంగదర్శనం బధిగమించెఁ
గాని శరభంగదర్శనం బూనఁ డెన్నఁ । డాహవంబున నమ్మహాబాహుబలుఁడు.

క. స్మరభంగచరితు దురితో । త్కరభంగవిధాన నిపుణ కర్మశరదో
కరభంగ యశోనిధి నా । శరభంగ తపస్విఁ గాంచి సత్కృతుఁడయ్యెన్.

సీ. తాపసోత్తమదత్త దర్భచర్వణమత్త శుభకురంగికా డింభకంబు
వాచంయమేశ్వరాధ్వరనిరంతరహోమ ధూమసంఛన్న పాథోదపథము
మానిచక్రేశ కుమారచక్రానీత ఫలమూలకుశసమిత్పల్లవంబు
సంయమికన్యకా జనకృతాఖిలభూజ వల్లికా పరిణయవైభవంబు
పర్ణశాలాతరుస్కంధ బద్ధలోహ । పంజరారూఢ కీరసంపఠ్యమాన
భాసురామ్నాయ శాస్త్రేతిహాసరవము । కలశజాశ్రమపదము రాఘవులు గనిరి.

సీ. ఉచ్చరించు మయూర ముపనిషద్వాక్యంబు పారావతంబు శబ్దంబు నుడువు
శారిక తర్కశాస్త్రంబు వక్కాణించుఁ గలకంఠములు షడంగముల నెఱుఁగు
హంసంబు లుభయమీమాంసలు పఠియించు రాచిల్క శ్రౌతమార్గములు దెలుపు
నలఘుపురాణార్థములకుఁ జొక్కుఁ గురంగి సామగానము వినుఁ సామజంబు
ఖంజరీటంబు వైశేషికము విధించుఁ । గ్రౌంచమిథునంబు యోగవైఖరి భజించుఁ
దరమె కొనియాడ ఘటజన్మ తాపసాగ్ర । గణ్య పుణ్యతమాశ్రమారణ్యభూమి.

సీ. బలుఁద్రాఁచు రాచకూనలు వోలె నిగనిగ జడిగొన్న నిడుదకెంజడలు గదల
నెఱసంజకెంజాయ కెదురుమొగ్గరములై కనుపట్టు వల్కలాగ్రములు దూల
నిండారు పండు రేయెండ తండము మాడ్కిఁ దనువున భస్మగుంఠనము నిగుడఁ
గ్రొంబచ్చపవడంపుఁ గొనకెంపు గలవ్రేళ్ల దర్భాంగుళీయ సందర్భ మమరఁ
దళుకుతళుకని మెఱయు కుందనపుఁబసిఁడి । డాలుచిందాడు యోగదండము ధరించి
వింధ్యనగమర్ది బహుశిష్యవితతి గొలువ । నెదురుగా వచ్చె ముని రాఘవేంద్రులకును.

చ. బిసరుహసూతి సన్నిభుఁ గృపీటభవోపముఁ గుంభజన్మ తా
పసుఁ గని యర్ఘ్యపాద్య మధుపర్క సపర్యలచేఁ దదీయమా
నస మలరింప మాని రఘునందనునిం గుశభద్రపీఠియం
దసదృశభక్తి నుంచి వినయాదరపూర్వము గాఁగ నిట్లనున్.

మ. ఎనయన్ సంయమిపూజ్య మీ రిటకు నేఁడే తెంచుటం జేసి నా
పను లెల్లన్ సమకూరె నా తపము సాఫల్యంబునం బొల్చె శో

భవకీర్తిం బొగడొందెదమత్కృతము నాభాగ్యంబులీడేటె నా
జననంబర్థిఁ గృతార్థతంబొరసె సంసారార్ణవార్వానలా.

వ. అనిన రఘూద్వహుం డమ్మహామహుం బ్రశంసింపందొడంగె నిత్తెఱంగున.

క. గణనాతీతసముజ్జ్వల । గుణమణి మునిలోకసింహ కుంభజ శుభకా
రణపుణ్యదేహ భువనా । గణములనీసవతుసేయఁ గలరేతపసుల్.

ఉ. వింధ్యమదిత్యకాకటక విస్ఫుటపాదప పుష్పగుచ్ఛసౌ
గంధ్యము హేమధాతుమయకల్పిత సంధ్యము బద్ధమేరుసా
గంధ్యము చండకేసరినికాయ నిరాకృతభద్రదంతి ద
ర్పాంధ్యముఁ గ్రుంగఁద్రొక్కితి మహాగుణభూషణ సత్యభాషణా.

క. వననిధి భవత్కరాంబుజ । మున నవమకరందబిందువుద్రవహింపన్
వనమాలియపుడు తద్వా । సనఁ గ్రోలన్ బ్రాలుతేఁటి చందమునొందెన్.

సీ. ఏవారిరాశిలో నించువిల్తునితల్లి కలుములీనెడువాలుగంటి పుట్టె
వేల్పులవేలుపు వెన్నుఁడేమున్నీటఁ బడగపానుపుమీఁదఁ బవ్వళించె
లచ్చికన్నియయాఁడు నచ్చనగుంట్లనాఁ గొండలేవార్ధిలో నుండునొకట
వేఁడిమంటలచేఁదు విత్తేపయోధిలోఁ బొడమి యీశ్వరుకంఠ భూషయయ్యె
నట్టియాచుక్క మగవాని యయ్యనెయ్యఁ । గొంటివాపోశనంబొక్క గ్రుక్కనీవు
నీప్రభావంబులోకఁడు వర్ణింపఁగలఁడె । పరమపుణ్య యగస్త్యతాపసవరేణ్య.

వ. అని నుతించిన.

చ. సమధికపుణ్యశాలి ఘటసంభవుఁ డక్షయబాణతూణ యు
గ్మముఁ బరదుర్జయాయుధసమాజము వైష్ణవచాపమున్ సమం
త్రముగనొసంగి పఙ్క్తిరథనందను రాము బహూకరించి య
య్యమలచరిత్రుఁ బంచవటియందు వసింపఁగఁబంచెఁ బంచినన్.

గీ. అసమకిసలయ కుట్మలప్రసవఫలక । లాపదీపిత వివిధపలాశపఙ్క్తిఁ
బంచవటిఁ బర్ణశాలఁ గావించియచట । నునికిచేసిరి రఘువంశయోధవరులు.

చ. మరువక గంధిలంబులను మాదరవిద్యుతులుందు పారధూ
సరములు సర్వవాంఛితహసంతికముల్ సముదగ్రసౌరభా
గరుపరిలిప్తభోగి యువకంఠతలంబులునైతలిర్చె వా
సరములు దంత నీత్కృతివశంవదముల్ తుహినాగమంబునన్.

క. హిమసమయాక్రమభీతిన్ । ద్యుమణినిజోష్ణంబు కొంతయునిచెను కొత్త
న్నమహీస్థలి నెక్కడిదం । బ్రమదాకుచసీమ నుష్ణభావము దలఁపన్.

చ. అరసి నిరుష్ణశంకరకరాగ్ని జపాకుసుమేచ్ఛ గౌరి డ
గ్గఱియవతంసయోగ్యమని కైకొనఁబూనుమదిన్ సరోజమం
దిరయు మురారికౌస్తుభమణింగని కీలయటంచుఁ దద్భుజాం
తరమున నిల్పె దుస్తరముదగ్రహిమాగమ మెట్టివారికిన్.

క. అతిదుస్సహతరశిశిరా । గతభీతింబఱచిమున్న గాననలుఁడహో
శితికంఠనయనగోళ । స్థితినొందెంగాక లేదె దిక్కాతనికిన్.

గీ. తరణివేకువతఱి మరుద్బాంధవాంశుఁ । జెంది దివసావసానంబునందునతని
యందుఁదానుండుఁ జెందొవవిందుశశియు । శివలలాటాగ్ని కడనిల్చె శీతభీతి.

వ. అట్టి హిమాగమ సమయంబు నిర్వర్తించియంత.

క. సీతాశీతాంశుముఖీ । స్ఫీతోష్ణకుచోపగూహశీలనరీతిన్
ధూతాభియాతిరఘుపతి । చేతఃప్రీతిందరించె శిశిరాగమమున్.

వ. తదనంతరంబ.

క. వచ్చె మునిధైర్యధనహా । టచ్చరశూర్పణఖ విధువిడంబకళాదీ
ప్యచ్ఛతరవదనమదనశ । రోచ్చయసంతప్తయై రఘూత్తముకడకున్.

వ. వచ్చి యచ్చటం బరిభ్రమించుచు సదభ్రహావభావ విభ్రమ విలాసంబుల మించుచు
నటత్తటిద్వల్లీమతల్లియుంబోలె నుల్లసిల్లి యల్లిబిల్లిఁ దెచ్చికోలువలపు దెలుపు కలుష
కోలుఁదనంబులు సలుపుచు నిట్లనియె

చ. నను వరియింపుమో యినృపనందన నీయసమానరూప మో
హన తనుసంగమంబునఁ గృతార్థతనొందుదు నన్ను నన్యకా
మినియని చూడఁజెల్లదసుమీ భవదీయగుణైకపాశ బం
ధనమున నేఁదగుల్పడినదానఁ దలంపు ఫలింపఁజేయుమా.

క. పొందికకుఁ దగినయువతిన్ । సందియమొక్కింతవలదు జనవర స్త్రీర
త్నం దుష్కులాదపియనన్ । వింటిముగద శాస్త్రవేదివిగదా తలఁపన్.

వ. అనిబహుప్రకారంబులఁ బరవధూపరాఙ్ముఖాచార నిర్వికారాకారుండగు కాకుత్స్థ
వీరుని వీనులకు ములుకులగు పలుకులం బలుకుచుం గదియనరిగి.

క. దక్కొనదింబలెమాయపు । ముక్కువశూర్పణఖమించు ముచ్చికలకురా
నక్కఱకు జంతరక్కసి । ముక్కరకున్ నోఁచకుండ ముక్కలఁజేసెన్.

క. ఆవికృతినొంది మది నా । నావిధముల వలచివచ్చినను ముక్కు నెపుల్
వోవునని పలుకుగాథకుఁ । దావలమై నిలిచితింగదా నేఁడనుచున్.

క. తానాసఁ బోలఁగఁ జనియెన్ । దానవతరళాక్షి యేక దారవ్రతులన్
భానుకులీనుల దశరథ । సూనులఁ గామించి విగతసుముఖత్వమునన్.

గీ. చని జనస్థానమున కేఁగి దనుజభామ । కర్ణనాసంబులై వ్రాల ఖరుని ప్రోల
రాఘవులచేతనైన పరాభవంబు । దెలిపెఁ దెలిపినఁ గనలి దైతేయవరుఁడు.

క. తరుణీ నినుఁ గారించిన । పౌరుషోచ్చపు నరులఁ బోరఁ బొరిగొనకున్నన్
ఖరనామధేయ మొప్పనె । ఖరనామమె గాక నాకు గర్హార్హనకున్.

చ. అని పదునాల్గువేలు భయదాసురవీరులు గొల్వఁగా ఖరుం
డునుఁ ద్రిశిరుండు దూషణుఁడు నూల్కొని మచ్చర మెచ్చరింపఁగా
ననిమొన కేగుదెంచి కమలాప్తకులీనులఁ గాంచి నవ్వి యి
మ్మనుజులు మమ్ము మార్కొన సమర్థులె యంచుఁ దలంచి రయ్యెడన్.

క. ఖరసేనా నానావిధ । శరపఙ్క్తి గభీరగుణవిశారదముద్రా
శరధులఁ దార్కొనియెన్ దా । శరథు లనక్షయ మహాస్త్ర శరధులఁ దోడ్తోన్.

గీ. కాఁకమించుల వినుమానికంపుజోదు । మంచుగమిఁ గంచుమించు గావించుకరణిఁ
దరణికులహాళి విశిఖజాతములఁ దుముల । ఖరచమూముక్త శరపరంపరల నణఁచె.

ఉ. ఓర్చి రణాంగణంబున నిజోగ్రనిశాచర వీరసేనఁ బే
రార్చినఁ గాంచి యాత్రిశిరుఁడా ఖరదూషణులౌ నితండు స
ప్తార్చి రుదగ్రతేజుఁడని యద్భుతమంది తలంచి ముగ్గురం
గూర్చి నెముండదయ్యమని కుందిరి యందిరి కార్ముకాస్త్రముల్.

వ. ఇట్లు డగ్గఱి యగ్గిరీంద్రధీరుండగు రఘువీరున కిట్లనిరి.

క. తగవా మగవారికి నిటు । మగువ నెదం దెగువఁ జూప మాదృశవీరుల్
జగతిం గలవా దొరవా । మగఁటిమిగల రాచచందమా యిది యిహిహీ.

క. దాకొని ఖడ్గాఖడ్గిని । కాక కచాకచిని బాణకౌశలముననో
నీకెద్ది యిష్టమనికిన్ । దీకొనుమా యొకట మెచ్చితిమి నృపతనయా.

వ. అనిపలికి శిరుకందమకంబు మునుకొనఁ గొనకొని.

గీ. ఖరుఁడు రణధీరదనుజశేఖరుఁడు గడఁగి । యేపు చూపుచుఁ గ్రొవ్వాఁడి తూఁపులేయ
రాఘవశరాసనోర్జితామోఘశరము । రాహువువోలె ఖరకరగ్రాహియయ్యె.

గీ. త్రిశిరుశరవృష్టి నాశుగోద్వృత్తి నడఁచె । రోషభూషణ దూషణ భీషణాస్త్ర
తతులఁ బ్రత్యస్త్రములఁ ద్రుంచెఁ దాఁకనీక । ఢాకఁ గాకుత్స్థవంశసుధాకరుండు.

మ. శశిరోచిష్ణుకళాకలాప వదనాబ్జాతుండు రాజన్యలో
కశిరోరత్నము చాపనైపుణపరిష్కారుండు నానాసుధీ

పదరోలంబశరణ్య పాదకమలద్వంద్వుండు మాద్యత్ఖర
త్రిశిరోదూషణ కంఠలుంఠన మొనర్చెం జండకాండంబులన్.

వ. ఇట్లు దుర్దశం జతుర్దశసహస్ర దనుజసేనాసమేతంబుగాం బద్దోషాచర వీరత్రితయంబు
లయంబునొందినం గనుంగొని కనుంగొనల నశ్రుధారావర్షంబు దొరుగ విషాద
వేదనా జనితరోదనారభటింబలుచి యొమ్ము చఱచుకొనుచు రఘువరనిరూపిత వికృత
ముఖయగు శూర్పణఖ విముఖత్వంబునం జని రఘుకుల ప్రదీపప్రతీపప్రతాపాటోపం
బెఱింగించిన నదరిపడి యేమేమి యెక్కడెక్కడ నెవ్వండెవ్వం డిట్టుగావించినాండు
మనుజులు దనుజులం జెనకువారైరే మండూకంబు దందశూకంబును గురంగంబు
సింగంబును బరిభవించు చందంబయ్యె నకటకటా యని వికటామర్ష కుటిలజటిల
భ్రుకుటీప్రకటనిటలతటుండగుచు మాయోపాయ ధురంధరుండగు పంక్తికంధరుండు
నృపకుమారవంచనాపరాయణుండయి తదాశ్రమంబుం జేరి మారీచ సాహాయ్యంబు
నెయ్యంబునం గోరి.

క. మారీచా శూర్పణఖా । నారీవైరూప్యకరుని నరునిన్ ఖలునిన్
బోరం బొరిగొన్న యుగ్రా । కారునిం గారింతుం దోడుగా రమ్మనుడున్.

క. జలధిం బడంగడపె మునునను । వలదు నరభ్రాంతి నీకు వైరం బేలా
బలవంతునితోం గొఱవిం । దలంగోకి కొనంగం దగునె దనుజాధీశా.

క. నరుండాయతండు వైశ్వా । నరుం డఖిలప్రతాపనైపుణి నతిదు
స్తరమాయాఖని యని నీ । తరమా యతనిన్ జయింపం దార్కొనంగలమా.

క. అనవుడు మారీచోక్తులు । వినక విధిప్రేరణంబు వెనుకొనంగ దశా
ననుండు గదు వేండుకొనినం । గనకమృగంబయ్యెం దాటకాతనయుండున్.

వ. ఇట్లు మాయాకురంగంబయి పతంగ కులపుంగవ పర్ణశాలా ప్రాంగణంబు చెంగటం
దోంచె నిత్తెఱంగున.

లయవిభాతి.

కలికితఱితీపుసిరి దొలంకుమఘువన్నెలుల కళుకులగునన్ బెళుకులకును జిగిచూపుల్
నలుగడలం గవ్విరి పొలుపు పోలుపు దెలుప నలిననలినగాగరుచి కలితనిజశృంగం
బులబయలం జిమ్ముచును బలువగలం జంక్రమణవిలసనచమత్క్రియలం బోలయు నెలయించున్
సోలయునే యున్నలయుం గలయుం గసవు మ్మేసవుం దొలకరి మెఱుంగుక్రియ మెలంకువలం
వ. ఇత్తెఱంగునం గుహనాకురంగంబు మెలంగం దొడంగిన. [దోంచున్.

క. జనకకుమారీమణి యా । కనకకురంగంబు నెదుటం గనుంగొని రఘుపీ
రునిం జూచి దేవ దీనిం । గొని తెమ్మనవుడుం బ్రియుండు కుతుకంబలరన్.

శా. డాయంబోయినఁ జిమ్ముఁగొమ్ములఁ బ్రచండస్ఫూర్తిలంఘించు నే
ఛాయంజూచినఁ దోఁచుఁ గ్రొమ్మెఱుఁగు నోజన్నచ్చికన్నిచ్చరా
మేయుంబచ్చిక మచ్చికంగదిసి నమ్మించుందనుంబట్టంబోఁ
బాయున్ బెట్టలయించుదౌదిగుచు నప్పాటన్ మృగంబీగలిన్.

గీ. ఇట్లువెన్నాడి యలసి కాదిదిమృగంబు । మాయరూపమొ యైన నేమాయెననుచుఁ
గనలికనకమయోగ్రాశుగంబువఱప । లేటిరాకొమ్ము నడుచక్కి నాటుకొనిన

క. శృంగత్రయంబుఁదాల్చిన । భంగిఁ గురంగంబుగానఁ బడియప్పుడు నే
లంగూలెనార్తి హాసీ । తాంగన హాలక్ష్మణాయటంచుం బిలుచన్.

గీ. అచటమాయాకురంగదీనారవంబు । విన్నయంతటిమాత్రనె విన్నఁబోయి
సీతమూర్ఛాసమేతమై సేదదేరి । కాంతునియవస్థకడలు లక్ష్మణుఁడువినఁగ.

మ. అనణుస్వర్ణమయాంగచిత్రరుచినాకర్ష్యామెకంబేటికిం
గనుపట్టెం గనుపట్టెఁబో వనకురంగభ్రాంతిమై నెప్పటి
ట్లనెయేనుండక పట్టితేనధిపు నేలా వేఁడితిన్ వేఁడినం
తనె వెన్నాడి బడింజనంజనునె హా నాబుద్ధియిట్లుండెఁగా.

వ. అని పొగిలిపొగిలి భూపుత్రి సౌమిత్రి కిట్లనియె.

క. మాయన్న సుమిత్రాసుత । మీయన్న రఘూద్వహుండు మృగబాధల నే
మాయెనొ డాయంజనుమా । హా యనుజా లక్ష్మణాయటంచుం బిలిచెన్.

వ. అనినవిని.

ఉ. మానవతీ మతల్లి వినుమా యనుమానము నొందనేటి క
మ్మానవసింహమున్ హరిణమాత్రము నొంప సమర్థమే మరు
ద్దానవసిద్ధసాధ్యుల కతం డనిలోన నసాధ్యుఁడెయ్యెడన్
హానియొకింతలే దతని కాత్మఁజలింపక యూరకుండుమా.

క. ఆఱాకాలమ్ముల్లుగొనకిటఁ । దిరిగి రఘుస్వామి యేగుదెంచున్ మదిలోఁ
దరుణీ వెఱవకువిపినాం । తరమున నినువిడిచిపోవఁ దగదిఁక నాకున్.

క. అని చనకయున్నఁ గనలెడు । జనకసుతాశ్రుతికటూక్తి సందర్భంబుల్
వినలేకలక్ష్మణుం డటు । చనఁ బక్షికులముఖుండు తపసిచాడ్పుననిలిచెన్

చ. జలదముఁబాయు క్రొమ్మెఱుఁగుచాడ్పున నాయకరత్నశూన్యమై
యలవడుహారవల్లరిక్రియన్ హరిణాంకుఁడు లేనిరాత్రియుం
బలె రవిఁబాసిగానిలెడు పద్మినికైవడి వంతనొంది వ
ర్తిలెడు పతివ్రతన్ వసుమతీసుతఁగాంచి దశాస్యుఁడిట్లనున్.

 (సశేషము)

వివేకవిజయము. (౩౦౦-పుట శేషము)

ఏడవ ప్రకరణము.

మధ్యాహ్నము మూఁడుగంటలకు, ఏలూరిలో పడవలు దిగుచుండెను. చంద్రశేఖరశాస్త్రి యాఁకటిపెల్లున పూటకూటియింటికిఁ జనుచుండఁగా, శ్యామలమైన దేహకాంతియు, నూతనముగా దిద్దఁబడిన నుదుటిమీఁది కొమ్ములును, కమలముల తమ్మంట్లును, ముక్కునకాడయు, పెడిగడ్డమును, బల్లమొగమును, కుబ్జాగ్రహమునుగల, యొకపురుషుఁ డెదురుపడెను. కిఱ్ఱుచెప్పులు తొడిగికొని, పొన్నుకఱ్ఱను జేతఁ బుచ్చుకొని, కుచ్చుపాగచుట్టి, తమలపాకులు నమలుచు వచ్చుచున్న యారసిక శిఖామణిని మనశాస్త్రి పల్కరించెను.

'ఎక్కడికి అన్నగారెండలో బయలుదేరినారు?'

'మాతాలూకామనిషిని పడవెక్కించవలెనని. నీవెక్కడనుంచి?'

'రాజమహేంద్రవరమునుండి.'

'ఈమధ్య నీకు గొప్ప సంపత్తు వచ్చిందని విన్నాను.'

'దైవసంకల్పము'

'మీ నాన్నగారెక్కడైనా గొప్పసంబంధం కుదర్చమన్నారు. పనుల తొందర చేత తీరుబడిలేకపోయినది.'

'ఒక సంబంధము కుదిరినదని వ్రాసినారు.'

'సరే. అందుకోసమా నీవెళ్ళడం. విశేషాలు? అయితే రాజమహేంద్రంలో ఆమధ్య పునర్వివాహాలు చెయ్యవచ్చునని వాదాలు జరిగాయి. పర్యవసానమేంతేలింది?'

'ఈ యాచారము శాస్త్రసమ్మతమని ప్రత్యక్షముగా ప్రమాణములుండఁగా తేలెడిదేమున్నది? మీ యభిప్రాయము?'

'ఈకాలంలో ముఖ్యంగా జరుగవలసిందనే. అయితే మాబావమఱిది దక్షిణామూర్తి ష్టమేనా యీ పెళ్లిళ్లు!'

'మూర్ఖులుతప్ప వివేకమున్నవారెవ్వరు కాదనఁగలరు?'

'అవును మావంటివాళ్ళకుకూడా వెధవవాళ్ళబ్రతుకు తల్చుకుంటే వళ్లుగరి పొడుస్తుంది. శుభంలేదు, ముచ్చటలేదు, అచ్చటలేదు. కట్టుకోడానికి తిన్ననైన బట్టయినాలేదు. ఆఖర్కి కడుపుకింత రెండుపూటలాపిండమైనా వెయ్యరు. మావదినగారి అవస్థ తల్చుకుంటే కడుపు బద్దలవుతుంది.'

'పడవలింకనువెళ్ళవు. చెట్టుక్రిందఁ గూరుచుండి మాటాడుకొందము.'

చంద్రశేఖరశాస్త్రి రాజగోపాలముయొక్క మనోగతాభిప్రాయమును గనిపెట్టి,

సాయంకాలము బండిచేసికొని మరునాఁడు బెజవాడలో దిగెను. అతఁడు మాణిక్యాంబ కుత్తరమందఁజేయుటకు సమయమునాలోచించుచు మండువాపద్ద నరుగుమీఁదఁ గూరుచుండఁగా, తలుపువద్ద పిలుపొకటి వినఁబడెను. తలుపుతెరవఁగానే, భయోత్సాహముల మిశ్రచిహ్నములను సూచించు ముద్దుమొగముతో మాణిక్యాంబ యాతని యెదుట నిలఁబడినప్పుడాతని యానందమేమని వర్ణింపవచ్చును!

'మా అన్నయ్య సుఖముగనున్నాఁడా?'

'ఆ. నేవచ్చినానని యెవ్వరుచెప్పినారు?'

'ఎడ్లగంటల చప్పుడువిని చూచునప్పటికి మీరు కనఁబడినారు. మాయన్నయ్య యిక్కడకు వచ్చెదనని యేమైనఁ జెప్పినాఁడా?'

'నేవచ్చుటకుందర నాతనితో మాటాడియే వచ్చినాను. ఆమాట చెప్పలేదు.'

'సెలవుపుచ్చుకొని వచ్చినట్లున్నారు. నాలుగుదినములుందురా?'

'నిశ్చయముగాఁ జెప్పలేను. సెలవుమీఁదనే వచ్చినాను. చయనులు మామగారు వగయిరాలు క్షేమముగానున్నారా? ఇంటివద్దనే ఉన్నారా?'

'అందఱు సుఖముగానే ఉన్నారు. నాన్నగారు కోర్టుసాక్ష్యమునకు వెళ్ళినారు. అన్నయ్య నాలుగుదినములాయినది మంగళగిరివెళ్ళినాఁడు.'

'ఎప్పుడువచ్చును?'

'ఈరాత్రికి రావలెను. మీభోజనమునకు ప్రొద్దెక్కినది. నేను పోయెదను.'

'దక్షిణామూర్తి నీకిమ్మని యొకవస్తువిచ్చినాఁడు.'

'తరువాత నియ్యవచ్చునులెండి నాకు సెలవు.'

'బరువువస్తువుగాదు. ఇదిగో ఈయుత్తరమే. నాలుగుగంటల కొకసారి ఆవైపునకువచ్చెదను.'

ఇంటికిఁబోవుమార్గమందుత్తరము విప్పిచూచుకొని యీ కతిపయవాక్యములను జదువుకొన్నప్పుడామె మనస్సెట్లుండెనో!

'నీకష్టములు గట్టెక్కినవి. ఈ యుత్తరమును నీకందఁజేయు మన మిత్రుఁడే నీపాలిటి భాగ్యదేవత. విశేషముల నాతఁడే విస్తరించఁగలఁడు.'

ఎనిమిదవ ప్రకరణము.

ఆత్రముతో నుభయులచే నెదురుచూడఁబడుచుండిన నాలుగవగంటవచ్చెను. మీనాక్షి కృష్ణకు నీళ్లకుఁబోయెను. పేరిచయనులుగారి ముంగలి మండువావద్ద మాణి

క్యాంబా చంద్రశేఖరులు గలిసికొనిరి.

‘ఉత్తరమును జదువుకొన్నావా?’

చదువుకొన్నట్లాలతాంగి గండలవళిదళములందు నింతగా తలచూపిన గులాబి మొగ్గలవంటి రక్తిమయే సూచించెను.

‘అది దక్షిణామూర్తి నాతో నాలోచించి వ్రాసినదే.’

అనునప్పటి కాగులాబిమొగ్గలు వికసించినట్లు రక్తిమ యతిశయించెను.

‘దీనిని నీకందఁజేయవలెననియే నేనిక్కడకువచ్చినది.’

ఈమాటతో పుష్పములబరువుచేత వంగినదోయన్నట్లామెతలవంచెను.

‘పునర్వివాహములనుగూర్చి మనదేశములో చర్చలారంభమైనప్పటినుండియు నాకావిషయమయి పనిచేయ బుద్ధిపుట్టినది.’

‘అదృష్టహీనలపాలిఁటి దైవముండఁబట్టి—’

‘నేనింతవఱకును విద్యార్థి స్థితిదాటినవెనుక నట్లు చేయఁదలఁచితినిగాని దైవయోగమువల్ల నిప్పుడే—’

‘గాడేపల్లివారి సంబంధము నిశ్చయింపఁబడినదిగాఁబోలు!’

‘అవునుగాని మనదేశమును హీనగతికిఁ దెచ్చుచున్న బాల్యవివాహమునకు సిద్ధపడుటకంటె కానిపని విద్యాధికునకింకొకటి—’

‘అవధానులు మామగారికిఁ దెలిసినయెడల పెద్దపిల్లనే విచారింతురు.’

‘ఒక్క బాల్యవివాహములకు ప్రోత్సాహము గలుగఁజేయకుండుటయే నాయుద్దేశముగాదు. పునర్వివాహ సదాచారమునకుఁ దోడ్పడుటగూడ నాకు విధి.’

‘లోనికిఁబోయి మాటలాడుకొనవచ్చును. దయచేయుండి.’

‘వదినగారువచ్చువేళయయినదేమో?’

‘ఇంకొక పావుగంటకుఁగాని రాదు.’

వారు పూర్వోదాహృతమైన పంచపాళియందున్న చాపపయిఁ గూరుచుండిరి. చంద్రశేఖరునిపయి ననురాగము వ్యక్తపఱచుచుఁ దన చూపుఁదూఁపులచే నామె యాతని వశ్యునిచేసికొనుచుండెను. ఆతఁడును మాణిక్యాంబ యభిమతమెట్లుండునో యను లోని సందేహముయొక్క చిహ్నములు మొగమునఁ గనఁబఱచుచు నామెవంక దృష్టి నిలిపి కూరుచుండెను.

‘అవధానులు మామగారు ముహూర్తనిశ్చయము చేసినారుగాఁబోలు!’

‘ఔను. నాహృదయముదెలిపి వారు వృథాయాసపడకుండఁజేయుట—’

‘రేపటివైశాఖమాసములోఁ జేయుటకునిశ్చయించినారు గాఁబోలువివాహము.’

‘లేదు. కొద్దిదినములలోనే.’

క్రొత్తగా వికసించినయామె చెక్కులయందలి గులాబిపుష్పము లీవాక్యముతో కమలి వివర్ణములు కాఁజొచ్చెను.

‘ఏది? నాన్నగారు తలపెట్టినది గాదు, నేను తలపెట్టినవివాహము.’

‘మొదటిదే కావచ్చును. పెద్దలమాట కెదురుచెప్పుట కష్టముగదండి?’

‘సమయము వచ్చినప్పుడు కష్టములు తప్పవు.’

‘అవును. పెద్దలుచెప్పినది చేయుట కష్టమైనను దానినోర్చి చేయకతప్పదు.’

‘పెద్దలుచెప్పినదాని కెదురుచెప్పుట కష్టమైనను సమయమువచ్చినప్పుడెదురు చెప్పక తప్పదని నేనన్నది. నీవు వెళ్లినవెనుక భోజనకాలమందిదే ప్రస్తావన’

(ఆత్రముతో) ‘ఏమిజరిగినది?’

‘తన తమ్మునికొమార్తను జేయవలెనని మాయమ్మకోరిక. కట్నమెక్కువవచ్చిన చోట చేయుట నాయనగారికోరిక. నన్ను తనపక్షముననుండుమని అమ్మచెప్పినది.’

‘మీరు మీనాన్నగారిపక్షము గాఁబోలు!’

‘నేను నాపక్షమే. ప్రాజ్ఞుఁడైన కొమారుని వివాహవిషయమున తల్లిదండ్రులు స్వతంత్రులుకానందున, ఉభయపక్షములనువిడిచి నాయిష్టము కుదిరినచోట వివాహము చేసికొందునని నేనుచెప్పినాను.’

‘పిమ్మట?’

‘ఆచోటుచెప్పుమని వారునన్ను నిర్బంధపెట్టినమీఁదట పునర్వివాహ మాడఁగోరు కన్యయని చెప్పినాను.’

‘వెనుక?’

‘ఆమాట నాన్నగారు విని, కులమును చెరుపఁబుట్టితివనియు, చదువుమాన్పి యిలుగదలనీక కట్టి పడవేసెదననియు, కొంతసేపు రాళ్ళవర్షము కురిపించినారు.’

‘కటకటా! భాగ్యహీనలైన యనాథస్త్రీలనిమిత్త మెందఱికెన్నికష్టములు వచ్చుచున్నవి!’

‘ఎన్నితిట్టిననేమి? ఏకష్టములు పడఁబడిననేమి? ఈవిషయమున నావిధాయక ధర్మమును నెఱవేర్చుటకు నేను కృతనిశ్చయుఁడనైయున్నాను.’

‘మీవిద్యాభివృద్ధికి భంగమువచ్చునేమో?’

‘నాకు కాలేజిలో నెలకు పదునేనురూపాయల విద్యార్థివేతనమున్నది.’

‘అదిపోయినప్పుడు?’

‘ఈసంవత్సరార్థపరీక్షలో సిద్ధులైనవారిలో ప్రథమస్థానమున నేనునిలిచినయెడల-’

'విడలఁగద?'

'ఈవేతనము పోయినయెడల పనిలో ప్రవేశించి ధనముకూడఁబెట్టి మరల విద్యారంభముఁ జేసెదను. ఒక యనాథకాంతను దుఃఖసముద్రమునుండి దరిచేర్చుట గాని, ఈ పట్టపరీక్షాసిద్ధి గాదు నాకు ప్రధానము'

'అట్లైన నట్టివారు పలువురున్నారు.'

'చిరకాలజనితమైన బాల్యపువలపున్న నీవు నాకు ముఖ్య—'

'ఎంతో ముద్దుముచ్చటలతోఁ బెంచి పెద్దదానినిజేసి ప్రాణములన్నియు మీపయిని బెట్టుకొనియున్న తలిదండ్రులమనస్సు నొప్పించుట—'

'కష్టమేగాని, నాధర్మమును నెఱవేర్చుట కెన్నికష్టములకైన నడుముకట్టుకొనియే యున్నాను.'

'కనుకనే తల్లిదండ్రులను సుఖపెట్టి నాపయి ననురాగమునువీడుటవలని కష్టము లనుభవింపుఁడు.'

'కష్టము లనుభవింపవలసినవాఁడను నేనొక్కఁడనే అయినయెడల నాలాగుననే చేయుదును గాని, దుఃఖసాగరముననుండి మునుకలువేయుచుండఁగా నిన్నుఁజూచి నే నెట్లూరకుండఁగలను?'

'నాయొక్కదానికొఱకు వృద్ధులైన తల్లిదండ్రులను విచారపెట్టవచ్చునా?'

'దేశక్షేమకరమైన యాచారస్థాపనముకొఱకీ కార్యము కావలసివచ్చినప్పుడు, పెద్దల మూర్ఖవిచారమునకని బహుజన క్షేమచింత విడుచుట వివేకమా?'

'విద్యాధికులై సుఖపడఁగల స్థితిలోనుండి నాకొఱకు మీరు నిందపడుటకు నాయిష్టము లేదు.'

'సుఖము కొఱకని నాయంతరాత్మకు వ్యతిరిక్తముగా నడుచుకోలేను.'

'మీయోగ్యబుద్ధికిని, దుఃఖార్తులయెడ మీకున్న యవ్యాజప్రేమమునకును, నాయెడలఁగల మీ వలపునకును నా వందనములు'

'నీప్రతికూలవచనములనుబట్టి నాపయినను రాగములేదని శంకించుచున్నాను.'

'నాకు మీపయిఁగల గాఢానురాగమునకు భగవంతుఁడేసాక్షి.'

'హృదయేశ్వరీ! నాకీలోకములో ప్రేమాస్పదులగు వారందఱికంటెను నీవే ప్రియతమురాలవు. భగవంతుఁడు మన ప్రేమబంధమును మచ్ఛేద్యమగునట్లు బలపఱచును గాక!'

'ప్రాణనాథా! పురుషప్రకృతికి సాధ్యమైన దృఢానురాగమును మీరు నాపైఁ గనఁబఱిచినారు. స్త్రీప్రకృతికి సాధ్యమైన పూర్ణానురాగముతో నేనును మీకష్టసుఖము

లను పంచుకొందును. నాకొఱకు మీరు పడవలసిన కష్టము లసంఖ్యాకములు గానున్నవి. మీకొఱకు నాకెట్టికష్టములు వచ్చినను సంతోషపూర్వకముగా భరించెదను. నేను మీ యధీనురాలను. నన్ను మీధర్మపత్నినిగాఁ జేకొనుఁడు'

'ప్రాణేశ్వరీ! నేను నీయధీనుఁడను. నీవు తక్క తక్కిన సుందరులందఱు నాకు మాతృసమానలు.'

ఇట్లన్యోన్యప్రణయమును ప్రకటించు సంభాషణము జరగుచుండఁగా వీధితలుపు వద్ద పిలుపు వినఁబడినందున, మాణిక్యాంబ విచారముతో చంద్రశేఖరుని దొడ్డిదారిని బంపివేసి మీనాక్షికి తలుపుదీసెను.

తొమ్మిదవ ప్రకరణము.

ఆసాయంకాల మెనిమిదిగంటలప్పుడు చంద్రశేఖరశాస్త్రి వీధి యరుగుమీఁదఁ గూరుచుండి, మందముగా వీచుచున్న మలయానిలమును హాయిగ ననుభవించుచు, మాణిక్యాంబతోడి సల్లాపసౌఖ్యము కలిగించినందునకు భగవంతునికి కృతజ్ఞతా ప్రార్థనలు చేయుచుండెను. కష్టములను సంజనముచేసి భగవంతుఁడు భక్తుల చిత్తశుద్ధిని శోధించునుగాఁబోలు! మాణిక్యాంబ వపనకర్మనుగూర్చి యాలోచనలు జరుగుచున్నవని వార్తవచ్చెను. రాత్రి రెండుజాములకు రాజమహేంద్రవరమునకుఁ బ్రయాణమునకు సిద్ధముకమ్మని యా వార్తాహారిణియైన పరిచారిక చేతనే ప్రత్యుత్తరమునంపి, నిదురపోవచ్చునని మందువాయొద్ద పడకపఱచికొని నిదురపట్టక, తల్లిదండ్రులు నిద్రాప్రమత్తులగుటగని, మాణిక్యాంబ గృహమువద్ద నామెకొఱకు వేచియుండెను. అతఁడక్కడనున్నదంతయు పావుగంట పూర్తిగా లేకపోయినను, నిమిషమొక్క యుగమువలెఁ దోఁచి సందేహములు మనస్సునువేధించెను. ప్రత్యుత్తరము గొనిపోయిన పరిచారిక మాణిక్యమనుకొని మీనాక్షితోఁ జెప్పెనేమో! మీనాక్షి నిదురపోక కావలియున్నదేమో! పేరిచయనులుగారి కోపమడఁగలేదేమో! మాణిక్యాంబ నిద్రాపరవశురాలై మఱచిపోయినదేమో! మఱపువచ్చునా? నిద్రపట్టునా! నగలు మొదలైనవి మూటకట్టుచున్నదేమో! రెండుమూఁడు నిమిషములలో రావచ్చునేమో! తలుపువద్ద వినవచ్చుచున్న యాధ్వని యెవరిది? వడఁకుచు నిమ్మళముగాఁ దలుపుమూసి తొట్రుపాటుతో గడప దిగుచున్న యాబంగరు సలాకయెవ్వరు? ఏమి నాభాగ్యము! హృదయేశ్వరీ! నాప్రాణములు నిలఁబెట్టితివిగదే!

అనుచు చాచఁబడిన యాతనిచేతులలో వ్రాలిన మాణిక్యాంబను ముద్దిడెను.

‘ప్రాణనాథా! ఏమి నాయదృష్టము! మీరువచ్చుట కాలస్యముచేయుదురేమో యని భయపడుచుండఁగా, నాయందుఁగల ప్రేమాతిశయముచే మీరే నాకొఱకు వేచి యున్నారు! నాకృతజ్ఞతను నేనెట్లు తెలుపుకొందును!’

‘ప్రియురాలా! మామగారి క్రూరప్రయత్నములనుండి తప్పించుకొని, నాతో కలిసికొన్నందుకు నీయెడ నేనే కృతజ్ఞుఁడను’

నాథుని ప్రియవచనములకు గాఢాలింగనముచేసి, ముద్దిడి, చుట్టును దృష్టినిబఱపి,

‘నాథా! మనమిక్కడనుండి తరలిపోవలెను. ఇక్కడనుండవలదు.’

‘ప్రాణేశ్వరీ! అవునవును. సత్వరముగాపోదము.’

కాకులు కూయువేళకు గన్నవరముచేరుకొని యేలూరునకు బండిమాటాడుకొనిరి. నడకవలని ప్రయాస మధికముగానున్నను, ప్రభాతవాయువులచే పునరుజ్జీవితులై, అన్యోన్య సంభాషణములలో ప్రయాణదీర్ఘతను మఱచిపోయిరి.

‘నిన్న మనమనుకొన్న మాటలను వదినె విన్నదా యేమి!’

‘కాఁబోలు! మనమెఱుఁగనే యెఱుఁగము. గోడలకుఁగూడ చెవులున్నవి.’

‘చయనులు మామయు సుందరముబావయు దీపములుపెట్టువేళకే వచ్చినారా!’

‘మీరువెళ్లినగడియకు వారునువచ్చి అక్కయ్యవల్ల సంగతివిన్నారు.’

‘ఏమ్మట?’

‘నాన్నగారు నన్నుపిలిచి, భయపెట్టి, నీతులుచెప్పి, బ్రతిమాలి, తిట్టి, అవధానులు మామగారితోఁజెప్పి మిమ్ములను గట్టిపడవేయించెదనని సకలోపాయములచేతను నాప్రయత్నమును మాన్పఁజూచినారు.’

‘తరువాత?’

‘ఎంతకును కార్యముగానక, మొగమెఱ్ఱచేసికొని, మఱునాఁడే నాపని పట్టించెదనని—’, అని వడఁకుచు కన్నీరుపుచ్చెను.

‘కడచినదేమో కడచినది. దైవసాహాయ్యమువల్ల మనమగ్నిమధ్యమునుండి బయలఁబడినాము. విచారించకు.’

‘మీరుచేసినమేలు నేనెన్నఁడును మఱువలేను.

‘మనుష్యప్రయత్నము లెంతటివి? భగవంతునినే కృతజ్ఞతతోఁ దలఁచుకొందము.

బండి యేలూరు సమీపించునప్పటికి చూపు మేరదూరమున నొక్కపురుషుఁడు దృష్టిపథమునఁబడెను. ఆతఁడు పరిచితపురుషునివలెఁ దోఁచినందున వారిగుండెలు కమలెను. ఆతఁడు సమీపించినకొలఁది నాతఁడీతఁడని తెలిసికొని మాణిక్యాంబ,

‘ఆటంకములెన్నో తప్పినవిగాని,’ అని దీనస్వరముతో,

‘యిప్పుడీయన మనకేమి ప్రతికూలించునో! ఏమియుపాయము!’

‘భయములేదు. మొన్న నేను రాజమహేంద్రవరమునుండి వచ్చుచుండఁగా ఈయనను కలిసికొని మాటాడినాను. నీకేలాగుననైన వివాహముచేయించవలెననియే ఆయన సంకల్పము.’

‘ఆయనకింత సదుద్దేశమెట్లుకలిగెనో! బొమ్మజెముడు డొంకలో సంపంగిపువ్వు పుట్టునా?’

‘సదుద్దేశములకేమి? నష్టములేదనితోఁచి, జననిందరానంతవఱకు, మనవారికి సదుద్దేశములకేమియు కఱవులేదు. నీయీవివాహమువల్ల నలువదియెకరములును నీమతిఁ దిరిఁబోకపోయిన యెడలను, తన్నితరులు గేలిచేయకపోయినను, చయనులు మామగారుమాత్రము నీకడ్డముచెప్పుదురనుకొన్నావా?’

‘మట్టిపిల్లియైననేమి? బ్రాహ్మణపిల్లియైననేమి? ఎలుకను పట్టుట కావలసినది. బండి ఆపుమని చెప్పండి.’

రాజగోపాలము బండిలోఁగూరుచుండి, పునర్వివాహమునుగూర్చియు, మాణిక్యాంబా చంద్రశేఖరులనుగూర్చియు, కొంతపొగడి, మాణిక్యాంబవంకఁదిరిగి,

‘నేనింకా యేలూరుకీసుకొచ్చి యీసంగతి మాట్లాడాలనుకుంటున్నాను.

‘అవునఁట! మీ సదుద్దేశములను విని సంతోషించినాను. మఱ్ఱిదినముననే డింగీ మాటాడి రాజమహేంద్రవరము వెళ్లి సాధనము చేయవలెను.’

‘డింగీయెందుకు? పడవమీదే వెళ్లొచ్చు.’

‘అన్నయ్యవచ్చి, కలసికొనునేమో?’

‘ఇక్కడికొచ్చేటప్పటికే అతని పనవుతుంది. అప్పటికి మీపడవసాగి కొంతదూరమెడుతుంది. డింగీయెందుకు కర్చుకుచేటు?’

‘పడవలవారు మకాములలో ఆగుచుందురు. అలాఁగా సుందరముబావగారు రాఁగలరు. పదిరూపాయలయినను డింగీ మాటాడుకోవలెనండి.’

‘మాకు పడవలదగ్గఱ దిగుటకేదైన సత్రమున్నదా?’

‘పడవలదగ్గిర సత్రమూలేదు, వంటచేసుకోవడానిక్కీ వసతీలేదు. పడవలకు రెండుమైళ్లదూరంలో ఉంది రాజాగారిసత్రం.’

‘తప్పనిసరియైన నక్కడనే దిగుదము. మీరుకూడ మాతోనే యుండుడండి. అయితే యింట అప్పగారు కనిపెట్టుకొని యుందురేమో?’

‘కాస్సేపు కనిపెట్టుకుండి అదే తింటుంది. మళ్ళియెన్నాళ్లకో నీచేతిప్రసాదం?’

జ్యోతిశ్శాస్త్రసంగ్రహము. (౩౦౮-పుట శేషము.)

సూర్యుని వ్యాసము ౮౫౦౦౦౦ మైళ్లు; పరిమాణము భూమికంటె ౧౩౫౦౦౦౦ గుణములధికము. పరిమాణమునందంత పెద్దదిగానున్న సూర్యబింబముకంటె భూగోళము దాదాపుగా చతుర్గుణము లధిక సాంద్రమయినందున, భూమిని చంకక్రిందఁబెట్టుకొని పఱచినట్లు పురాణములలోఁ జెప్పఁబడిన హిరణ్యాక్షునికంటెను కోటిగుణము లధిక బలాఢ్యుఁడొకఁడు బైలుదేఱి సూర్యబింబమును దానికితగిన త్రాసుతో నొక ప్రక్కను వేయఁగలిగినయెడల దానితో సరితూఁగుటకయి రెండవప్రక్కను మన భూమివంటి గోళములను మూఁడులక్షల యేఁబదివేలను వేసినఁ జాలును. భూమి యొక్క తూనిక ౬౦౯౫౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦ టను లనియు, సూర్యుని యొక్క తూనిక ౨౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦౦ టను లనియు శాస్త్రజ్ఞులు గణన చేసియున్నారు. అన్నిగ్రహముల యొక్క మొత్తపు బరువుకంటెను సూర్యబింబము యొక్కబరు వేడువందల యేఁబది రెట్లెక్కువగానుండును. అచేతనములైన గ్రహముల నన్నిటిని పురుషులనుగాఁ జేసినట్లే మన పౌరాణికులు మొదలైనవారు సూర్యునిసహితము పురుషునిగాఁ జేసి యాతనికి భార్యల నంటఁగట్టి సంతానమును గలిగించి వింతయైన మానసిక సృష్టిని జేసియున్నారు. మనుష్యుని కల్పనశక్తి యత్యద్భుతమైనదిగదా!

నాలవ ప్రకరణము.

చంద్రుఁడు.

ఆకాశభాగమునగోచరములగు జ్యోతిర్మండలములలో నెల్లనుమిక్కిలిగొప్పదిగా గానఁబడు సూర్యబింబమునుగూర్చి యిదివఱకు కొంత తెలిసికొన్నందున, ఇఁక మన మించుమించుగా సూర్యబింబమంత పెద్దదిగాఁ గనఁబడు చంద్రమండలమునుగూర్చి కూడ కొంత తెలిసికొనవలెను. గ్రహములన్నిటికంటెను సూర్యబింబము భూమికెట్లు దూరమైనయున్నదో యట్లే చంద్రబింబము గ్రహములలో నెల్లను భూమి కత్యంత సమీపమునయున్నది. ఆహ్లాదకరత్వమునుబట్టియు మనోహరత్వమునుబట్టియు పశ్చిమఖండవాసులు చందమామను స్త్రీనిగా వ్యవహరించుచున్నను, మనదేశస్థులుమాత్రము సూర్యునికి వలెనే చంద్రునకును పురుషత్వమే యారోపించుచున్నారు. మహాత్ములయిన మన పౌరాణికులు సూర్యునికి కశ్యపమహర్షిని తండ్రినిగా సృజించినట్లే యత్రి మహర్షిని చంద్రునకును జనకునిగా సృజించి, సూర్యునిరథమున నేకచక్రమును బెట్టినను చంద్రుని రథమునకు మూఁడుచక్రములను బెట్టి గుఱ్ఱములను సహితము మూఁటినధికముగా నను గ్రహించినారు. చంద్రుఁడు దక్షునికూఁతుల నిరువదియేడ్వురను పరిణయమయ్యెనఁట!


వారిలో రోహిణియం దధికానురాగమును జూపఁగా సహింపలేక తక్కిన భార్యలు పోయి తండ్రితో మొఱ్ఱపెట్టుకొన్నప్పుడు దక్షప్రజాపతి యల్లునకు క్షయరోగము వచ్చునట్లు శాపమిచ్చెనఁట! మగనికి సంభవించిన యాఘోరవిపత్తునకు దుఃఖించి దక్షపుత్రికలు వేఁడుకొనఁగా జాలిపడి దక్షప్రజాపతి యల్లునకా క్షయరోగము కొంతకాలమే యుండునట్లనుగ్రహించినందున, నాఁటనుండియు చంద్రునకు వృద్ధిక్షయములు పక్షపక్షమునను కలుగుచున్నవఁట! ఏమి! ఈ పురాణగాథల వైచిత్ర్యము! పురాణములలో కథకు కాళ్లును ముంతకు చెవులునుండవుగదా!

సూర్యబింబముతో సమానకాంతిగలదిగా కనఁబడకపోయినను, చంద్రబింబము సూర్యునికంటె నధికాహ్లాదకరమయిన దనుటకు సందేహము లేదు. సూర్యుఁడు మన భూలోకమున కొక్కదానికి మాత్రమే కాక తక్కిన సమస్త గ్రహములకును గూడ వెలుతురు నిచ్చుచున్నాఁడు; ఇఁక చంద్రుఁడో మనకొఱకే చేయఁబడి యీ భూలోకమొక్కదాని నిమిత్తమే వేఁడిమిలేని చల్లనికాంతితో వెండిబంతివలె కన్నులపండుగగా ప్రకాశించుచున్నాఁడు. భూమికి మిక్కిలి చేరువనుండుటనుబట్టి చంద్రబింబము సూర్యబింబమంతయున్నట్లు కనఁబడుచున్నను, సూర్యబింబముయొక్క సరసను జేర్చినప్పుడది తన గొప్పతనమునంతను బోఁగొట్టుకొని పెద్ద గుమ్మడికాయముందఱి యావగింజవంటిదయిపోవును. పరిమాణము మాట యటుండనిచ్చినను, చంద్రుఁడు గ్రహములలో నొకటియైనను గాక భూమిచుట్టును దిరిగెడి యొక చిన్న యుపగ్రహమయియున్నది. అంగారకుఁడు బుధుఁడు మొదలయిన గ్రహములు సూర్యుని చుట్టును ప్రదక్షిణములు చేయుచుండును; చంద్రుఁడు మొదలయిన యుపగ్రహములు తామొక గ్రహము చుట్టును దిరుగుచు, ఆగ్రహముతోఁ గలిసి సూర్యునికిఁ బ్రదక్షిణములు చేయుచుండును. దాదాపుగా నిరువదితొమ్మిది దినములలో చంద్రుఁడొక్కసారి పడమటనుండి తూర్పునకు మనభూమిచుట్టును తిరుగుచుండును. ఇన్నూటయెబ్బది సంవత్సరముల క్రిందట మొట్టమొదట దూరదర్శక యంత్రమును కనిపెట్టినప్పటినుండియు భూమి కత్యంత సమీపములో నున్నదగుటచేత జ్యోతిష్కులు చంద్రబింబమునే యత్యధికముగా శోధించుచువచ్చిరి. మనవారఱ్ఱియనియు మఱ్ఱియనియు చెప్పెడు చంద్రబింబములోని నల్లనిభాగముల నెల్లవారును జూచుచునేయున్నారుగదా! ఆకళంకములను ప్రబలమైన దూరదర్శక యంత్రములతో నిపుణముగా పరిశీలించినప్పుడు చంద్రబింబముయొక్క ప్రకాశమానములయిన భాగములకు సూర్యబింబ మెడమవైపున నున్న దినములలో మచ్చలు కుడివైపున నున్నట్లును, సూర్యబింబము కుడివైపుననున్న దినములలో మచ్చ లెడమవైపున నున్నట్లును స్పష్టపడినది. అందుచేత చంద్రబింబము

లోని ప్రకాశమానములైన భాగములు మిట్టలనియు, నల్లగా కనఁబడుభాగములు వాని నీడలు వ్యాపించు పల్లములును సూర్యరశ్మిసోఁకని కనములుననియు, తెల్లతెల్ల పొడలవలె నడుమనడుమఁ గనఁబడుచుండు భాగములు సమప్రదేశములనియు, సులభముగా నిశ్చయింపఁబడినవి.

అయినను చంద్రునిలోని పర్వతములు భూమిమీఁది వానివలె సాధారణముగా వరుసలు తీఱియున్నట్టు లేవు. చంద్రునియొక్క పయిభాగము వివిధ పరిమాణములుగల గర్తములతో నిండియున్నట్టు కనఁబడుచున్నది. చంద్రబింబముయొక్క పయిభాగమునందున్న యీగోతులు కొన్నిచోట్ల దూరమునుండి దూరదర్శక యంత్రముతోఁ జూచువారి దృష్టికి తేనెపట్టువలె బొరియలతో నిండియున్నట్లు కనఁబడును. వీనిలోని చిన్నగుంటలచుట్టును ఏటవాలుగానుండు గట్లవంటి మిట్టలుండును; పెద్దపల్లముల చుట్టును వలయాకారములుగానుండు పర్వతముల వరుసలుండును. హెచ్చుతగ్గులుగల పర్వతములపంక్తిచేఁ జుట్టఁబడియుండెడి యీ పల్లములలోఁ గొన్ని పదునొకండువేల యడుగుల లోఁతుండును; ఇట్టి పెద్దపల్లములలోఁ గొన్నిటియొక్క యడ్డుకొలఁత యొకప్రక్కనుండి యొకప్రక్కకేఁబదిమైళ్లు మొదలుకొని నూటముప్పదిమైళ్లవఱకును గలదు. ఈపల్లములలో నడుమనుగూడ సాధారణముగా నొకటిగాని యధికముగాని మిట్టలుండును; అవి చుట్టునుగల పర్వతములకంటె పొట్టివిగానుండును. ఈ పల్లములలో ముఖ్యమైన యొకదానియొక్క వ్యాసము నూటపదునాలుగు మైళ్లున్నట్టును, మఱియొకదానిది యేఁబదియాఱుమైళ్లున్నట్టును, ఇంకొకదానిది యేఁబదినాలుగు మయిళ్లున్నట్టును, కొలిచియున్నారు. ఏఁబదినాలుగుమైళ్ళ వ్యాసముగల పల్లములో నడుమనున్న కొండయొక్క యెత్తు అయిదువేల యడుగులయినట్టు గణనచేసినారు; చుట్టును ప్రాకారమువలెనున్న పర్వతావళియొక్క యెత్తు ౧౮౮౦౦ అడుగులనఁగా నించుమించుగా మూఁడుమయిళ్లున్నది, ఆపల్లముయొక్క వైశాల్యమంతయుఁ గలసి ౨౦౦౦ చదరపుమైళ్లున్నది. ఏఁబదియాఱుమైళ్ళ వెడల్పుగల గర్తములో మధ్యనున్న పర్వతమున కాఱు శిఖరములున్నవి; ఆ యాఱింటిలో మిక్కిలి యున్నతమయినవి రెండు ౨౪౦౦ అడుగుల యెత్తుగలవిగానున్నవి; ఆపల్లమునకు చుట్టునుగల యావరణపర్వతముల యెత్తు ౧౧౦౦౦ అడుగులు. వేఱొక పల్లముయొక్క యడ్డుకొలఁత నూటముప్పదిమూఁడుమైళ్ళవఱకు నున్నట్టూహచేయుచున్నారు. భూలోకములో లేని యీ వలయాకారములయిన పర్వతములును వాని నడిమిపల్లములును గాక చంద్రునిపయిని మనభూమిమీఁది పర్వతములవంటి పర్వతములును బయళ్ళను కూడఁ గొన్నికలవు. చంద్రునిలో జలము లేదని తెలియకమున్న పీఁబయళ్ళను కొంటివాదు

సముద్రములని భ్రమపడిరి. వలయాకారముగానుండు పర్వతావళియొకటియు దాని నడుమనుండు పల్లమును ఈక్రిందిపటములోఁ జూపఁబడినవి—



దీని నడిమిపల్ల మడ్డుకొలఁతయం దఱువదిమైళ్లున్నది; పల్లముయొక్క వైశాల్యము ౫౦౦ చదరపుమైళ్లు; చుట్టుగోడవలె వలయాకారముగానున్న పర్వతపంక్తియొక్క యౌన్నత్యము పడమటివైపున ౩౫౦౦ అడుగులు మొదలుకొని ౭౩౦౦ అడుగుల వఱకును ఉన్నది; దాని యౌన్నత్యము తూర్పువైపున నింతకంటెను గొంచెమధికముగానేయున్నది. ఈపటములోఁ జూపఁబడిన రూపము చంద్రబింబములో ప్రాతఃకాలమునం దగపడురీతిని వేయఁబడియున్నది. మీరు దీనివంకఁ జూడఁగానే గర్తమున కావరణముగానున్న పర్వతపంక్తియొక్క నీడలు రెండువైపులను కుడిప్రక్కకు వాలియున్నట్లు స్పష్టముగా కనఁబడును. మధ్యాహ్నసమయమునం దిట్టినీడలు లేక మధ్యభాగము కాంతిహీనముగా మాత్రము కనఁబడును. ఇఁక సాయంకాలమునం దైనచో యిప్పటివలె నీడలు కుడివైపున లేక యెడమప్రక్కకు వాలియుండును.

మనభూమికివలెనే చంద్రునికిని స్వతస్సిద్ధమైనకాంతి లేదనియు, రాత్రులు చంద్రునినుండి మనకువచ్చు వెన్నెలయంతయు చంద్రబింబము మీఁదఁబడిన సూర్యకిరణముల ప్రతిఫలనమనియు, చిరకాలమునుండి పూర్వులే యెఱిఁగియున్నారు. చంద్రబింబము చుట్టును మనభూమికివలె వాతావరణము సహితము లేదు; చంద్రమండలములో జలమంతకుముందే లేదు. వాయుజలములు రెండును లేకపోవుటచేత చంద్రమండలములో వృక్షములుగాని పచ్చికగాని లేక సర్వమును మాడిపోయిన యెడారివలె పాషాణమయమయి యుండును. అక్కడ నదులుగాని, సరస్సులుగాని, వానలుగాని, మేఘములుగాని యేమియులేక యెప్పుడును నిశ్శబ్దముగానుండును. చంద్రమండలములో వాసముచేయు మనుష్యులున్నపక్షమున వారి కొండొరులమాటలు వినఁబడవు; ఆఘ్రాణించుటకు వాయువులేదు; త్రాగుటకు జలములేదు. ఈహేతువుచేత చంద్రమండలములో జీవజంతువులుండుట యసాధ్యమని శాస్త్రజ్ఞులు చెప్పియున్నారు.

మనబుద్ధికిది యసాధ్యముగా తోఁచినను దేవుని సామర్థ్యమున కేదియు నసాధ్యము కానేరదు. ఇచ్ఛ వచ్చినయెడల నతఁడు వాయుజలములతోఁ బనిలేని విచిత్ర జంతువులనే సృజింపవచ్చును. స్థలమున వసించు మనము సదా వాయువు నాఘ్రాణించి బ్రతుకుచు ప్రమాదవశమున నీటిలోఁ బడినప్పుడు ప్రాణములు విడుచుచు వచ్చుటచేత నెప్పుడును జలజంతువులనుజూచి యెఱుఁగకుందుమేని, శ్వాసనువిడుచుట కవకాశము లేని నీటిలో జీవజంతువులుండుట యసాధ్యమని భావింపవచ్చును. ఆప్రకారముగానే వెట్టను నైచిన యల్పకాలములోనే ప్రాణములఁ బాసెడు జలచరములు స్థలజంతువులను జూచియుండనిపక్షమున నేలమీఁద జీవజంతువులుండుట యసాధ్యమని భావింపవచ్చును. మనము మన లోకానుభవమునుబట్టి చంద్రలోకములో జీవజంతువులు లేవని సిద్ధాంతము చేసినను, సర్వశక్తుఁడయిన యీశ్వరుఁ డక్కడ నేమి యద్భుతములను కల్పించెనో నిశ్చయముగా నెవ్వరు చెప్పఁగలరు? మనకువలె రేయింబగళ్లిరువదినాలుగు గంటలలోనొక్కొక్కసారి చొప్పనమాఱిరాక యేకరీతిగా పక్షముదినము లొక్కటే పగలుగానుండి యెండవేఁడిమిచేత పయిభాగమంతయు వేఁడిమంగలమువలె మాడుచుండుటచేతను, మఱి పక్షముదినములు సూర్యరశ్మియన్నమాట లేక యొక్కటే రాత్రిగానుండి మంచుగడ్డకంటెను నెక్కుడు చలువలుగ్రమ్మి పయిభాగమంతయు శీతాక్రాంతమగుచుండుటచేతను, చంద్రమండలములో జంతువులుండవని కారణాంతరమును సహితము చెప్పుచున్నారు. రూపదర్శక యంత్రముతో శోధించుటచేతకూడ చంద్రునికి వాతావరణము లేదని స్థిరపడినది.


ఉచ్చస్థానమునందున్నప్పుడు చంద్రబింబమునుండి భూమికిఁగల దూరము ౨౫౨౯౫౦ మైళ్లు; నీచస్థానమునందున్నప్పుడు ౨౨౧౫౯౦ మైళ్లు; మధ్యస్థానమునందున్నప్పుడు ౨౩౮౭౯౦ మైళ్లు. కాఁబట్టి భూమియొక్క మధ్యభాగమునుండి చంద్రుని మధ్యభాగమునకుఁగల దూరము రమారమి రెండులక్షల నలువదివేల మైళ్లని చెప్పవచ్చును. అందుచేత భూమికిని చంద్రునికిని మధ్య గంటకు ముప్పదిమైళ్లచొప్పున రాత్రిందివములు విరామము లేక నడుచుచుండెడి యావిరిబండి పోఁదగిన యినుపదారియొకటి యుండుట సాధ్యమయ్యెనుపక్షమున, మనము పదునెకండు మాసములలో చంద్రుని వద్దకుఁబోయి చేరఁగలుగుదుము. చంద్రునియొక్క వ్యాసము భూమియొక్క వ్యాసములో నాలవవంతనఁగా నించుమించుగా రెండువేలమయిళ్లున్నది. చంద్రుని కర్ణము (వ్యాసము) సరిగా ౨౧౬౦ మైళ్లన్నదని జ్యోతిశ్శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. చంద్రునియొక్క పయిప్రదేశమంతయు ౧౪౬౦౦౦౦౦ చదరపుమైళ్లనఁగా భూమియొక్క పయిప్రదేశములో పదుమూడవపాలుకంటె తక్కువగాను పదునాలవపాలుకంటె

హెచ్చుగాను ఉండును. భూమి పరిమాణము చంద్రునిదానికంటె దాదాపుగా నేఁబది రెట్లుమాత్రమే పెద్దదిగానున్నను, భూమి చంద్రునికంటె దాదాపుగా నేఁబది రెండు రెట్లధిక భారముకలదిగానున్నది. దీనినిబట్టి చూడఁగా చంద్రునికంటె భూమి యధిక సాంద్రమయినట్టు స్పష్టమగుచున్నది. భూమినిబట్టి చూచినపక్షమున చంద్రబింబమయిదువంతులలో మూఁడువంతుల సాంద్రతనుమాత్రమే కలిగియున్నది. అనఁగా మూఁడు ఘనపాదముల భూద్రవ్యముతో సరితూఁగుటకయి యైదు ఘనపాదముల చంద్రద్రవ్యము కావలసియుండును. చంద్రమండలమునుండి చూచువారికి మనభూమి పదునాలుగు పూర్ణిమాచంద్రబింబము లంత పెద్దదిగా ప్రకాశించుచు నెంతయు మనోహరముగా నుండును. చంద్రుఁడొక్కసారి భూమిచుట్టును తిరిగివచ్చుట కిరువదితొమ్మిది దినముల పండ్రెండుగంటల నలువదినాలుగు నిమిషముల కాలముపట్టును. అదియే చాంద్రమాసము. చంద్రునకు నక్షత్రమాస మిరువదియేడుదినముల యేడుగంటల నలువదినాలుగు నిమిషములలో కలుగును. చంద్రబింబము భూమిచుట్టును తానెంతకాలములో తిరుగునో యంతకాలములోనే తన యక్షముమీఁద నొక్కసారి యాత్మప్రదక్షిణముచేయును. అందుచేత మనమెప్పుడును చంద్రునియొక్క యొక్కయర్ధభాగమునుమాత్రమే చూడఁగలుగుదుము గాని రెండవయర్ధభాగమును జూడలేము. సరిగా తాను భూమిచుట్టును తిరుగుచున్నంతకాలములోనే కాక యంతకంటె నెక్కువకాలములోఁగాని తక్కువకాలములోఁగాని తన యక్షముమీఁద తిరుగుచుండుట తటస్థించినను, తన యక్షముమీఁద నాత్మప్రదక్షిణము లేచేయక భూమిచుట్టునుమాత్రమే తిరుగుచుండుట తటస్థించినను, మనమప్పుడు తక్కిన సమస్తగ్రహములవలెనే చంద్రునియొక్క సర్వభాగములను జూడఁగలిగియుందుము. ఇట్లేఁధముగాను జరగక వింతగా చంద్రునియొక్క రెండు గతులును సమానకాలములోనే జరగుట సంభవించుచున్నందున, చంద్రునియొక్క యొక్క యర్ధభాగమే సదా మనవైపునకుండుటయు తన్మూలమున మనమెప్పుడును తక్కిన యర్ధభాగమును చూడలేకపోవుటయు తటస్థించుచున్నది. ప్రపంచము పుట్టినప్పటినుండి నేఁటివఱకును చంద్రుఁ డెప్పుడును తన రెండవవైపును మన భూమివంకఁ ద్రిప్పియుండలేదు; ముందును త్రిప్పఁబోఁడు. దూరముననున్న యితరగ్రహము లన్నిటియొక్క పూర్ణదర్శనము పొందఁగలిగిన మనకు మనభూమియొక్క యుపగ్రహమయి దాపుననున్న చంద్రుని దర్ధదర్శనముకంటె నధికముగా లభింపకపోవుట సంతాపకరముగదా!

చంద్రునకు స్వతస్సిద్ధమయిన కాంతి లేకపోవుటయే వృద్ధిక్షయములకు హేతువగుచున్నది. మనభూమి సూర్యునికిని చంద్రునకును మధ్యభాగమునందుండ, సూర్యకిరణములుపడి ప్రకాశించెడు చంద్రుని యర్ధభాగమును మనము పూర్ణముగాఁ జూడఁ

గలిగినదినము పూర్ణిమయనఁబడును. చంద్రుఁడు మనభూమికిని సూర్యునికిని మధ్యభాగమునందుండుటచేత సూర్యకిరణములు వెనుకప్రక్కను సోఁకి ప్రకాశించుచుండఁగా మనకెదుటఁ గనఁబడెడి యర్థభాగము తేజోవిహీనముగానుండు దిన మమావాస్యయనఁబడును. అమావాస్యనాఁడు చంద్రబింబము సూర్యునికి సమీపమున నుండి సూర్యునితోడఁ గూడ తిరుగుచుండుటచేత, నాఁడు రాత్రియుఁ బగలునుకూడ చంద్రబింబము మనకు నేత్రగోచరము కాదు. చంద్రబింబ మెప్పుడును సూర్యుని కెదురుగానుండు భాగమున ప్రకాశముకలదయి, వెనుకభాగమున ప్రకాశములేనిదయి యుండును. చంద్రునికి స్వతస్సిద్ధమయిన కాంతియే యున్నపక్షమున, కళలయందు వృద్ధిక్షయములు లేనివాఁడయి గుండ్రనిబింబముతో సూర్యునివలె సదా పూర్ణముగా ప్రకాశించుచునే యుండును. సూర్యకాంతివలననే ప్రకాశమునొందుచు తనయక్షముమీఁద తిరుగుచుండుటయేకాక భూమిచుట్టునుగూడ ప్రదక్షిణములు చేయుచుండుటచేత చంద్రకళలయందు హెచ్చుతగ్గులు కలుగుచున్నవి. సూర్యాస్తమానము మొదలుకొని వెన్నెలవచ్చు పదునేను దినములును శుక్లపక్షమనియు, అటుతరువాత సూర్యాస్తమానము మొదలుకొని చీఁకటివచ్చు పదునేను దినములును కృష్ణపక్షమనియు చెప్పఁబడును. బహుళపక్షమున సూర్యోదయమునకుఁ బూర్వము చంద్రుఁడు తూర్పున నుదయించుట మానివేసిన నాలుగుదినములకు శుక్లపక్షములోఁ జంద్రుఁడు సూర్యాస్తమానానంతరమున మరల పడమటను కనఁబడుట కారంభించును. అమావాస్య యీ నడిమికాలమునందు వచ్చును. అమావాస్య గడచినతరువాత చంద్రబింబము మొట్టమొదట వంచిన వింటివలె రేఖగాతోఁచును; కొమ్ములనఁబడెడి యీ రేఖాగ్రములు రెండును దిఙ్మండలమున నస్తమించిన సూర్యునికి మీఁదివైపుననుండును. ఈసమయమునందు ప్రకాశమానమైన బాలచంద్రరేఖమాత్రమేకాక కాంతిహీనమైన తక్కిన చంద్రబింబమంతయుఁగూడ మనకు నేత్రగోచరమగుచుండును. ప్రకాశమానమైన రేఖ సూర్యకాంతివలనను, తేజోహీనమైన బింబము భూకాంతివలనను, దృష్టిగోచరమగును. (సూర్యకిరణములు చంద్రునిమీఁదఁబడి వెన్నెలగా ప్రతిఫలించునట్లే భూమిమీఁదనుబడి ప్రతిఫలించి చంద్రాది గోళములకు వెలుతురునిచ్చును.) ఆ మఱునాఁడు చంద్రరేఖ మఱింత స్ఫుటముగాను సూర్యునినుండి మఱింత దూరముగాను తోఁచి, మఱింత యాలస్యముగా నస్తమించును. నాలవ (చతుర్థి) నాఁటికింకను రేఖగానే కనఁబడుచున్నను చంద్రబింబము నాలవవంతధికకాంతిమంతమయి తక్కినభాగమతిమందకాంతితోఁ గానఁబడ ప్రకాశించును. ఆపైని సూర్యతేజస్సు సోఁకని బింబభాగము భూకాంతిచేతఁ గానఁబడదు. ఈప్రకారముగా చంద్రబింబము దినదినాభి

వృద్ధి నొందుచు, అష్టమినాఁటి కర్ధబింబమును, ద్వాదశినాఁటికి ముప్పాతికబింబమునుఁ బ్రకాశించుభాగమంతయు మనవైపునకుఁ దిరుగ పూర్ణిమనాఁటికి పూర్ణబింబమును, అయి రాత్రి యంతకంతకధికకాలము ప్రకాశించుచువచ్చి పూర్ణిమనాఁటికి సరిగా సూర్యుని కెదుటిప్రక్కకువచ్చి రాత్రియంతయు ప్రకాశించునదియగును. పున్నమ నాఁడు సూర్యుఁడు పశ్చిమమున నస్తమించుచుండఁగా, చంద్రుఁడు తూర్పున నుద యించుచుండును. ఈరీతిని శుక్లపక్షమున దినదినాభివృద్ధిచెందెడు చంద్రబింబము పూర్ణిమ గడచిన నాలుగుదినములకనఁగా కృష్ణపక్ష చతుర్థినాఁటికి క్రమక్రమముగా క్షీణించుచువచ్చి నాలవవంతువఱకు కాంతిహీనమయి యంతకంత కాలస్యముగా నుదయించి రాత్రి యల్పకాలము ప్రకాశించుచు, అష్టమినాఁటి కర్ధబింబమయి, ద్వాదశి నాఁటికి పాతికబింబమయి, అమావాస్యనాఁటికి కాంతిహీనమైన భాగముమాత్రమే మనవంకఁదిరుగ నదృశ్యమయి సరిగా సూర్యునిప్రక్కకు వచ్చును. అందుచేత నమా వాస్యనాఁడు సూర్యుఁడును చంద్రుఁడును దాదాపుగా నేకకాలమునందే యుదయిం చుట సంభవించును. ఈప్రకారముగా నెలకొకపర్యాయము శుక్లపక్షమును కృష్ణ పక్షమును మాఱిమాఱి వచ్చుచుండును. అమావాస్యనాఁడు చంద్రబింబము సూర్యునికిని భూమికిని మధ్యకువచ్చుటచేత సూర్యకిరణములుసోఁకి ప్రకాశించుభాగము మనకు మఱుఁగయి సూర్యునివైపునకును, ప్రకాశింపని భాగము మనవైపునకును, తిరిగి యుండును; పూర్ణిమనాఁడు మనభూమియే చంద్రునికిని సూర్యునికిని మధ్యకువచ్చుట చేత సూర్యకిరణములుసోఁకి ప్రకాశించుభాగము మనవైపునకును ప్రకాశింపని భాగము వెనుకవైపునకును తిరిగియుండును. చంద్రుని వృద్ధిక్షయములు సులభముగాఁ దెలియున ట్లొకదృష్టాంతమును జూపవచ్చును—



గదిలో నొకదీపము (S) పెట్టి యదియే సూర్యుఁడని భావింపుఁడు; చేత (H) నొకకడ్డను నిలువుగాఁ బట్టుకొని దానికొన నొక నారింజపండు (E) గ్రుచ్చి దీపమున కెదురుగాఁ బెట్టి యది భూమియనుకొనుఁడు; నారింజపండులోనుండి యడ్డముగా మఱియొకకడ్డను గ్రుచ్చి దానికొన నొక నిమ్మకాయ (M) గ్రుచ్చి యది చంద్రుఁడని యెంచుకొనుఁడు.

380 (సశేషము) కం. వీరేశలింగము.

ఆధునికకవులు. (౩౧౮-పుట శేషము.)

అహల్యాసంక్రందనములోని రెండుపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. బంటుతనంబులాడుకొని పాఱకు రావణుచేతిపెట్టునన్
గంటికినీరుగ్రమ్మఁ గలఁకింబడి పాఱెను నీదుతండ్రి నీ
యుంటనులేదు పౌరుషమొకింతయు బీరములేల చేతివా
లంటకు కోడెకాఁడ చెయికంటఁగ వెంటనె చెంపఁగొట్టెదన్.— ఆ. ౧.

ఉ. ఆతఱినాలతాంగిని మహాగ్రహదృష్టినిజూచి యోసి నీ
చేతిజలంబులంటనిఁకఁ జెల్లునె యెంతటి జంతవే ఖలా
రాతినిగూడితీవిపుడు రాతిరిజాముసఁ గావునన్ బలా
రాతిశరీరమందుమని రాజముఖిన్ సునఖిన్ శపింపఁగన్.— ఆ. ౩.

వెలగపూడి కృష్ణయ్య.

ఈకవి భానుమద్విజయమనెడి యైదాశ్వాసముల ప్రబంధమును రచియించెను. మఱియు నితఁడు మాలతీమాధవీయము, గౌళికాశాస్త్రము, చతుర్విధ కందశతకము, అను పద్యకావ్యములను, వేదాంతసారసంగ్రహమను వచనకావ్యమును, రచించినట్లు భానుమద్విజయములోని యీ క్రిందిపద్యములోఁ గవి చెప్పుకొనియున్నాఁడు—

సీ. మహిలోనమాలతీ మాధవీయమనంగ శృంగారకావ్య మెసంగఁజేసి
గౌళికాశాస్త్రంబు కడులోకహితముగా నెనయ నేకాశ్వాసమునరచించి
పరిఢవిల్లఁగఁ గంద పద్యపుశతకంబు నాల్గుయోగంబుల ననువుపఱిచి
సన్నుతవేదాంత సారసంగ్రహశాస్త్ర మమరంగ వచనకావ్యంబొనర్చి
చాటుకృతులను మఱికొన్ని సంఘటించి। మామకాంకిత మొనరించి మంచిపుణ్య
శాలియనఁగీర్తిఁగైకొన్న సత్కవీంద్ర। మధురవాక్సాంద్రకృష్ణయామాత్యచంద్ర.

పూర్వమీతనివంశపువారు గాంగేయోపాఖ్యానము, సుమంతోదయము, ఆంధ్రకర్ణామృతము, వజ్రభుజోపాఖ్యానము, సేతుమాహాత్మ్యము, దత్తాత్రేయచరిత్రము, మర్యాదరామ సచివచరిత్రము, మొదలగు గ్రంథములను రచియించి యుండినట్టును గవి యీ క్రింది పద్యములలోఁ జెప్పియున్నాఁడు—

క. భూనుత గాంగేయోపా। ఖ్యానసుమంతోదయాంధ్రకర్ణామృతముల్
మానిత వజ్రభుజోపా। ఖ్యానము శుభహేతుసేతు మాహాత్మ్యంబున్.

క. దత్తాత్రేయచరిత్రన్। సత్తగు మర్యాదరామ సచివచరిత్రన్
బిత్తరపుఁ గృతులుచేసిన యుత్తమ కవులెల్లమీకులోద్భవులగుటన్.

ఈ కవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; లోహితసగోత్రుఁడు; వెల్లపూడి నారసింహార్య పౌత్రుఁడు; నరహరి మంత్రిపుత్రుఁడు. ఈ కవి పాండ్యమండలాధీశ్వరుఁడైన విజయరంగ చొక్క భూపాలుని దండనాథుఁడగు సాంబయామాత్యుని పుత్రుఁడగు గోవిందయామాత్యునికి మేనమఱఁదియైన ట్లీ క్రింది పద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

సీ. పాండ్యభూమండ లాఖండలుం డైన విజయరంగచొక్క భూజానిశాస్త్ర
మండనుండగుసాంబ దండనాథాగ్రణి తనయులలోమేటి దండియగుచు
సంగీతసాహిత్య సంస్కృతాంధ్రకవిత్వ సరసజ్ఞుఁడై మేన మఱఁదియగుచుఁ
గొమరొప్పుచుండెడు గోవిందయామాత్యుఁ డనుపమవిద్యాధికార్యసభను
నిండుకొలువుండె నపుడు నేదండఁ జేరి । సారసల్లాపములమీఱి చతురమతిని
దక్షిణామూర్తికృపను బ్రత్యక్షమగుచుఁ । గృతిపతిత్వంబుఁ గోరు సంగతిని దెలుప.

ఇందుఁ జేర్కొనఁబడిన విజయరంగ చొక్కభూపాలుఁడు దక్షిణ మధురాపురము రాజధానిగా పాండ్యమండలమును క్రీస్తుశకము ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకును పాలించినట్లిదివఱకే చెప్పఁబడెనుగదా? అందుచేత నీ కృష్ణకవియు నాకాలపువాఁడేయని వేఱుగఁ జెప్ప నక్కఱలేకయే తెలిసికోవచ్చును. కవి సాంబదండనాథుని వర్ణించుచు

సీ. సరిబేటి యార్కాటి సాదులాఖానుతో ఘటియించె నెవ్వాఁడు ఘనతమీఱఁ
జేర్మిఁ దంజావూరి పేష్వా యానందరావును నెవ్వాఁడు రహినడంచె
మయిసూరినంజరాజయగారి ప్రియవాక్యసంధికి నెవ్వాఁడు శక్తిదాల్చె
* * సదుపకారి శ్రీదళపతి సాంబశౌరి.

అని యతఁ డార్కాటినవాబగు సాదతుల్లాఖాను మొదలగువారి నోర్చినట్లు చెప్పియున్నాఁడు. ఈ సదతుల్లాఖాన్ ౧౭౧౦ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౨ వ సంవత్సరమువఱకును నవాబుగానుండి యార్కాటురాజ్యము చేసెను. కాఁబట్టి కవి ౧౭౨౦ వ సంవత్సర ప్రాంతమునందు మధురాపురములో భానుమద్విజయమును రచియించియుండును. ఈతని కవిత్వము రసవంతమైనది కవితాధోరణి తెలియుటకయి భానుమద్విజయములోని రెండుపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. ఏమియు లేనివారలె యహీనమతిభ్రమలందుచుండఁగా
భూమిపతిత్వ మొందిన ప్రభుల్ వ్యసనంబులఁ గాంచుటబ్రమే!
యేమఱి నన్నమేరుధృతి నేర్పడఁబూని సమస్తకార్యముల్
తాము వహించిచూడమిని ధాత్రియరాజకమౌను భూవరా.— ఆ. ౨.

మ. సిరులం బాఱెడి యేఱులట్లుగ వడిం గిల్కంగఁ గన్నీరు లా
గురువక్షోరుహ తార హారములతోఁ గూడం బ్రకాశింప నా
ధరణీశాంగన దుస్సహాత్మ గతసంతాపంబుచే నేడ్చె భా
స్వరవాఃపంక్తి పికీస్వరా కలిత వాచా మాధురీ వైఖరిన్.— ఆ. ౪.

శేషము- వేంకటపతి.

ఇతఁడు శశాంకవిజయమనెడి యైదాశ్వాసముల శృంగారప్రబంధమును జేసి వంగలసీనయార్యున కంకితము చేసెను. శశాంకవిజయమునకు తారా శశాంకమని నామాంతరముగలదు. ఇందుఁ జంద్రుఁడు బృహస్పతివద్ద విద్యాభ్యాసమునకయి చేరి గురుపత్నియగు తార నింటినుండి లేవఁదీసిన కథ మిక్కిలి పచ్చిగా వర్ణింపఁబడినది. ఈ శేషము వేంకటపతి నియోగిబ్రాహ్మణుఁడని తోఁచుచున్నది. ఇతఁడు కందాళ రామానుజాచార్యుని శిష్యుఁడు; కృష్ణయార్యుని కుమారుఁడు కృతినాయకుఁడు తన్నుఁ బిలిపించి పలికినట్లు చెప్పఁబడిన యీ క్రిందిపద్యములలో కృతిపరంపరలు చేసినట్టు కవి చెప్పుకొనుటయే కాని యొక్క గ్రంథమునైనను పేరొక్కనియుండలేదు.—

క. నను రంగేశ్వరపదయుగ । ఘనతరభజనానిరూఢ కవితాసామ్రా
జ్యుని శేషము కృష్ణసుధీ । తనయునిఁ బిలిపించిపలికె దయనైవారన్.

చ. అసదృశభక్తి సద్గురుకటాక్షముఁ గాంచి సమంచితాత్మతన్
బిసరుహమాకరందరస పేశలకౌశలవన్మృదూక్తులన్
రసికులకింపుగాఁ గృతిపరంపరలన్ రచియించికీర్తిచే
నెసఁగితివయ్య వేంకటపతీ బళిశేషము వంశసత్కృతీ.

ఈకవి పాండ్యమండలాధీశ్వరుఁడైన విజయరంగ చొక్కనాథుని కాలములోనున్న ట్లీదివఱకే సముఖ కృష్ణప్పనాయకునిగూర్చి వ్రాయునప్పుడే చెప్పఁబడెనుగదా! కవియు తారా శశాంక కృతినాయకుఁడైన వంగల సీనాయార్యుని వర్ణించుచు, అఖండమండిత మహీమండల మండనాయమాన పాండ్యమధురాధరాఖండల శ్రీవిజయరంగచొక్కనాథ మహీనాథ కృపాకటాక్ష వీక్షణానుక్షణ వర్ధమాన ... ... నిఖిల సంవత్సరం పరాకంపితనిలింప నాయకుండని యతనికొక విశేషణమును బ్రయోగించియున్నాఁడు. మఱియు ద్వితీయాశ్వాసారంభమున

క. శ్రీవిజయరంగచొక్క । క్ష్మావిజయ గురుప్రసాద సంపన్నిత్యా
శ్రీవరదాచార్యమణీ । శ్రీవరదాస్యైకకృత్య సీనామాత్యా.

అని కృతిపతిని సంబోధించియున్నాఁడు. దీనినిబట్టి కవి విజయరంగ చొక్కనాథుని కాలములో మధురలోనుండుట నిశ్చయమగుటచేతను, ఆరాజు ౧౭౦౪ వ సంవత్సరము మొదలుకొని ౧౭౩౧ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసినవాఁడగుటచేతను, శేషము వేంకటపతి యీ కాలమునందున్నట్టు స్పష్టమగుచున్నది. అక్కడక్కడ క్త్వార్థకసంధి మొదలయిన కొన్ని లక్షణదోషములున్నను, కవిత్వము మొత్తముమీఁద ద్రాక్షాపాకమయి మిగుల రసవంతమయియున్నది. చక్కెరమెత్తిన విషమువలె నీతిమాలిన యీకథ మనోహరములయిన తేటమాటలతో నిండుగా చెప్పఁబడినందున, అనేకులయిన యౌవనపురుషుల నాకర్షించి పాడుచేయుచున్నది. దుర్నీతిని వర్ణించునప్పుడీకవి తన యసమ్మతిని దెలుపు వాక్యములనెక్కడను బ్రయోగింపక, "లోకములోనఁ గొందఱబలల్ .... తాటాకులలోన వ్రాసిరి పరాంగనఁగూడినఁ బాపమంచు," "ఎన్నిపువ్వులఁ దావాలదు తేఁటి యట్లు మగవాఁడను వానికి దోసమున్నదే?" ఇత్యాది వాక్యరత్నములచేత వలపుగలచోటఁ గలయుటయే పరమార్థమన్నట్టు తెలిపి పామరుల భ్రమింపఁజేసియున్నాఁడు. అంతను మంచిదని సాధించుటకు సహితము మనవారికి పురాణములనుండి దృష్టాంతములు తండోపతండములుగా దొరకుననుట కీ క్రిందిపద్యమును నిదర్శనముగాఁ జూపవచ్చును—

సీ. కన్నకూఁతురటంచు నెన్నక భారతీ తరుణిఁగూడఁడె నీ పితామహుండు
మేనత్తయనుమేర మీఱి రాధికతోడ నెనయఁడే నిన్నునీయనుఁగుబావ
వదినెయంచునుకింత వావిలేకయె జ్యేష్ఠు నెలఁతతోఁ బొందఁడే నీగురుండు
మునిపత్నియనక యహల్యను బట్టఁడే నీదు సహపాఠియగు పాకశాసనుండు
యిట్టి మీవారి నడతలు కట్టిపెట్టి । యమ్మ నే చెల్ల న్యాయంబులాడెదౌర!
కడకునీలంకు నీవెఱుంగనివితాన । దూఱెదవు నన్నుఁ జలపోరిదోసకారి!

"మున్నలదారుకావనస్త్రీలు గిరీశునింగలయరే? వ్రజభామలు శౌరిఁగూడరే? యీలలనాశిరోమణుల కందును నిందును నేమి చెప్పుమా" యఁట! ఆహా! ఏమి యీ దేవత్వలక్షణము! దేవత్వమున కెప్పుడును శుద్ధచరిత్రమే లక్షణముగా నుండవలయునుగదా? నీతిమాలి యన్యకాంతలఁ గలయుటకంటె నాసురకృత్యము మఱియేముండును?

ఉ. ఎంచఁగరాని మోహమున నేనిటుపిన్నటనాఁటనుండియున్
బెంచితిఁ బెద్దఁజేసితిని బేర్మిగఁ బ్రాయమువచ్చినంతనే
యొంచక మాటలాడెదిపుడిన్ని ప్రియోక్తుల కిమ్ముపుట్టెఁగా?
మంచిది నిన్నుఁగూడుటకు మాకు స్వతంత్రత లేకపోయెనే?

గురుపత్ని శిష్యునిఁ బిన్నటనాఁటనుండియుఁ బెంచి పెద్దవానినిజేసెనఁట! అందుచేత

నామె కాతనిఁ గూడుటకు స్వాతంత్ర్యము గలదఁట! ఏమి యీ దుర్నీతి! దుర్నీతి యింత కంటెను దూరము పోవుట సంభవింపనేర్చునా? కృతయుగమునందైనను కలియుగమునందైనను జారత్వమెప్పుడును మొదలంట నశింపదు. కృతయుగపు తారలును చంద్రులును మన యీ కలియుగమునందును గలరు. అయినను మన యీ పాడు కలియుగమునందు మాత్ర మిల్లువిడిచి లేచిపోయినదానిని మగనికిప్పించుటకయి పెద్దమనుష్యులుపోయి జారుని బతిమాలుటయు, మగనికిప్పించిన యా ఆంకుటాలికి సంతానము కలిగినప్పుడు జారపురుషుఁడువచ్చి పుట్టినబిడ్డకయి యింటిమగనితో తగవులాడుటయు లేవు. ఇవి కృతయుగధర్మములు కాఁబోలును! దూరపుకొండలు నునుపయినట్లు వెనుకటివారి యకృత్యములు కంటికి మఱుఁగు కాఁగా మనవారు పూర్వకాలమును పొగడుచుందురు. బ్రహ్మదేవుని యంతటివాఁడువచ్చి భార్యను గోలుపోయి దుఃఖించుచున్న బృహస్పతికి తారను మరలనిమ్మని చంద్రుని బ్రార్థించెనఁట!

చ. అని పరమేష్ఠి పల్కుటయు నట్లన కాకని చంద్రుఁడయ్యెడన్
ఘనతరగర్భభార నఖకాంతి వినిర్జిత తారఁ దారఁ దా
ననునయసూక్తులం దెలిపి యంపినతోడనె దివ్యతూర్య ని
స్వనములు మ్రోసె మింట విరివానలు పర్వెను జంట జంటగన్.

బ్రహ్మదేవుని ప్రార్థన నంగీకరించి చంద్రుఁడు గర్భవతియైయున్న గురుని భార్యను గురుని కియ్యఁగానే, గురునిల్లు కూలఁద్రోచి యింతటి ఘనకార్యమును జేసినందున కాతని మీఁద నిగ్గులేక సురలువిరుల వానగురిసిరఁట!

చ. అమరులతోడ నప్పుడని రబ్జభవుండు భవుండు నగ్గురుం
బ్రమదము మీఱఁగాఁ బిలిచి మా వచనంబునఁ దారఁజెందుమీ
రమణి కశుద్ధిలే దమృతరశ్మిని బొందుటచేత దాననీ
కొమ పరిశుద్ధిఁగాంచెఁ గయికొమ్మనఁ గొమ్మగురుండుచేకొనెన్.

దేవతలును బ్రహ్మరుద్రులును గురునిఁబిలిచి వ్యభిచారదోషము లేకపోవుటయేకాక యమృతరశ్మిని బొందుటచేతఁ దార పరిశుద్ధురాలయ్యెనని చెప్పి యొప్పగించిరఁట!

ఉ. తత్సమయంబునన్ శశిముదంబున నచ్చటికేగుదెంచి పు
త్రోత్సవ మాచరింపవిని యుద్ధతితో గురుఁడందువచ్చి య
న్మత్సుతుఁడీ బుధుండిట నిశాకర రాగతమేమినీకన
న్మత్సరబుద్ధివారికిఁ బునః కలహంబు జనించెనయ్యెడన్.

ఆ పతివ్రతాతిలకమునకు పుత్రుఁడు పుట్టఁగానే వచ్చి చంద్రుఁడు పుత్రోత్సవమాచరించి నప్పుడు గురు శిష్యులకు పునఃకలహము జనించెనఁట!

క. గావిని యుజాం డోహో హో హో । మీ గాపము చాలుఁ గుముద మిత్రుని పుత్రుం
డీవత్సనితనిఁ జంద్రుని । కీవిష్మా వలదు విరస మిఁక నాంగిరసా.

అని బ్రహ్మదేవుఁడంటి మునికిబుద్ధి చెప్పి శిశువును తేరమ్మని కిప్పించి వివాదము తీర్చెనఁట!

ఈవిషయమునే చెప్పుచుఁ గాశీఖండములో

గీ. చదివె గురునొద్ద ధర్మశాస్త్రంబుఁ దొలుతఁ । బరమవిశ్వాస తాత్పర్య భక్తిగరిమఁ
జదివెఁ జంద్రుండు కామశాస్త్రంబుపిదపఁ । దలిరుపాన్పున ననురక్తిఁ దారయొద్ద.

సీ. భువనైకధన్విచేఁ బుష్పాయుధుని చేతఁ బ్రసవాస్త్రమున నేటు పడనివాఁడు
నతిగాఢమైన క్రోధాంధకారంబునఁ గన్నులనంధుండు గానివాఁడు
నిర్నిబంధనలోభ నిద్రాభరంబునఁ బారవశ్యంబుచేఁ బడనివాఁడు
లక్ష్మీకటాక్ష విలాసదుర్మదమున మనములోపలనన్ను కొననివాఁడు
లేఁడు భూపతి కలిగెనే న్యాయము నృపుఁడె । విశ్వధాత్రీ జనులపాలి వేల్పు గాక
బాహ్యశత్రులఁ బరిమార్పంగవచ్చు । నంతరరులను వర్జింపనలవి కాదు

ఈవిధముగా శ్రీనాథుఁడు చెప్పినరీతి ప్రాభవవాక్యములు గాని. పూరూరవశ్చరిత్రములో

క. పాపపరాఙ్ముఖతా మతి । దీపాంకురమానెలంత దీక్షశ్వసితా
టోపమరుద్ధతనడఁగినఁ । బ్రాపిత మోహాంధకార బంధురుఁడయ్యెన్.

సీ. లలనానితంబ మండలముపై నుత్పలదళములు రచియింపఁ దలఁచుఁగాని
తరుణికెమ్మోవిమీఁదఁ బ్రవాళ మణిసాంపుగులుకఁగా ఘటియింపఁ దలఁచుఁగాని
జలజాక్షి కుచకుంభములమీఁద శశకప్లుతంబుఁ దానొనరింపఁ దలఁచుఁగాని
మృగరాజ మధ్యనెమ్మేను లతావేష్టితంబునఁ బెనఁగొనఁ దలఁచుఁగాని
తలఁపఁడెప్పుడు గురు వనితాసమాగ । మాగతాత్యుష్ణ దురితదవానలంబు
దుస్సహంబని కటకటా తొంగలేఁడు । కలుగదుగదా వివేకంబు కాముకులకు?

సీ. సకియకొనుఁదలంచి సన్మార్గమనుఁగాని యింతి దుర్మార్గత నెంచఁడయ్యెఁ
జెలువ చన్గవఁదలంచి సువృత్తమనుఁగాని తరుణికు వృత్తంబుఁ దలఁచఁడయ్యె
నళిన మోముఁదలంచి యకళంకమనుఁగాని తెలివకళంకంబుఁ దెలియఁడయ్యె
సుదతినవ్వుఁదలంచి శుచియనుఁగానియవ్వెలఁదుకయశుచి భావింపఁడయ్యె
గురునివంటి మహాత్ముఁడిక్కరణిఁదరుణి । చక్కఁదనమే గుణంబుగ సంచరించుఁ
గాని వ్యభిచారదోషంబుఁ గాంచఁడయ్యె । నజ్ఞుఁడనఁ బ్రాజ్ఞుఁడననెవ్వఁడవనిఁ ఇంక?

ఈవిధముగా నబ్బయామాత్యుఁడు చెప్పినరీతి నీతిబోధక వాక్యములు గాని, తారాశశాంక
మున లేవు. కవియొక్క రచనను దెల్పు పద్యములు కొన్ని యుదాహరించుచున్నాను.

చ. హాతబహు కిల్బిషంబగు ప్రయాగము యాగముదాహవంబు సాం
ద్రతముగ నందునిందిరకుఁ బట్టనఁబట్టణమున్ సృజింపుమా
యతులిత శిల్పశక్తిగొని యంచని యంచనిరూఢినెక్క యం
చితగతి ధాతయేగె జపసిద్ధులు సిద్ధులు తన్నుజింప నౌ.— ఆ. ౧.

చ. అలనలినారిపాళ్చి నిజయౌవనవేళ స్వకీయబింబ లీ
లలు తననెమ్మొగంబునఁ గళంకరుచుల్గను మీసకట్టునన్
వలదుదయారుణద్యుతులు వాతెఱ వెన్నెల డాలు లేఁత న
వ్వుల నమృతంబు పల్కులను బూనెను నాఁగ మనోహరాంగుఁడై.— ఆ. ౨.

ఉ. చండరుఁడుం బురందరనిశాత శరాహతిఁ గందినివ్వెఱం
జెందఁగ సంక్రందనుఁడిట్లను శశీవిసురా వినరానిపాతకం
బందినవానికార్తి యరుదాగురుదార కృతాపరాధమే
ధందిగఁ బ్రోచిచేసితి వృథావిబుధావళితో విరోధమున్— ఆ. ౫.

పైఁడిమఱ్ఱి - వేంకటపతి.

ఈకవి చంద్రాంగద చరిత్రమనెడి యాఱాశ్వాసముల ప్రబంధమును రచించి యున్నాఁడు. ఈతనికవిత్వము మిక్కిలి ప్రౌఢమయి రసవంతమయి పూర్వకవుల రచనను బోలి హృదయాహ్లాదకరమయినదిగా నున్నది. ఇతఁడు తన గ్రంథమును శ్రీరామాంకితము చేసియుంటచేఁ గృతిపతినిబట్టి యీతని కాలనిర్ణయము చేయుట కాధారము కనఁబడలేదు. ఉన్న యాధారమంతయు కృతికర్త తన వంశవర్ణనము చేసి కొన్న యీ క్రిందిపద్యమందుయున్నది—

సీ. సకలసత్కవిపూజ్య సుకవిత్వసామ్రాజ్య నిర్వాహకుఁడు పెద్ద పర్వతన్న
వివిధభాషావార్య విరచనాచాతుర్య సర్వంకషుఁడు బోడి పర్వతన్న
వరపద్యదాకార వాచాచమత్కార నిరుపమమతిశాలి తిరుమలన్న
యవధానకృతిగర్భ కవితాచ్ఛసందర్భ కీర్తితప్రజ్ఞుఁడు కేశవన్న
దనకునన్నలుగాఁగను దనరుకృష్ణ । రాయభూషణ కులరామ రాజతనయ
కేశవాత్మజ పర్వతాధీశు వేంక । టాద్రిసిదె కావ్యమేనిత్తు నంకితముగ.

ఇందలి పేరులనుబట్టియు కవికాలమిదియని నిశ్చయించుట కాధారము దొరకలేదు. ఇందు 'కృష్ణరాయభూషణ' యను పదముండుటనుబట్టి కర్నల్ మెకంజీదొరగారు సంపాదించిన లిఖితపుస్తకములపట్టికలో కవి కృష్ణదేవరాయని కాలములోనివాఁడని

చెప్పఁబడియున్నది. ఇటీవల బ్రౌన్ దొరగారు తమ నిఘంటువునందీకవి యాధునికుఁడని వ్రాసియున్నారు. పయిపద్యములోనున్న కృష్ణరాయభూషణ శబ్దమీకవికి కృష్ణదేవరాయని యాస్థానమున కలంకారముగా నుండుటచేతనే వచ్చినను, ఈకవి కృష్ణరాయభూషణుని వంశజుఁడగు రామరాజుకొడుకైన కేశవార్యుని పుత్రుఁడగు వర్పతాఖ్యుని సుతుఁడగు వేంకటపతియగుటచేఁ గృష్ణదేవరాయని యనంతరమునఁ బెక్కుతరములు గడచినతరువాత నున్నవాఁడగుట స్పష్టము. అప్పకవి యీ చంద్రాంగద చరిత్రములోని పద్యముల నుదాహరించియుండకపోవుటచేత నీకవి ౧౬౫౦ వ సంవత్సరమునకుఁ దరువాతివాఁడనియు నూహింపఁదగియున్నాఁడు. అందుచేత కవి ౧౭౦౦ సంవత్సర ప్రాంతములయందున్నవాఁడని తోఁచుచున్నది. చంద్రాంగద చరిత్రము నుండి కొన్నిపద్యముల నిందుదాహరించుచున్నాను—

ఉ. అప్పచులాడుచుఞ్ నగవులాడుచు బారలుసాఁచిసాఁచి మా
యప్పలువచ్చిరంచు సకియల్గను దమ్ములుమోడ్చి పిల్వఁగా
గుప్పునఁ దప్పుతప్పటడుగుల్ నడలంగొమరుండు పైఁబడుం
దప్పక చూచుతల్లికెసి చంద్రికి ముచ్చటలీలునట్లుగఞ్.— ఆ. ౨.

మ. హరిత్రోలంగడుపోటు బంటనయి గర్వాలాపముల్మున్న స
త్వరతంబల్కితిఁ గొన్ని నోరికొలఁదుల్ తథ్యంబునేఁడన్నియుఞ్
బరగంబందకుఁ జెప్ప సాధనగతిఞ్ బాటిల్లె వ్యర్థంబులై
సురలోకంబున కేగుటెట్లు సవయుక్కప్పన్నలన్నన్వఁగఞ్.— ఆ. ౩.

సీ. భుజగలోకాధీశ భోగతల్పశయాన హరిరూపధరమహా పురుషయనుచు
నతులార్థమకుట వర్ణితపాదరాజీవ రామార్చనీయ శ్రీరంగయనుచు
మారీచమదభంగ మహితవాయవ్యాస్త్ర శరదనిద్రితనేత్ర శౌరియనుచు
సముదగ్రవర్షావసరయోగ నిద్రాణకరిరాజ వరదశ్రీకాంతయనుచుఁ
దలఁకనులుకును నలుకుబెగ్గిలుచుఁబలుకు। సఖులనయనస్వరశిరోజ చరణకలన
పవనకందర్పఘనహంసజవనతురగ। ఘటనట్ప్రియసముదాయపటిమదోఁప.ఆ౪.

ఉ. ఓగిమృగాంకనాజడకు నోడినరాహువుకిన్కనంకమఞ్
పేరవిసంబు నీమొడలఁజేరఁగఁ గోఱలకొద్దినెక్కి దు
ర్వారనిజత్వదీయ కరవారవిషంబుల నొంచసాఁగెఁ బె
న్వేరముఁబూని యిప్పుడిది నీదగుచేఁతఁగఁ జూడ కెమ్మెయిఞ్.— ఆ. ౫.

శ్రీ

చింతామణి.

ఇదిమాసమునకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౪.] రాజమహేంద్రవరము. మన్మథసంవత్సర చైత్రమాసము. [సంచిక. ౧౦.

గ్వాలియర్‌సంస్థానము. (Gwaliar.)

మధ్యహిందూస్థానములోనున్న సంస్థానములన్నిటిలోను గ్వాలియరు సంస్థానము ముఖ్యమైనది. ఇది సింధియామహారాజుగారి పరిపాలనములోనున్నది. ఈదేశము యొక్క వైశాల్యము ౨౯౦౦౦ చదరపు మైళ్లు. ౧౮౮౧వ సంవత్సరమునందు చేసిన లెక్కప్రకారముగా ఈసంస్థానములో ౩౦౩౦౮౭౩రు జనులు; ఈదేశము మీఁది యాదాయము ౧౨౫లక్షలరూపాయలు. ఈపటమునఁ జూపఁబడినవారు గతించిన మహారాజుగారు—



సింధియా మహారాజుగారు మహారాష్ట్రవంశమువారు. ఈసంస్థానమును స్థాపించిన రానోజీసింధియాగారు గతశతాబ్దారంభమునందు బాలాజీపీష్వాగారిపాదుకావాహిగానుండిరి. ౧౮౫౭వ సంవత్సరమునందు సిపాయీలింగ్లీషువారిమీఁద తిరుగఁబడినప్పుడిక్కడి సైనికులుకూడ కలహించిరి. వెనుకటి మహారాజుగారప్పుడు చిన్నలయ్యును కలహకారులతోఁ జేరక యింగ్లీషు ప్రభుత్వము వారియెడల రాజభక్తిని గనఁబఱిచిరి. ౧౮౫౮వ సంవత్సరమునందు సేనలు తిరుగఁబడి తమ్మునెదిరింపఁబోఁగా, మహారాజుగారు తనమంత్రితోఁగూడ రాజ్యమును విడిచి యాగ్రానగరమునకు పాఱిపోవలసినవారయిరి. తరువాత వెంటనే యింగ్లీషుసేనలువచ్చి గ్వాలియరుదేశమును మరల నాక్రమించుకొని మహారాజుగారిని మరల సింహాసనముమీఁద నిలిపిరి.

రాజధానియైన గ్వాలియరునగరము ఆగ్రాపురమునకు దక్షిణమున నలువదియైదుమైళ్లదూరములోనున్నది. ౧౮౯౧వసంవత్సరమునందీపట్టణములో ౮౫౦౦౦జనులుండిరి. విక్రమాదిత్యునికి రాజధానిగానుండిన యుజ్జయినీనగర మీరాజ్యములోనే యున్నది. ఈపట్టణమే కొంతకాలమువఱకును సింధియామహారాజులకును రాజధానిగానుండెను గాని ౧౮౧౦వ సంవత్సరమునందు దౌలతరావు సింధియాగారు దానిని గ్వాలియరు నగరమునకు మార్చిరి.

వెనుకటిమహారాజుగారు ౧౮౮౬వ సంవత్సరమునందు మృతినొందినందున, బాలురైనయిప్పటి మహారాజుగారిపక్షమున నొకసభవారుపాలనము చేయుచున్నారు. ఇప్పటిపాలకులు మహారాజామాధవరావుసింధియాగారు. ఈయనపటము మీప్రక్కపుటలోఁ జూపఁబడియున్నది. ఈయన వయస్సిప్పుడు పదొమ్మిది సంవత్సరములు. ఈ సంస్థానముయొక్క చరిత్రమును మిక్కిలి సంగ్రహముగా నిందుఁ జెప్పుచున్నాము.

ఈ రాజ్యసంస్థాపకులయిన రానోజీసింధియాగారు బాజీరావుగారి పాదరక్షలను వహించెడు పనిని ప్రభువునకు తృప్తికరముగాఁ జేయుచువచ్చినందున, అతఁడు మెచ్చి తనయంగరక్షకసేనకు రానోజీగారిని ముఖ్యునిగాఁ జేసెను. అక్కడనుండి క్రమక్రమముగా వృద్ధినొంది రానోజీగారు యుద్ధములలో ధైర్యసాహసములు చూపి మాళవదేశములో కొన్ని భాగములను జయించెను. ఆయనక్రిందనున్న సేనలసంరక్షణము నిమిత్తము పీష్వాకూడ ఆయనకుకొంత జాగీరిచ్చెను. ఈయన ౧౭౫౦వ సంవత్సరమునందు మృతినొందెను. ౧౭౬౧వ సంవత్సరమున పానిపట్టువద్దజరగిన యుద్ధములో నప్పటి పక్షమువయిన జనకాజీ హతుఁడగుటయే కాక సింధియాయొక్క దేశమంతయు పరుల పాలయి పోయినది. తరువాత రనోజీగారియొక్క భోగభార్యాపుత్రుఁడయిన



మాధోజీసింధియాకు, పోఁగాశేషించిన స్వాస్థ్యమంతయు లభించెను. ఈమారావుసింధియాయొక్క తండ్రివలెనే ధైర్యసాహసములు గలవాఁడై యుండెను. సేవలనడిపి ౧౭౬౮వ సంవత్సరమున నర్మదానదికుత్తరమునందున్న దేశమును జయించెను. ౧౭౭౮వ సంవత్సరమువఱకును అతఁడు పీష్వాకులోఁబడి యుండెనుగాని, ఆసంవత్సరమునందు స్వతంత్రుఁడయ్యెను. తరువాత నితఁడు బహుదేశములను జయించి ౧౭౯౪వ సంవత్సరమునందు పరలోకగతుఁడయ్యెను. తరువాత దౌలతరావుసింధియా రాజ్యమునకువచ్చెను. యుద్ధమునందు నేర్పును, సాహసమును, ధైర్యమును, ఈయనయందు విశేషముగానుండినవి. మాధవరావు పీష్వామృతుఁడయినప్పుడు బాజీరావును సింహాసనమెక్కించుటలో దౌలతరావు సింధియాయొక్క కృషి సఫలమయ్యెను. ఇతఁడు జస్వంతరావు హుల్కారుతో యుద్ధముచేసి యాతనిరాజ్యముకొంతయాక్రమించుకొనెను. ఇటువంటి విజయములవలనగర్వించి యితఁడింగ్లీషువారితోడి యుద్ధమునకు సహితము వెనుకదీయకుండెను. అయ్యును ఆలీఘుర్, ఢిల్లీ, ఆగ్రా, లాసవారి, ఆరగాము, అనుస్థలములలో నింగ్లీషుసేనలతో జరగినయుద్ధములలో నెల్ల నోడిపోయి, ఇతఁడు సమాధానమునుగోరి గంగా యమునా నదులకు మధ్యనున్న దేశములను మాత్రమేకాక యితరదేశములను సహిత మింగ్లీషువారికియ్యవలసిన వాఁడయ్యెను. దౌలతరావుసింధియా ౧౮౨౭వ సంవత్సరమున పరలోకగతుఁడయ్యెను. అతనికి సంతానములేనందున, అతనిభార్య పెంచుకొన్నకొడుకు జనకోజీరావుసింధియా యనుపేరుతో కొంతకాలము రాజ్యము చేసి ౧౮౪౩వ సంవత్సరమున సంతానహీనుఁడై మృతుఁడయ్యెను. అతనిభార్య తారాబాయిభాగీరథరావను నతనిని పెంచుకొనఁగా, ఈదత్తపుత్రుఁడు జ్యాజీరావుసింధియాయను పేరుతో రాజ్యమునకువచ్చెను. ఈయనబాల్యదశలో తారాబాయిమూలమున పెక్కుచిక్కులువచ్చెనుగాని యింగ్లీషువారు మహాజనపురములోను పన్యారులోను మహారాష్ట్రసేననోడించి గ్వాలియరురాజ్యమును స్వాధీనము చేసికొని, సేనలజీతములక్రింద ౧౮ లక్షలరూపాయలు వచ్చుదేశమును పుచ్చుకొని జ్యాజీరావుసింధియాను మరలరాజునుగాఁజేసిరి. ౧౮౫౮వ సంవత్సరములో రాజ్యమీయనవశము చేయఁబడినది. సిపాయీల కలహములో నింగ్లీషువారియెడల ప్రభుభక్తిఁజూపిన దీమహారాజుగారే. ఈయనప్రతిరూపమే యిందు మొదట వేయఁబడినది.

౨౦. మదమాతంగము లందలంబులు హరుల్ మాణిక్యముల్ పల్లవుల్
ముదితల్ చిత్రదుకూలముల్ పరిమళంబుల్ మోక్షమీఁ జాలునే
మదిలోఁ గోని నపేక్ష చేసి నృపథామద్వార దేశంబు గా
చి దినంబుల్ గడపుద్రు జ్ఞులకటా శ్రీకాళహా

౨౧. ఏవేదంబు పఠించె లూత? భుజగం బేశాస్త్రముల్ చూచె? దా
నేవిద్యాభ్యసనం బొనర్చెఁ గరి? చెంచే మంత్ర మూహించె? బో
ధావిర్భావనిదానముల్ చదువులయ్యా? కావు నీపాద సం
సేవాసక్తియె కాక జంతువులకున్ శ్రీకాళహా.

౨౨. నీపంచం బడియుండఁగాఁ గలిగినన్ భిక్షాన్నమే చాలు; ని
క్షేపం బబ్బిన రాజకీటముల నే సేవింపఁగా నోప; నా
శాపాశంబులఁ జుట్టి త్రిప్పకుము సంసారార్థమై బంటుగాఁ
జేపట్టన్ దయగల్గెనేని మదిలో శ్రీకాళహా.

౨౩. పవి పుష్పంబగు; నగ్ని మంచగు; నకూపారంబు భూమీస్థలం
బవు; శత్రుం డతిమిత్రుఁడౌ; విషము దివ్యాహారమౌ; నెన్నఁగా
నవనీమండలిలోపలన్ శివశివేత్యాభాషణోల్లాసికిన్
శివ నీనామము సర్వవశ్యకరమౌ శ్రీకాళహా.

౨౪. నిన్నే రూపముగా భజింతు మదిలో? నీరూపు మోకాలో, స్త్రీ
చన్నో, కుంచమొ, మేఁకపెంటికయొ, యీసందేహముల్ మాన్పి నా
కన్నారన్ భవదీయ మూర్తి సగుణాకారంబుగాఁ జూపవే
చిన్నీరేజవిహారమత్తమధుపా శ్రీకాళహా.

౨౫. రాజుల్ మత్తులు; వారిసేవ నరకప్రాయంబు; వారిచ్చు నం
భోగాష్టీచతురంతయాన తురగీభూషాదులాత్మవ్యథా
బీజంబుల్, తదపేక్ష చాలుఁ బరితృప్తిం బొందితిన్ జ్ఞాన ల
క్ష్మీజాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహా.

౨౬. ఇన్నేళ్లుం దినిరేమి గంటి? నిఁక నే నెవ్వారి రక్షించెదన్?
నిన్నే నిచ్చ భజించెదన్ నిరుపమోన్నిద్ర, ప్రమోదంబు నా
కెన్నం డబ్బెడు నెంతకాల మిఁక నేఁ డిట్లున్న నేమయ్యెడిన్
జిన్నం బుచ్చక నన్నుఁ బ్రోవఁగదవే శ్రీకాళహా.

౨౭. రాజర్థాతురుఁడైనచో నెచట ధర్మంబుండు? నేరీతి నా
నాజాతిక్రియ లేర్పడున్? సుఖము మాన్యశ్రేణి కెట్లబ్బు? రూ

పూజీవాళిఁ నేఁదిక్కు ధృతి నీభక్తుల్ భవత్పాద నీ
రేజంబుల్ భజియింతు రేతెఱఁగునన్ శ్రీకాళహా.

౨౮. అలంచున్నైడఁగట్టి దానికిన పత్రశ్రేణిఁ గల్పించి త
ద్బాంధవ్రాతము నిచ్చిపుచ్చుకొనుచున్ బంధంబు గావించి యా
మాలక్ష్యంబున బాంధవంబనెడి ప్రేమన్ గోడ అంద్రిప్పఁగా
నీలన్నీవు యొనర్చి నట్లొనఁగితో శ్రీకాళహా.

౨౯. ఒకపూఁటించుక కూడుతక్కువగు నే నోర్వంగలేఁ డెండకో
పక నీడన్వెదకున్ జలింజడిసి కుంపట్లెత్తుకోఁ జూచు వా
నకు నింటింపఁ జూఱు నీతనువు దీనన్వచ్చుసౌఖ్యంబు రో
సికదా సింపరుగాక మర్త్యులకటా శ్రీకాళహా.

3౦. జ్ఞాతుల్ ద్రోహులు వాండ్రు సేయు కపటేర్ష్యాది క్రియాదోషముల్
మాతండ్రాన సహింపరాదు ప్రతికారంబించుకేఁ జేయఁగాఁ
బోతే దోసము; గాక మానయతినై పోఁగోరినన్ సర్వదా
చేతఃక్రోధము మానదెట్లు నడతున్ శ్రీకాళహా.

3౧. ఒకనిం జంపి పదస్థుఁడై బ్రతుకఁగా నూహించునాకొక్కఁ డే
లోకాన తానెన్నఁడుఁ జావఁడో తమకుఁ బోవో సంపదల్; పుత్రమి
త్ర కళత్రాదులతోడ నిత్యసుఖమందన్గల్గనో; యున్న వా
రికి లేదో సుఖమెన్నఁడుం గటకటా! శ్రీకాళహా.

3౨. దివిజక్ష్మారుహధేనురత్నఘన భూతిప్రస్ఫురద్రత్నసా
నువు నీవిల్లు నిధీశ్వరుండు సఖుఁ డర్ణోరాశికన్యావిభుం
డు విశేషార్చకుఁ డింక నీకెన ఘనుండుం గల్గునే నీవు చూ
చి విచారింపవు లేమి యెవ్వఁ డుడుపన్ శ్రీకాళహా.

33. రాజై దుష్కృతిఁ గాంచె చందురుఁడు; రారాజై కుబేరుండు దృ
గ్గాజీవంబునఁ గాంచె దుఃఖము; కురుక్ష్మాపాలుఁ డామాట నే
యాజిం గూలె సమస్తబంధువులతో నా రాజశబ్దంబు ఛీ
ఛీ జన్మాంతరమందు నొల్లను సుమీ శ్రీకాళహస్తీశ్వరా.

3౪. ఏలీలన్నుతియింపవచ్చు నుపమోత్ప్రేక్షాధ్వనివ్యంగ్య శ
బ్దాలంకారవిశేష భాషల కవాచ్యంబైన నీరూపమున్
జాలుంజాలుఁ గవిత్వముల్ నిలుచునే సత్యంబు వర్ణించుచో
ఛీ లజ్జింపరు మాదృశుల్ కవులహో శ్రీకాళహా.

౩౪. కొడుకుల్ గల్గరటంచు నేడ్తు రవివేకుల్ జీవనభ్రాంతులై
కొడుకుల్ గల్గరె కౌరవేంద్రున కనేకుల్ వారిచే నేగతుల్
వడసెన్ బుత్రులు లేని యా శుకునకున్ బాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్ష మపుత్రవంతునకు నే శ్రీకాళహ.

౩౫. కాసంతైన సుఖంబు లిచ్చునో మనఃకామంబు లీడేర్చునో
ప్రీసంతైనను వెంటవచ్చునో జగద్విఖ్యాతి వాటించునో
దోసంబుల్ తెగఁబాపునో వలసినం దోడ్తో మిమున్ జూపునో
ఛీ సంసారదురాశ లేల చెడవో శ్రీకాళహ.

౩౬. నిప్పై పాతకతూలశైలము డఁచున్ నీనామ మేమానవుల్
తప్పన్ దొల్తను విన్న నంతకభుజాదర్పోద్ధతక్లేశముల్
తప్పన్ బారును ముక్తులౌదురని శాస్త్రంబుల్ మహాపండితుల్
చెప్పంగాఁ దమకింక శంక గలదా శ్రీకాళహ.

౩౭. వన్నె యేనుఁగుతోలు దుప్పటము, బువ్వా కాలకూటంబు చే
గిన్నె బ్రహ్మకపాల ముగ్రమగు భోగీకంఠహారంబు నీ
కన్నీలాగున నుండుటల్ దెలిసియున్ నీపాదపద్మంబుఁ జే
ర్చెన్నేఁడీగతి నన్ను మాధవుఁడుదా శ్రీకాళహ.

౩౮. క్షితిలో దొడ్డతురంగసామజము లేచిత్రంబు! లాందోళికా
తతు లేతెక్కు! విలాసినీజనసువస్త్రవ్రాతభూషాకలా
పతనూజాధిక మేమి దుర్లభము నీపాదంబు లర్చించుచోఁ
జితపంకేరుహపాదపద్మయుగళా శ్రీకాళహ.

౩౯. మును నేఁబుట్టినపుట్టు లెన్ని గలవో మోహంబుచే నందుఁ జే
సినకర్మంబుల ప్రోవు లెన్ని గలవో చింతింపనేఁగాన నీ
జననం బేయని యున్నవాఁడ నిదియే చాలింపవే నిన్నుఁ గొ
ల్చినపుణ్యంబునకున్ గృపాళుఁడవై శ్రీకాళహ.

౪౦. పుడమిన్నొక్క బిల్వపత్రమున దగన్ బూజించి పుణ్యంబునన్
బడయన్నేరక బక్కదైవములకుం బప్పుంబ్రసాదంబులున్
గుడుముల్ దోసెలు చారపప్పు నరిసెల్ గుగ్గిళ్లు వుంబెట్టుచున్
జెడి యొందన్ గొఱగాకపోదురు జనుల్ శ్రీకాళహ.

౪౧. రాజశ్రేణికి దాసులై సిరులఁ జాలంగోరఁగా సౌఖ్యమో
యీ జన్మంబు దరింపఁ జేయఁగల మిమ్మే ప్రొద్దు సేవించు ని

ర్వ్యాజాచారము సౌఖ్యమో తెలియలే రామానవుల్ పాప రా
జీజాతాతి మదాంధబుద్ధులగుచున్ శ్రీకాళహ.

౮౨. చనువారింగని యేడ్చువారు జముఁడా సత్యంబుగా వత్తుమే
మనుమానంబిఁక నేల పొమ్మనుచుఁదారా వేళ నారేవుఁన్
మునుఁగంబోవుచు బాసఁజేయుట గదా ముమ్మాటికిన్ జూడఁగాఁ
జెనఁటుల్ గానరు దీనిభావమిదియో శ్రీకాళహ.

౮౩. వీడెంబిచ్చినయప్పుడున్ తనసుతుల్ విన్నప్పుడున్ పొట్టలోఁ
గూడున్నప్పుడు స్త్రీవిలాసములు పైకొన్నప్పుడన్ గాయకుల్
పాడంగావినునప్పుడున్ జెలఁగుడంభప్రాయ విశ్రాణన
క్రీడాసక్తుల నేమిచెప్పవలెనో శ్రీకాళహ.

౮౪. స్తోత్రంబన్యులఁజేయ నొల్లనివ్రతస్థుల్ వోలె వేషంబుతోఁ
బుత్రీమిత్రకళత్రరక్షణ కళాబుద్ధిన్ నృపాలాధమం
బాత్రుండంచు భజింపఁబోదురు కృపాపారీణయవ్వారి చా
రిత్రంబెన్నఁడు మెచ్చవచ్చు మదిలో శ్రీకాళహ.

౮౫ సలిలంబున్ జులుకప్రమాణ మొకపుష్పంబున్ భవన్మౌళి ని
శ్చలభక్తిప్రతిపత్తిచే నరుఁడుపూజల్ సేయఁగా ధన్యుఁడౌ
నలగంగానదిఁ జంద్రఖండమును దాఁదాల్చం దుదిం గాంచు నీ
చెలువంబెంతయు నీమహత్వమిదిగో శ్రీకాళహ.

౮౬. మొదటన్ భక్తులకిచ్చినాఁడవుగదా మోక్షంబు నేఁడేమయా
ముదియంగాముదియంగఁబుట్టి ఘనమౌ మోహంబులోభంబు న
న్నదిసత్యంబు కృపన్దలఁప వొకపుణ్యాత్ముండునిన్నాత్మఁగొ
ల్చిదినంబున్ మొఱపెట్టఁగాఁగటకటా శ్రీకాళహ.

౮౭. జాతుల్ సెప్పుట సేవఁజేయుట మృషల్ సంధించు టన్యాయవి
ఖ్యాతిన్ బొందుట కొండెగాఁడవుట హింసారంభకుండౌటమి
థ్యాతాత్పర్యములాడు టన్నియుఁబరద్రవ్యానికాసించియే
చీతానెన్నియుగంబులుండఁగలఁడో శ్రీకాళహ.

౮౮. గ్రహదోషంబులు దుర్నిమిత్తములు నీకళ్యాణనామంబు ప్ర
త్యహముం బేర్కొనుచున్న మర్త్యులకుబాధన్ బెట్టఁగానోపునే
దహనుంగప్పఁగఁ జాలునే శలభసంతానంబునీ సేవఁజే
సిహతక్లేశులు గారుగాక మనుజుల్ శ్రీకాళహ.

508 (సశేషము)

గామాభ్యుదయము. (౪౬౦-పుట శేషము)

షష్ఠమాశ్వాసము.

క. శ్రీ భారతీధరాజ్ఞా । క్షోభనసిక్కృత కటాక్షజిహ్వాంచల జా
హ్నోభాగ దయాంభోరుహ । సంభా గోబ్బూరివరస నరనాథమణీ.

వ. అవధరింపుము తదనంతరకథావిధానం బెట్టిదనిన.

క. ధరణీతనయాన్వేషణ । కరణోద్యోగానురోధకంబై యంతన్
దొరువరుల కాలిసంకెల । యనుదెంచెన్ వానకాలమాభీలంబై.

గీ. ద్రిష్టాతసచేయు లోక ప్రపంచమునకుఁ । దారతమ్యంబుఁ దెలుపఁగఁ దలఁచియొక్కొ
నూటిమింటికి నేలకు సూత్రపట్టి । పేఁకనీరంధ్ర ధారాళవృష్టి గురిసె.

మ. రటదంభోధర మాలికల్ మలసె ఘర్మద్రుద్విషేంద్రంబులై
పటుదంభోళి కృశాను ధూమతతులై ప్రావృట్పరివ్రాడ్జటా
చ్ఛటలో నామెఱసెన్ మెఱుఁగులుదివిన్ సంవర్తవేళామహా
నటచూడాహిఫణా సహస్రమణి సందర్భ ప్రభాచాతురిన్.

గీ. మెఱుఁగుతటిత్రాడు పెనఁకువ మించుమొగులు । చాలుకవ్వపు మలమరుచ్ఛయము చేత
భ్రమణమొందించి నూత్నసతానమృతసార । వినుకడలిఁ గల్గఁజేసెఁ బ్రావృణ్మురారి.

గీ. క్రొమ్మెఱుఁగుఁదీఁగె తళుకుల కమ్మపసిఁడి । కొండుపుతాఁకుల ఘూర్ణిల్లి ఘోరభంగి
దర్పకోద్దండ దండయాత్రకునుబోలె । భూరితర మేఘమాలిక భేరిభేరి.

గీ. సాగరవిష బుగ్రోలి ధూర్జటియుఁబోలె । నాత్రివిక్రమగతి దివినాక్రమించి
విధియుబలెనావిస్పృష్టి కావించి కాఱు । మొగులు దలఁపించెనపుడు త్రిమూర్తిమహిమ.

మ. స్థిరమైత్రిం దనవారిలోఁ గలయికన్ క్షీరంబునుండం బర
స్వరభేదంబొనరించునఁచుఁ గలహంసశ్రేణులం జండభీ
కర ఘోషంబున ధిక్కరించి కడుఁగిన్కన్ బోలె వర్షోపలో
త్కరపాతంబున బిట్టుపాఱనడఁచున్ గాలాభ్రసందర్భముల్.

గీ. మేఘరాజులు సరసతమీఱఁదమ్ముఁ । దరళవిద్యుల్లతా దీర్ఘతరకటాక్ష
వీక్షణకలాపముల గారవింపనలరి । నెమ్మినర్తించుఁ బురివిచ్చి నెమ్మిగములు.

క. కాలరసవాదిమొగులం । గాలాకృతిఁ బొడలుచదలు గనిఁబవిశిఖివా
తూలధమనీముఖంబునఁ । గ్రాలించి మెఱుంగుఁబసిఁడిఁ గనెరససిద్ధిన్.

చ. సమయకులాలుఁడగ్గగన చక్రతలంబున నంబురాశి పం
కము గా... మఘవాయుధ దండమంది యం

దముగ నవాభ్రకుంభము లానర్త రసజ్ఞుఁడు గాఁడె వాఁడు లో
కము లెఱుఁగం బయోధరతఁ గాంచుటయుం గలిగించె వానికిన్.

శా. ధారాశుద్ధిఁ బ్రసిద్ధిఁ గాంచి ఘనశబ్దస్ఫూర్తి వర్తిల్లఁగాఁ
దోరంబైన రసస్థితిన్ దరళవిద్యుత్సాలికాలక్షణో
దారంబై కవిసేవ్యమై పనఁ బయోదారూఢిఁ బ్రాపించి వ
ర్షారంభంబు ప్రబంధమట్లఖిల పద్యాక్రాంత మయ్యెం దగన్.

గీ. పడిన వడగండ్లు నింద్రగోపములుఁ గూర్చి
ఘనవిభుఁడు క్రొమ్మెఱుంగు జవ్వనిఁ బెండ్లియాఁగ
బన్ని సరమున సడలిపై పైఁ దొరఁగు
విమలముక్తాఫలాబ్జ రాగములనంగ.

చ. చెలువునఁ గాఁకఁ బైకొను శుచిప్రియయుం జాయుటఁ జేసి వేదనం
బలె మలినాంబరాంతలును బంధువర్షమిషాశ్రుధారలా
కుల నిబిడోజ్ఞిత శ్వసనగుంభనలున్ బరిలీనతారకా
వళులునునై జడప్రకృతి వర్తిలనుండిరి దిగ్వధూమణుల్.

ఉ. సారపు సోగ క్రొమ్మెఱుఁగు సంపఁగి పువ్వులదండ పిండుచే
కూరినతోరపుం జిగిమొగుల్ దురుమం బసనొల్లసిల్లు ది
గ్నారుల తారహారములుగాఁ దలఁపించె నిరంతరాంబుమ
ద్ధార లసద్గళాగణిసదా సకలాశయముల్ దలిర్పఁగన్.

క. గగనాంగనమణిదీపిక । లగుచు దిశాసతుల కింపులగు సంపఁగి క్రొ
మ్మొగడసరులగుచుఁ దగుఁ బలు । వగ మెఱుఁగులు కాలభైరవ జటాచ్ఛటలై.

సీ. హరిహయాయుధరేఖ లనుగడల్ వేయించి యలముధారా రజ్జువులబిగించి
జలదంబులనునీలి వలలెల్లెడలనిల్పి వివిధగర్జావాద్య రవముగొల్పి
తేవమీఱఁ దటిన్నటీపంక్తిఁ బ్రేరించి కోపుగా మెఱుములు గొనఁగఁ జేసి
సరసులకొక సొంపు సంధిల్లఁ గావించి పెక్కుదిక్కులవారిఁ బెంపుఁ జేసి
యలరెఁ దొలకరి తఱిపేరియాటవాఁడు । మీటువాటిల్ల నలరాచ మెచ్చుపసని
పథికజనమాన ధనము లపహరలీలఁ । గొల్లలాడెను భువనంబు లుల్లసిల్ల.

వ. ఇట్టి ఘర్షవర్షాగమసమయంబున జనకతనయావియోగ వేదనాధీన దీనమానసుండై రఘువరుండు సౌమిత్రికిట్లనియె.

క. వానలసీతావిరహద । వానల సంతాప మంతకంతకు నధికం
బైనది శమింపదించుక । యైనఁ దటిద్వహ్ని [illegible] సమా.

గీ. లీలనీప్రావృడాగమవేళయందు । నిండుబాల్లి పండువెన్నెలలుమింటు
నెడనెడం గాయ నదికంటి వేకరంబు । మొగులు వీఁడియెండవ తెఁవాపమునఁ దెరల్చు.

గీ. అకట నాతప్పు డొక్కవర్షాగమంబె । పెక్కువర్షంబులై తోఁచె భీమవోయి
నాఁడు వనయింక సీతావియోగదావ । దహనమేమిటఁ జల్లాఱుఁ దలఁపుమనఘ.

ఉ. ఝుంకరణంబు సల్పు మరుసైన్యము లట్లు కదంబమారుతా
ధ్వాంకరణంబులై యహరహంబును బాంథ మనోభిమాన స
గ్లంకరణంబులై ఘనఘనాఘనముల్ పొగరెక్కె కేవలాం
ధంకరణంబులై బహువిధంబుల మబ్బులు గొల్పెఁ గంటివే.

వ. అని మఱియు వియోగవేదనకుం గాక కద్వద మదద్విరేఫ జాతశీతవాత పోత శుక నికర ముహుర్ముహుశ్చంద్రికా మిషవిషోద్గారకైరవప్రియప్రముఖ ప్రసవవిశిఖాప్త సైన్యంబులఁ గురించి దైన్యంబున నిట్లనియె.

గీ. ఏల ప్రేలెదు కోకిల యింతేటికలుగ । సంశ్రితలసన్నగాలి యోసన్నగాలి
చెల్లునే రోషగసమింత చిలుకఁ జిలుక । సారెఁ గుందింపఁ జందమా చందమామ.

క. పవనా పరిచితనవనీ । పవనా నాకీవు ప్రాణపదమౌట దలం
పవనారతము నుతింపం । పవనారూఢంబు తాప మణఁగింపవనా.

క. అనిలుండవయ్యు నయ్యో । చను నేయిల మెలఁగ నంబుజముఖి యుతులౌ
జనులకడ నుడియవేలా । నను నేచెద రిత చలము నంబవమూనా.

గీ. జగతిఁ బొడమించ నంబుజాసనుఁడవైతి । సకలభూచక్రకీర్తిస్ఫూర్తి సమయఁ జేయ
నైతి సోముఁడ వైననేమాయెఁ జంద్ర । విధుఁడవైతివి పోషించు విధము లేక.

వ. అని వేఁడి వేఁడి వెన్నెలకాకకు సైఁపరాక రాకామృగాంకునిం దేఱికనుంగొనం గనుంగొని యనుజునకు వ్యోమమణికులమణి యిట్లనియె.

గీ. గరముతోఁ బుట్టువగుటనో కలువవింటి । కంటు దనయందుఁ దాల్చె లక్ష్మణకుమార
యదికళంకంబుగాదయా యనఘచరిత । యతనితో నుండు నాకు లేదన విధుండు.

గీ. సీత నలయింపవచ్చి నాచేతఁ బొలియు । మాయలేడి నిశాకరు మఱుఁగుఁ జొచ్చి
యిపుడు పగఁదీర్చుకొనవచ్చెనేమొ కాక । యేమి చేసితి లాఁతినే సోమునకును.

వ. అని యుల్లంబున నాయల్లకన్యవస్థంబు కరంబు బొక్కి యకోమల శ్యామల ఘనఘనాఘనమండగు నకాకుత్స్థాన్వయ ఘనుం డత్తఱిం గుఱియు నిఖిల నీరంధ్ర ధారాళ వర్షంబునకు లోఁగుచు నమ్మహామహీధరగుహా గృహాంగణంబుల వసియించియు విరహవేదనావిషాద జనిత నిజబాష్పధారా వర్షంబునఁ దోఁగుచుఁ

బుడమి మొద్దగాలిచూలిం దలంచుకొని కృశించుచున్న సమయంబున శారదాగమం బేగుదెంచె నిత్తెఱంగున.

గీ. చెదరి దశకంధరోద్దీర్ణ జీవనంబు । పొలియు నీచందమున ననుచుఁ గెలు ప్రకరణి
జీవనములఁ గాసి వెలవెల్లనై నసించె । బంధురంబులైన మేచక కంధరములు.

గీ. అలశరత్కాంత దిగ్వయస్యలు మదాను । విన్నకోలఁకులఁ గ్రీడించి వెడలి కడలఁ
గన్నెనొ డుఁ దలఁయూచ్చగట్టు క్రొత్త । మడుఁగులనఁ బొం నెశుభ్రాభ్రమండలములు.

క. దిక్కులతికోమలాతప । భాక్కులుగాఁ దెలిమొగుల్ నభశ్రీకి నవ
స్రక్కులుగాఁ జేయుచుఁ దన । దృక్కులకింపై ఘనాంత దీధితి దోఁచెన్.

క. శరకాండ జడిమదక్కం । శరకాండమఖండకాంతి సంపదనెక్కన్
శరదాగమంబువోవం । శరదాగమ మిప్పుడుమించె జనరంజనమై.

క. కనుపట్టె శారదాగతి । వనరుహజాతప్రసాద వర్ధనమై నో
హనరాజహంస విహరణ । మొనరన్ సరసులకు జడిమ యుడిపోవంగన్.

వ. ఇట్లు శారదాగమం బేగుదెంచుట గాంచి యపుడు హృదయాపద్మాధిష్ఠిత శ్రీమంతుం డగు హనుమంతుండు భానుసూనుపాలికిం జని యతని కిట్లనియె.

క. సుగ్రీవ సమయమయ్యె ద । శగ్రీవు జయింపఁ దడయఁ జను నే తారా
సుగ్రీవాసుఖసక్తి గ । దగ్రీవనిభుండుసుమ్ము రఘుపతికినుకన్.

ఉ. రాముఁడు సత్యసంధుఁడు దురంతపరాక్రమశాలి యాగుణో
ద్దాముదయాన్వయుఁ గొల్వకకృతఘ్నత కీడ్కొనఁ జన్నె యా రఘు
గ్రామణి నీకుఁ గూర్చిన యకారణబంధుఁడు గాఁడె లోకర
క్షామణి గాఁడె సీత వెతకం గపివీరుల నంపఁ జెల్లదే.

చ. అనవుడు వాయుసూతి పరమాప్తవచోనయరీతిఁ బ్రీతినా
నినమతి నాలకించి యట నీలుని నీతివివేకకార్య శీ
లునిఁ గని జానకిన్ జగములో వెదకంగఁ బ్లవంగవీరులన్
బనుపుమటంచు సారి నిజభామిని చెంతకు నేగె నంతటన్.

వ. రామచంద్రుండును దుస్తరంబగు వర్షాగమ దివసంబు లొక్కచందంబునం గడపి యొక్కనాఁ డగ్గిరీంద్ర కందరముందరి శాళిందరమ్యప్రదేశంబున నిల్చి యాకాశావకాశప్రకాశక ప్రభావిశారద నీరదశ్రీనిరీక్షించి భూమితనయలేమికి దుస్సహ విరహవేదనం గుంది లక్ష్మణుం జూచి వత్స కుత్సిత మనస్కుండై భాస్కరకుమారుండు రాక మసలె నారారతాగారతాంతపమానశీలికుచకుచక్రీడాసుఖాయత్తప్రమత్తచిత్తవృత్తిం గృత్యంబెఱుంగక మొఱంగి రాక జూనింగినం బోవిడుతునె కటకటా యప్పడచుకపి

మఱచెనో కొఱఁతనకొఱక వీరికలుగొన సఫలంబుగాఁ జేయుట కానిమ్ము త్తఱిఁ గున
మద్వాక్యంబులుగా నచ్చులుకు మిసుకుత్తే కొడుకుకడకుఁ జని నయభయరసంబు
లొలుకం బలుకు పలికినం గనకవినకరాక యుద్ధారంబు లొడ్డనేని మున్ను తన్ను
మన్ననఁ గొని పడని పాటులం బఱచు సురుచిర ప్రతాపజ్వాలి వాలిం దూలించి యతని
జీవానిలాలిం గ్రోలి తనికసాలకున్న మన్నిశిత విషమాశుగ విషంబు చకునాప్పింతు ననుము
చనుమన మహాప్రసాదంబని లక్ష్మణుండా క్షణంబ యక్షీణ బాణబాణాసన తూణీర
ధారియై ప్రళయవేళా ఫణిశైత్రేయ జాగ్రదుగ్రాగ్రహంబునం జనిచని కిష్కింధాపుర
ద్వారంబు సర్ణిరోధుండై దఱియం జనిజదురాలోక భీకర మహామహా విభవంబునకు
వెఱచిపఱచి వరణరక్షక ప్రముఖాఖిల బలీముఖులు విముఖులై గురుతరగ్రావ
భీషణ పాషాణపాణులై కలగుంపుపడ నార్చి రోషావేశంబునం జేచ్చి చొచ్చి ప్లవగ
రాజునగరి మొగసాల ప్రోలఁ నిలువనలయల బలంబు విని యంగదుండు వెడలి
వచ్చి కాంచి యంతఃపురంబునకుం జని పతంగసూనికిం బ్రళయకాలాంతకుండునుం
బోలె మున్ గిట రఘువర ప్రేరితుండై తదనుజుండు వచ్చి నిలిచియున్నవాఁడిక్కపి
కులంబు నేఁటితో నిశ్శేషంబు గాకుండ నప్రమత్తవై యెదుర్కొను మనవుడుఁ దలంకి
తత్క్షణాంతరంబున నేతెంచి నిత్యసన్నిహిత హితామాత్య భృత్యవర్గంబుతోడ
నాలోచనంబు చేసి రఘుపతికృతోపకారంబు దలంచుకొని యవ్వసుమతీశ్వరవరుని
పాలికి వాలినందనుం బంచి ప్రార్థితుంగాఁ గాంచి రావించి తారారుమా సమన్వితం
బుగా నతుండై కనుంగొని యర్ఘ్యపాద్యాద్యుపచారంబు లాచరించినం గినుక సతండు
నైకొనక రామచురవస్థాస్థితికఁ బ్లవంగనాయక సుఖవసతికిం దలంపున గృశించుచుఁ
గనలు సౌమిత్రికి మైత్రి కలుగొనం దారాపురంధ్రి యిట్లనియె.

క. నాపట్టి నన్ను రాజ్యముఁ । జూపట్టఁగ నిల్పినాఁడు సుగ్రీవుఁ డయో
మీపెట్టు చెట్టు గాఁడా । చేపట్టిన వెనుకఁ గినుక సేయందగునే.

మ. అని తారాసతి వేఁడినన్ విని ప్రసన్నాస్యంబునం బొల్చు ధ
న్యుని సౌమిత్రిని జూచి పల్కె రవిసూనుండల్క కర్హుండనే
మనుజాధీశ్వర రాజ్యవైభవ మదోన్మత్తుండనై యున్న వాఁ
డనె మున్గల్గఁ బ్లవంగపుంగవులఁ జూడం బంపనే జానకిన్.

ఉ. వాలివధించి రాజ్యవిభవంబున కర్హునిఁ గానొనర్చి యు
ద్వేలపరాక్రముండు రఘువీరుఁడు నీవుఁ బ్రతిష్ఠఁ గల్గ న
న్నేలితి రిట్టిమేలెఱిఁగి యీ ఋణమెన్నఁడు దీర్చుకోఁగలం
గాలము గాచి దాశరథిఁ గన్గొనరాకిట నిల్వనోర్తునే.

ఉ. ప్రేమ నవీర్వ రాముఁ గనిపించుము తోడ్కొనిపోయి వేళనో
నేమిటి కేఁగుదెంచెనని యించుక నాపయి నగ్గెనేని నా
స్వామికి నీవె తెల్పఁగలవాఁడవు సన్ము సూర్యసూత లీ
లాముఘనోక్తి వైఖరుల లక్ష్మణు రంజిలఁ బల్కె నత్తఱిన్.

ఉ. కెలనన్ మారుతిఁ గాంచి రమ్యఘు కిష్కింధాప్రదేశం, బ్లునా
రల సద్దిక్కులవారలన్ బ్లనగులన్ రావించుమా యెల్లిపో
వలెఁ బౌలస్త్యవధార్థమై రఘుకులస్వామిం గనన్నప్పుడున్
జెలఁగన్నింగియు నేలయూనుగతిఁగూర్చెన్ వానరవ్రాతమున్.

వ. ఇట్లు మఱునాఁడు యుగపదాసన్న సన్నద్ధ సముద్ధతానాజ్ఞానసగోచర వనేచర కోటులం గూడుకొని యంగదాంజనేయ నీలగవయ గవాక్ష జాంబవన్ముఖ ప్రసిద్ధులు గొల్వ సూర్యపుత్రుండు సుమిత్రాపుత్రునింజిరత్నరత్న శిబికారూఢునిం జేసి తానును నుచితవాహనరూఢుండై చనిచని మాల్యవన్మహీధర పరోపకంఠరంబున డిగ్గి తమ రాకకు నలరి యెదురుచూచుచున్న రామచంద్రు ననతిదూరంబునం గని డగ్గఱి యవ్విభు పదారవిందంబులకుం బువఁదేఁటి యుంబోలె వ్రాలిన దయాళుఁడు గావున నప్పతంగ తనయుం గౌఁగిలించుకొని యతనిం బ్రణయగర్భితరోషంబున నారఘూద్వహుం డిట్లనియె.

చ. సమయము పల్కి రాక వెడజాగులఁ బెట్టితి కీడుకొంటివే
మమత భవద్విరోధి నసమాన భుజాబలశాలి వాలి దు
ర్దముని వధించి నీకొసఁగు తత్తరుణీ సుఖరాజ్యభోగముల్
మనుము మఱపించె నేయటుకు లక్ష్మణుఁ డుగ్రత వచ్చునంతకున్.

క. అనవిని మజ్జనకుండవు। నను నేలిన వంశపతివి నా దైవమవున్
విను నీను మేలు మఱవన్। గొనకొని కపిసేనఁ గూర్చుకొనఁ దడవయ్యెన్.

వ. అని విన్నవించి యుభయపార్శ్వంబులన్ బలంబులం గూర్చి వేర్వేరం బ్రసిద్ధులం జేసుగ్రీవుఁ డిట్లనియె.

చ. విశదచరిత్ర కన్గొనుము వీరసమానబలుల్ సమిన్నిరం
కుశులు దశాస్యునెత్తి పిడుగుల్ దనుజాటవికాదవానలుల్
కుశలులటంచు భూగగనగోళము నిండఁగఁ జేర్చువైరిక
ర్కశుల నపారవీర కపిరాజులఁ బేరులఁ దీర్చి చూపినన్.

క. కని సంతసిల్లి రాముఁడు। జనకజ నెదకంగఁ దగిన చతురుల నీఁకనై
నను బనుపరాదె రవిసుత। యనన తఁడు మహాప్రసాదమని యుత్సుకుఁడై.

వ. అప్పుడప్పతంగసూనుండు రఘువరాగ్రభాగంబున నిలిచి గజ గవయ గవాక్ష గంధమాదన సుషేణ పనస కుముద నీల జాంబవత్ప్రధాన యూథపుంగవులం బిలిచి యుచిత భాషణ సంభావనోపచారంబుల గారవించి ప్రాక్పశ్చిమోదక్ప్రదేశంబుల నానాటు నెచటం దరణికిరణప్రవేశంబునకు నవకాశంబు గలుగు నచటనచట నయాదేశంబులం గొలంకుల కెలంకుల గిరులదరులం దీవల క్రేవల నదులం బొదలం దక్కుండ నెలవులం గలయ వెదకి రఘువరవరారోహం గనుంగొని సరగున నరుగుదేరవలయునని యసంఖ్యాకజేయ వీరవానర వ్రాతంబులం గూర్చి పనిచి మఱియు దక్షిణదిశాప్రదేశంబునకు నతులిత ప్రతాప ప్రతిభా శుభాచారలక్షణ విచక్షణుండగు నాంజనేయుం బ్రత్యేకంబ పంపం దలంపుగలవాఁడై విలోకించి యిట్లనియె.

ఉ. పావని రమ్ము నీ వఖిల పావనమూర్తివి మత్కులంబు నీ
చే వెలయున్ సమర్థుఁడవు సీతఁ గనుంగొని రాన టన్న సు
గ్రీవ బలాళి యెంతపనికిన్ హనుమంతుఁడు దక్షుఁ డంచు ను
ర్వీవరశేఖరుండు రఘువీరుఁడు దగ్గఱఁ బిల్చె మారుతిన్.

క. శ్రీరామచంద్రుఁడో హో | యారాహరువరి నెఱుంగు నంగదముఖ్యుల్
లేరా వారు ప్రసిద్ధులు | గారా హనుమంతుఁ బిల్చెఁ గర్జంబునకున్.

వ. పిలిచి యనురాగంబువొంగ నతని నుపలక్షించి.

శా. రమ్మా పావని భావనిశ్చలుఁడవై రాఁబోవ నీచేతనాఁ
బొమ్మా ప్రాణము వచ్చుఁ జూచుకొనినన్ భూదేవతాపుత్రికిన్
ఇమ్మా యిచ్చెద నానవాలు పనిసేఁ డీడేర్పఁగా మ్రోలఁ జే
రొక్కమ్మా రేపని యుంగరం బొసఁగి కాకుత్స్థుండను న్వాండియున్.

ఉ. పల్లవపాణికిన్నగులు వాయఁగ నాకతఁ జెప్పి నప్పుడా
యల్లకబాధచేతియుడు కాఱిన యూర్పులతోడి నీగురుం
డల్లనఁ దెచ్చుఁగాక మలయానిలుఁ డంతకు నీవు రావయా
చల్లని వార్తఁ గొంచు రభసంబున నోయి సమీరనందనా.

క. అనిపలుక నంగదాదులు | వెనుకొన హనుమంతుఁ డప్పుడు విభుఁ డంపిన య
ప్పనిఁ బూని యడవిదిరుగుడు | మొనగొలువన్ దక్షిణాభిముఖుఁడై చనియెన్.

క. తరుచరవీరుఁడు రఘుశే | ఖరుఁ డిడు రత్నాంగుళీయకముఁ గైకొని స
త్వరుఁడై చనియెన్ లంకా | పురిఁ గాల్పఁగ నిప్పుగొంచుఁ బోయెడుమాడ్కిన్.

వ. అంతనలబలంబులు నెలనెలవులం గ్రందుకొన నంగద హనుమదనుచరులై వనచరులు చనిచని.

మ. వనుచోఁ గొండలఁ గానలన్ వెదకుచుం జాలింపుచున్ వేసర
న్బనిలేదంచుఁ గపుల్ గనుంగొనుచుఁ దప్పంగంటిమే మోకదా
యనుచుం జూచిన చోటె చూచుచుఁ గరం బాలించి యేయల్కడే
న్వినుచుం జేరఁగఁ బోయి వానరవరుల్ వింధ్యాటవీభూములన్.

గీ. ఎక్కి పెక్కుతరుల నొక్కొక్క చిగురాకు । యెత్తి వెదకఁ జొచ్చిరి గురుఁబోఁడి
దంతితప్పిచనిన దొంతికుండలలోనఁ । జేయి పెట్టి వెదకఁ బోయినట్లు.

క. ఇటువలె వెదకియుఁ దమ త్రి । ప్పట గురువిరహితుల మంత్రపఠనం బెటు ల
ట్లటుమటుమైపోఁ జొచ్చినఁ । గటకటపడి యొక్కొకపుడు కపులడియాసన్.

క. తల్లి మనరాముచంద్రుని । యిల్లాలిపుడుండవలదె యూపాదపాంతన్
మల్లీవల్లికకడనని । యెల్లరు నొకచోటనిలుతు రెంచుకొనంగన్.

సీ. ఉట్టిపడ్డట్టు లెంతుండి వచ్చెఁ గడింది విలుదోయితో రాజవీరయుగము
వచ్చెఁ బో మనరాజు వారితోఁ గరువలి విందుసన్నిధి నెంత పొందువచ్చెఁ
బట్టెఁ బో దాయాది పగజగద్దుర్జయుం బొకయేటిలోన నెట్లుడిగిపోయెఁ
బోయెఁ బో పోయిన ప్రోఁబూలిపోఁబడి వెదకి పెట్టుటయేల విహితమయ్యె
నయ్యెఁ బోయంగి దాడుల నంపఁ బట్టి । కొదవపడదయ్యె ననిపించు కొనఁగవలదె
యదన మనచేత సాఫల్యమొదవు నెన్నఁ । డుభయతారకమైన యీ యుచితవిధికి.

వ. అని తలపోయుచు జనకతనయాన్వేషణ పరాయణులై.

మత్తకోకిల. చొత్తుకుంజొరరాని చోటులఁ జొచ్చి పుణ్యవశంబునన్
వత్తురుం దిరుగంగ నీగతి వానరోత్తములెత్తఱిన్
మెత్తఁబాటొకయింత లేక భ్రమింపఁగాఁ దమపాటు పే
ర్చెత్తిపోవక త్రోవకుం ఫలియించు కాలము వచ్చినన్.

తరల. అదరిపాటొకచో జటాయువునన్న యన్నియుఁ జెప్పినన్
బ్రదుకుజీవము కల్గెఁ గాఁ దలపట్టి చూచుకొనంగ మే
లెదురుగాఁ జనుదెంచెఁ బొమ్మని యెంచుకొంచుగ మించిర
య్యుదధియుత్తరతీరభూమికి నొక్కయుమ్మడి మొత్తమై.

స్రగ్ధర. పవిధారాపాతభీతి ప్రశమనకపటప్రాయపర్గాధివాసో
త్సవసంపన్నాట్టహాసోచ్ఛ్రయముఖరవియచ్చంక్రమోద్దండభూభృ
న్నివహభ్రాంతి ప్రదోద్యన్నిదభయదవేణీముఖోత్తుంగభంగా
ర్ణవగర్వాలోకనిర్విణ్ణమగు కపిచమూనాథయూథంబుతోడన్.

రామచంద్రవిజయము. (౪౯-వ పుట శేషము)

అందరును రెండుజాములయినంతన భోజనములకు లేచిరి. వెంకటరత్నము మాయోపాయమునందు తనకుగల ప్రజ్ఞనుచూపించి, యుత్తరవస్త్రమును, గాజురాయి వేసిన యుంగరమును రామచంద్రునిచేత నమ్మించి రామచంద్రు డాదినమున వ్రాసిన యుత్తరమును దాచి తుదకాలాగున చంద్రముఖికతడు వ్రాసినాడని చెప్పి విపత్సముద్రమును దాటి అంతలో కట్టివానిని పడవయిచి కృతకృత్యుడయి, సఫల మనోరథుడయి, సుఖముగా నుండెను. రాజగోపాలము మాత్రము, కంటెను రామచంద్రుడమ్మాట చేతను, చీటిలోనున్న వ్రాత యతనిదే యగుటచేతను, రామచంద్రునిమీద కొంచెమనుమానపడుచు నతడట్టివాడు కాడని ధైర్యపర్చుకొనుచు, తండ్రిగారు తగిన విచారణచేయక తొందరపడినారని నొచ్చుకొనుచు, స్నేహితునికొఱకు విచారించుచున్న తనమీదంగూడ నిందవచ్చినందుకు సిగ్గుపడుచు, తండ్రిగారు భోజనానంతరమున నిద్రించునప్పుడు విశ్వనాథశాస్త్రిలవారి వీధి యరుగుమీదంగూర్చున్న రామచంద్రుని యొద్దకు మెల్ల మెల్లగా బోయి అతనియొద్ద కూరుచుండెను. రామచంద్రుడును సిగ్గుచే వంచినతలను ఎత్తక నేత్రములనుండి బాష్పములురాల గోడకు జేరగిలబడియుండెను. రాజగోపాలముకూడ మిక్కిలి విచారించుచు తుదకు తానే ముందుగా పలుకరించెను.

రా:—రామచంద్రుడా. ఎందుకు విచారించెదవు. కాలవశముగాని నీలోపము లేదు. ఇంటిలో జరిగినసంగతి సవిస్తారముగ నాకు తెలియజెప్పు. స్నేహితుల దగ్గఱ దాచవలసినసంగతు లుండవుగదా.

రామ— ఔను గోపాలము. నీకుగూడ నామీద ననుమాన మున్నదిగదా. ఈవిషయమునందు దోషము నాయందు లేదు. అని రామచంద్రుడు యావత్తు వృత్తాంతమును రాజగోపాలమునకు తెలియజెప్పెను. అదివిని రాజగోపాలమిట్లనియెను.

రాజు— మా బాబయ్య తొందరపడినారు. చక్కగా నాలోచించలేదు.

రామ— నన్ను మీరింటినుండి పొమ్మనుటలో నాకన్నవస్త్రములకు లోపము వచ్చినదని విచారములేదు. లోకములో నామీదవచ్చిన యీనింద యీచంద్రతారార్కమును పోనుగదాయనియు, నన్నందఱు దుర్మార్గుడనుకొందురనియు నాకు విచారముగా నున్నది. దాదాపుగ రెండుసంవత్సరములు మీయింటనున్నను, శరభరాజుగారు నా గుణమంతమాత్రము తెలిసికొనలేకపోయిరి. పైగా నిన్నుకూడ పాడుచేయుచున్నానని యన్నారు. నీవిషయమయి నే నేమియు నెఱుగను. వెంకటరత్నము చేయుచున్న మాయనెఱుగక అందులో పడిపోయినాను. ఏమొగము పెట్టుకొని యీగ్రామమందుందును. నన్నెవ్వరు గుమ్మములోకి రానియ్యరు. నాకర్మగతి యింతవఱకు వచ్చినది. ఈ యవమానమును నే భరించజాలను. ఈగ్రామమునుండి యీవేళనే వెళ్లిపోయె

దను. (అని కన్నీళ్లు తెచ్చుకొని) నాకు తమ్మునివలెనున్న నిన్నువిడిచి యేలాగున పోగలను? నేటికి నేనమలాపురమునకు దొంగనయినాను. నాకు నేటితో ఋణము దీరినది. నేనుచేసిన తప్పులన్నియు క్షమించి నామీఁదఁ గటాక్షముంచుము. •

రాజు—(కన్నీళ్లతో) రామచంద్రుడూ! నీవు నన్నేలాగున వదలజాలకున్నావో నేను నిన్నాలాగే వదలలేకున్నాను. మనల నిద్దరిని దైవమింత క్రూరముగా నెడబాపినందులకు నాదుఃఖమునకు పరిమితిలేదు. నీ సద్గుణములు నీ ప్రవర్తనము, నేను మఱువగలనా. నేను నిన్ను క్షమియించుటకు నీవు నాకెన్నడు నేయపరాధమును జేయలేదు. నిజము నిలకడమీద తెలియును. మా బాబయ్యకు తప్ప నీమీద గ్రామమున నింకెవ్వరికి ననుమానము లేదు. నీవీదినమున విశ్వనాథశాస్త్రులవారియింట భోజనము చెయ్యి. నాతో చెప్పకుండ నీవీగ్రామము వదలబోకు. సాయంకాలము నీకు నేనే సంగతియు వర్తమానము నంపెదను. మా బాబయ్య లేచేవేళ అయినది. నేను వెళ్ళవలెను. (అని వెళ్ళెను.)

రామచంద్రుని సంగతినంతయు విని కొందఱువచ్చి యాతనినిజూచి పరామర్శ జేసిరి. కొందఱతని స్థితికి విచారించిరి. విశ్వనాథశాస్త్రులుగారు రామచంద్రుని కొంచెము బ్రతిమాలి లోపలికిఁ దీసికొనిపోయి యన్నముపెట్టించిరి. శరభరాజుగారి యింట రామచంద్రుఁడున్నప్పుడతనియొద్దకువచ్చి యిచ్చకములాడిన వారందరును, తమకు ప్రాణస్నేహితుఁడనిన వారందరును లేశమును వానికి సహాయము చేయరైరి. రామచంద్రుఁడు సద్గుణుఁడనియు సత్ప్రవర్తనగలవాఁడనియు స్తోత్రముచేసినవారిప్పుడితఁడు మహా దుర్మార్గుఁడని నిందించిరి. అప్పుడు సాయంకాలముకాగా దేవదర్శనము చేసి రామచంద్రుఁడు శాస్త్రులవారి వీధియరుగుమీఁద గూర్చుండగా నతని సహాధ్యాయుఁ డొకడు వచ్చి రామచంద్రునితో నిట్లు మాటాడెను. శోభనాచలము, వెంకటరత్నము, వారిస్నేహితులును రామచంద్రునకు జరిగిన మహావమానమునకు జాలిపడుచుండగా తాము నిర్విచారముగా నుండుటయేకాక తన కతడదివఱకు జేసిన యుపకారములకు వాని నొకమాఱు కొట్టవలెనని నిశ్చయించిరిగాని శరభరాజుగారింట నున్నంతకాలము వారికి వీలయినదికాదు. నేడు రామచంద్రుఁడు శరభరాజుగారి యింటినుండి వెళ్లిపోవుటచేత వారి స్వాధీనమయ్యెను.

సహా— రామచంద్రుడూ! నీకు తటస్థమయిన మహాపదనుగురించి నాకు విచారముగానున్నది. నీవమలాపురములోనే యుందువా? ఎక్కడికయినను పోదలచు కొంటివా?

రామ— నేనీరాత్రి ముక్తేశ్వరము వెళ్ళిపోతాను. యీ అవమానమును నేను భరింపలేను.

సహా— నిజమే. నామాటవిని నాలుగుగడియలరాత్రి అయ్యినతరువాత బయలు దేరి ముక్తేశ్వరము వెళ్లు. ఇఁక నీవీగ్రామమునం దుండఁగూడదు. నీకు నేనొక యుపాయము చెప్ప దలచుకొన్నాను. నీక్షేమముకొరకే. నీయిష్టమయినపక్షమున వినుము.

రామ— అయ్యో! వినకేమి యీసమయమునందు నామేలుగోరువారు రాజగోపాలము నీవుగాక నింకెవరు.

సహా— నాతోఁగూడా రా. అనిచెప్పి యతఁడు రామచంద్రుని చెరువుగట్టునకు తీసికొనిపోయి యొక చెట్టుక్రింద కూర్చుండెను. సందెచీఁకటిగనుక మొకమున మసి బూచుకొని యిద్దరుమనుష్యులు కర్రలు పుచ్చుకొని తప్పత్రాగినకంపే ముందుగా వారి రాకను తెలియజేయవచ్చి చెట్టుక్రిందకూర్చున్న సహాధ్యాయునిపట్టుకొని తమమీఁద దయ దాక్షిణ్యములులేక కొట్టుచుండిరి. అప్పుడు సహాధ్యాయుడు "నేనురో, నేనురో, కొట్టకండిరో" యని కేకలువేయుచున్నను స్మారకము. తెలియమిగనుక వారికామాటలు తెలియక తమపని మానరయిరి. అట్లు వారు తమపని కడతేర్చిపోయినవెనుక రామచంద్రుఁడు తనకు సహాయము చేయవచ్చినవానికింత మహాపద గలిగెనని విచారించుచు అతని తలపగిలి రక్తమువచ్చుచున్నందున దానిమీఁద తడిగుడ్డవేయుటకు గుడ్డతడుపుటకయి చెరువుగట్టునకు వచ్చెను. నీళ్ళలో దిగి గుడ్డతడిపి మరల గట్టెక్కుచుండగా నొక చాకలివాఁడు పరుగెత్తుకొనివచ్చి రామచంద్రునిచూచి యిట్లనియెను.

చాకలి— అయ్యా! రాజగోపాలముగారు తమకీచీటిని, యీమాటను, తమకిమ్మనిచెప్పినారు. (అని రహస్యముగాఁ జెప్పి వెళ్లిపోయెను)

రాజగోపాలమిచ్చిన యుత్తరమును చెరువుగట్టున నెవరో దృష్టిదీయుటకు పెట్టిన యొకమూకుడులోనున్న దీపముముందఱ చదువుకొనుచు బాధపడుచున్న సహాధ్యాయుని మొగముచూడక తిరిగి యక్కడికిరాక వెళ్లిపోయెను.

ఏడవ ప్రకరణము.

శోభనాచలమును, వెంకటరత్నమును వారి మిత్రమండలమును, రామచంద్రుని మీఁద కసిదీరక, యతఁ డారాత్రి ముక్తేశ్వరము వెళ్లుననుకొని, వారుకూడ వెంబడింపఁ వలెనని నిర్ధారణఁజేసిరి. రామచంద్రుఁ డారాత్రి విశ్వనాథశాస్త్రులవారియింటికి భోజనమునకుగాని, పరుండుటకుగాని రాలేదు. శాస్త్రులవారి శిష్యులు గ్రామము

వందంతటను వెదకిరిగాని రామచంద్రుఁడు మాత్రము వారి కగపడలేదు. శాస్త్రులవారు రామచంద్రుఁడు డెంపులలోనే దిగి చచ్చినాఁడని యోచించిరి. రామచంద్రుని పట్టుకొనుటకు, ఇద్దరు మనుష్యులను వెంటబెట్టుకొని శోభనాచలము రాత్రి జామయినతరువాత బయలుదేరెను. ఎంతదూరము వెళ్లినను రామచంద్రుఁడు వారి కగపడలేదుగాని చీఁకటిలో వచ్చుచున్న వారి కొకవిధమైన యాపద తటస్థమైనది. ఒక పుంతమార్గము నుండి కొంతదూరము పోయినతరువాత మార్గమున కిరుప్రక్కలను క్రిక్కిరిసి, యొకదాని యగ్రమునొకటి స్పృశించి పొదరింటివలె నల్లుకొనియున్న దట్టమైన చెట్లక్రింది నుండి వారు నడచుచుండగా దైవవశమున శోభనాచలమునకు పాముగఱచెను. కఱచినతోడనే యతఁడు, తనతోఁగూడ వచ్చుచున్న వారికాసంగతి తెలియఁజెప్పి, యొక యడుగైనను బెట్టఁజాలక, యొక చెట్టుక్రింద పయిమీఁదిబట్టను బఱచుకొని పరుండెను. అక్కడ నౌషధము లేవియు లేవు. అతని చెలికాండ్రిద్దరును శోభనాచలమునకై విచారించుచు మార్గమున నెవ్వరైన వత్తురేమొ వారి సహాయముఁ బుచ్చుకొందమని రెండువైపులఁ జూచుచుండిరి. అప్పు డిరువదిసంవత్సరముల వయస్సుగల యొక వైష్ణవుఁ డామార్గమున బోవుచు, మాటిమాటికి వెనుకకుఁ దిరిగిచూచుచు, చీమచిటుక్కుమన నక్కడ కొంతసేపునిలిచి యాధ్వని కారణము తెలిసికొనుచుఁ ధ్వనియైనపుడెల్ల నులికిపడుచు, సన్ననైన పట్టెనామముల బెట్టుకొని, శరీరమున ద్వాదశోర్ధ్వపుండ్రములు లేకయే, దక్షిణదేశపు పట్టుపంచె నొకటిఁ గట్టుకొని రెండవ పంచెను తలమీఁదకు ముసుకువచ్చునట్లు శరీరమునందుఁ గప్పుకొని యామార్గమునఁ బోవుచుండెను. అతనిఁ జూడఁగనే శోభనాచలముయొక్క స్నేహితులిద్దఱును, సంతోషించి యతనిసమీపమునకుఁ బోగా, వైష్ణవుఁడు భయముతో వడవడ వణకనారంభించెను. అంతట వారలిట్లు మాటలాడ నారంభించిరి.

ఒకఁడు— అయ్యా! మేము దొంగలము కాము. తమరు భయపడనక్కఱలేదు. మేము మిక్కిలి యవసరమైన పనిమీఁద, ముక్తేశ్వరమునుండి యమలాపురమునకుఁ బోవుచున్నాము. దైవవశముచేత మా యజమానుని పురుగు ముట్టుకొన్నది. తమ కేమయి మంత్రము వచ్చినపక్షమున నాయనను బ్రతికింప వేడెదము.

వైష్ణ— అయయ్యో! నాకు మంత్రమేదియు రాదు. నాదగ్గఱ మందున్నది. ఆమనుష్యుని నన్ను చూడనివ్వండి. ఆమందునూరిపోస్తాను.

రెండ— తమపేరెవరండీ యయ్యాచార్యులగారు?

వైష్ణ— రామానుజాచార్యులు. నన్ను మీరేమైన నెఱుఁగుదురా?

రెండ — ఎఱుఁగను కాని మొగముచూచినట్లున్నది. అమలాపురమెప్పుడైన వచ్చినారా?

వైష్ణ — అమలాపురములో నన్ను మీరు చూడలేదు. మాది తాటిపాకకాపురము. నీవు నన్నెఱుగవు. మాది యమలాపురము గాదు.

ఒకడు — అయ్యో! ఈ రాగు దయచెయ్యండి. ఇదుగో పాముగఱచిన మనుష్యాడిక్కడ పడున్నాడు. బొటనవ్రేలిమీఁద కఱచినది దేహమంతా చెమటలుపట్టినవి. కాలు వాచినది. నోటనుండి నురగలు గ్రక్కుచున్నాడు.

వైష్ణ — స్మారకము తెలియనట్లున్నది (అని దగ్గఱకుఁబోయి చూచెను.)

సర్పదష్టుఁడైన శోభనాచలమునుఁ జూడగనె వైష్ణవునకు మొగమున వికాసము తప్పిపోయెను. శోభనాచలమునకు స్మారకము తెలియకపోవుట వైష్ణవునకావహించెను. ఆసేవకులిద్దరును శోభనాచలమునకేట్లున్నదనియు, మందువేయుమనియు వారనుచున్న మాట లతనికి వినబడనయ్యెను; కాని కొంతసేపాలోచించి ధైర్యముఁదెచ్చుకొని, మూటనున్నకుప్పె నొకదానిని రాతిమీఁద నరుగఁదీసి మందుపోసి, మొదటి మోతాదు కొంచెము పనిఁజేయువఱకును వైష్ణవుఁడక్కడనుండి, తానతిత్వరితముగా ముక్తేశ్వరము పోవలయునని వారితోఁజెప్పి మఱి రెండు మోతాదుల యౌషధము వారికిచ్చి, రెండుగడియలకొకమారు నందిమ్మని చెప్పి తాను వెళ్ళిపోయెను. అతను పోకముందే శోభనాచలమునకు కొంచెము నెమ్మదిగానుండెను. పొరపాటుచేత నా వైష్ణవుడచట తన తాటియాకుల పుస్తక మొకదానిని వదలిపోయెను. కొంతసేపటికి శోభనాచలమునకు చలివేసినందున, స్నేహితులిద్దఱును తాటియాకులను పోగుచేసి, చలిమంట వేయుచు, దానివెలుతురున ఆపుస్తకమునుఁజూచి యందులో దోపఁబడిన యొక త్రాటియాకుల చీటిఁదీసి యందులో నొకడిట్లు చదువనారంభించెను.

రామచంద్రుఁడు! నీవీరాత్రి యమలాపురమున నున్నపక్షమున బ్రతుకలేవు. నీవొక సహాధ్యాయునితో తిరుగుచున్నావట. వాఁడు నీస్నేహితుఁడు కాఁడు. శోభనాచలము మొదలగువారు నిన్నుఁ గొట్టవలెనని యోచించి నిన్ను చెఱువుగట్టునకు తీసికొనిరమ్మని వానిని పంపినారు. నీవీరాత్రియకాయకేని ముక్తేశ్వరము వెళ్ళవలసినది. నేను పంపిన మూటలో తిరుచూర్ణము, తిరువణి, దక్షిణదేశపుబట్టలు, తేలు పాముల వలని భయము రాకుండ కొన్ని మందులును నున్నవి. వైష్ణవవేషమును వేసుకొన్నపక్షమున వారు నిన్నానవాలుపట్టలేరు. నిన్ను నేను త్వరలోనే చూడగలను.” అని యామనుష్యుడు చదువగానె రెండవవాఁడు, నాలుక కఱచుకొని, చేయిజాడించుకొని విచారసూచకముగా నిట్లు మాట్లాడెను.

రెండ—అయ్యయ్యో! తెలివితక్కువ నిర్భాగ్యులము. ఇప్పుడు మనకు మందిచ్చిన యీ వైష్ణవ కుఱ్ఱవాఁడే రామచంద్రుఁడు. మనమెంత యదృష్టహీనులము? ఆ కుఱ్ఱవాఁడు మంచి యదృష్టవంతుఁడు. వాఁడు చెఱువుగట్టున కూర్చున్నప్పుడు మనము పదిమనుష్యులు త్రాగి రామచంద్రుఁడనుకొని మనమనుష్యునే కొట్టినారు. వాఁడు చెప్పినది నిజమే. వీఁడు ముక్త్యేశ్వరమే వెళ్లుచున్నాఁడు. వీనిని తిరిగి తరుముకొని వెళ్లుదమా?

ఒకఁడు—వద్దు వద్దు. ఈవల శోభనాచలము యొక్క స్థితి బాగుండలేదు. ఆ వైష్ణవుఁడు తప్పకుండా రామచంద్రుఁడే—ఆహాహా! ఎంతమంచివాఁడో చూడు! శోభనాచలమతనికి పరమశత్రువైనను వానికెంత మంచిమందులిచ్చి వాని ప్రాణము నిలిపినాఁడో చూడు. అతఁడూరకున్న పక్షమున శోభనాచలము చచ్చును.

రెండ—వాఁడు వీనికి విరోధి. చావవలెనని మందులిచ్చినాఁడేమో. ఆమందు వేయవద్దు. ఆనక ప్రాణక్షితి రాగలదు వాఁడు దొంగముండాకొడుకు.

ఒకఁడు—రాజగోపాలము కొన్నిమందులు పంపినట్లు తాను జాబులో వ్రాసినాఁడు. అవి మంచిమందులు. అవే రామచంద్రుఁడు మనకిచ్చినాఁడు. అతఁడు మహానుభావుఁడు. అతనికి మనము నమస్కరించవలెను

రెండ—శోభనాచలము! ఇప్పుడేమి చేయుచున్నావు?

శోభ—మా యింటికిఁ దీసికొనిపోయి మాయమ్మనుఁ జూపించండి. నేను బ్రతుకను.

అంతట వారిద్దఱును శోభనాచలము నెట్లయినఁ దీసికొనిపోవలెనని యాలోచించుచుండగా నొకబండి యామార్గమున బోవుచుండెను. ఆబండివాని కర్థరూపాయి నిత్తుమని చెప్పి శోభనాచలమును బండిమీఁద వేసి తీసికొనిపోయిరి.

అట్లు శోభనాచలము మొదలగువారిచేత తెలియఁబడకుండ దాటి రామచంద్రుఁడు ముక్త్యేశ్వరమునకుఁ బోవుచుండెను. ఆదినము కృష్ణపక్ష నవమి గనుక పదునెనిమిది గడియలరాత్రివేళకు, శత్రువులఁ దప్పించుకొనివచ్చినందులకు రామచంద్రున కుదయించిన యల్పసంతోషమువలెనే చంద్రోదయమయ్యెను; కాని రామచంద్రుని ముఖవికాసము వలెనే చంద్రకాంతియు, వికాసహీనముకాఁగా గ్రుడ్డివెన్నెలవచ్చెను. గ్రుడ్డిలో మెల్ల యన్నట్టులా స్వల్పకాంతికే రామచంద్రుఁడు సంతోషించుచుండఁగా నప్పుడుత్తర భాగమందు చేటంత మబ్బుపట్టి, యీ గ్రుడ్డివెన్నెలను దిగమ్రింగుటయేగాక, యామబ్బు వృద్ధియై, మునుపటికంటె పదిరెట్లెక్కువ చీఁకటిని దెచ్చెను. శోభనాచలాదుల యపకీర్తివలెనే యంతకంత కాచీఁకటి యెక్కువకాఁగా, రామచంద్రుఁడు గోదావరియొడ్డు

నకుంబోయి, రేవు పడవ కేమైన పక్షమున దాటి యారాత్రి కోటిపల్లి పోవలెనని యోచనఁ జేయుచు, దారితప్పి రేవుస్థలమునకుఁగాక మఱియొకచోటఁ గూర్చుండెను. ఆకాశమునందలి నక్షత్రగణ మున్నదియు, తమ స్వల్పకాంతులనుఁగూడ నిచ్చుటమాని రామచంద్రుని స్నేహితులవలెనే క్రమక్రమముగా కనఁబడుటమానెను. అంధకార మంతకంతకు మిక్కుటమై, త్రోవనేగాక, యెదుటనున్న వస్తువునుగూడఁ గనఁబడ నిచ్చుటలేదు. నల్లనిమబ్బులును, మబ్బులలోనుండి మధ్యమధ్య గుండెలు ప్రక్కలుచేయునట్లు బయలువెడలుచున్న యుఱుములును, మొగము నెత్తకుండ వీచుచున్న ఝంఝామారుతములును, రామచంద్రుని మనసును కలఁచనారంభించెను. తన్ను గప్పుచున్న యిసుకచేత నది యిసుకతిన్నెయనియు, మహావాయువుచేత కదల్పఁబడుచున్న తరంగముల ధ్వనిచేత తనయెదుటనున్నది గోదావరియనియు, రామచంద్రుఁడు తెలిసికొనెను. అతఁడక్కడ కూర్చుండి కొంచెము కాలుజాపఁగా కాలికి నేదో మెత్తమెత్తగా తగిలెను. అది యేదో పరీక్షించి చూచునప్పటికి, అది శవకాయమయ్యెను. తనముందున్న స్థలమతఁడు బాగుఁ జేసికొనుచుండఁగా చేతికొక చిన్న యెముకముక్క గ్రుచ్చుకొనెను. అంతటితోఁబోక కఱ్ఱతో నతఁడు తడవి యవతలఁగొట్టగా నాదెబ్బ యొక్క కుండమీఁద తగుల నది ఫడేలున పగిలెను. దానితో నతని కాస్థలము స్మశానమై యుండుననని యనుమానముతోచెను. భయపడి పరధ్యాన్నముగా యోచించుచున్న యాబాలుని వెనుక చెవులు గింగురుమన నొకనక్కకూసెను. అది కూయగానే యతని యనుమానము నిజమయ్యెను. అది స్మశానమను నమ్మకము కలిగినతోడనే రామచంద్రునికి ముచ్చెమటలు పోసెను. గుండె ఝల్లుమనెను. ధైర్యము చెదరిపోయెను. లేచి పారిపోవుటకైన కాళ్ళలో సత్తువ లేకయుండెను. చేతులాడవయ్యెను. ఏపనిజేయుటకును తోచదయ్యెను. అతఁడు దీపము లేదని విచారించుచుండెనుగాని, మధ్యమధ్య వచ్చిన మెఱుపులు వానిభయమును తగ్గించి, ధైర్యమును హెచ్చించుటకు మాఱుగా నారుద్రభూములయందున్న సగముసగము కాలిన కొఱవులను, శవములనుఁ గాల్చిన స్థలములను, కట్టెత్రాళ్లను, కపాలములను, రామచంద్రుని కగుపఱచి భయమును వెయ్యిరెట్లు చేసెను. ఆయర్ధరాత్రమునందా భయంకరమైన స్మశానమందు గాఢాంధకారమునం దొంటరిగా గూర్చున్న యాకుమారునకు, భయంకరముగా చచ్చినవారి చరిత్రములును, ముసలమ్మలుచెప్పిన దయ్యములకథలును, అప్పుడప్పుడు తానువిన్న దయ్యముల రూపములును, జ్ఞాపకమువచ్చి, భయోద్రేకముచేత తనకక్కడనే మరణముగల్గునని రామచంద్రుఁడు నిశ్చయించుకొనెను. నడుమ మబ్బులోనుండి మెఱుపులువచ్చి, క్రొత్తవస్తువులను చూపించినట్లే పరవశముఁజెందిన యతని కప్పుడప్పుడు తెలివివచ్చు

క్రొత్తసంగతులు జ్ఞాపకమై భయమధికమగుచుండెను.

ఇంతలో రామచంద్రుని కన్నులనుండివచ్చిన నీళ్ళవలెనే యాకాశమునుండి వర్షబిందువులు పడ నారంభించెను. చినుకు లంతకంత కెక్కువై యాకాశము చిల్లి పడినట్లు కుంభవృష్టిగా నేనుగుతొండము లావుధారలతో వర్షముగురిసెను. ఆ వర్షమున భూమినంతయుఁ దేజోవంతముగాఁ జేసిన యొక మెఱుపువచ్చి, రామచంద్రుని కన్నుల మిరుమిట్లుగొలిపెను. దానితోడనే దిక్కులు ప్రతిధ్వనులుసేయ బ్రహ్మాండము బద్దలగునట్లు పెద్దపిడుగుపడెను. అప్పుడు రామచంద్రుఁడు తెలివిగా నుండుటచేత "అర్జునః ఫల్గునః పార్థః కిరీటి శ్వేతవాహనః" అను శ్లోకమును పఠించి పిడుగు తన మీఁదకు రాకుండఁజేసికొనెనుగాని, యామెఱుపుచేత కన్నులకు చూచునట్టిశక్తియు, చెవులకు వినునట్టిశక్తియుఁ దప్పి, నాల్గునిమిషములవరకునుఁ దిరిగిరాలేదు. కీడులో మేలన్నట్టు ప్రకాశమానమైన యామెఱుపువలన, నాకదిబ్బమీఁద వేయఁబడిన యొక త్రాటియాకుల పాక వానికగుపడగా, వర్షములోఁ గూర్చుండుట కష్టమని, గుడ్డ లన్నియుఁ దడిసినందున గజగజ చలిచేత వణఁకుచు ప్రాణము లన్నిటికంటెను నెక్కువ తీపిగనుక నాబాధ పడఁజాలక, యాపాకయందుఁగున తలదాఁచుకోవలెనని నిశ్చయించి లేచి మెల్లగాఁబోయెను. అక్కడనయినను వానికి మనఃస్థిమితము కలుగనందున పెద్ద బానలవంటి కడుపులును, చిన్ననోళ్లును, వంకరకాళ్లునుగల పిశాచములును, కామినీ లును, బ్రహ్మరాక్షసులును, కన్నులకు గట్టినట్లు నాతనికి మానసవీధిని గనఁబడఁజొచ్చెను.

అప్పుడొక నల్లనిబ్రాహ్మణుఁడంగవస్త్రమును గట్టుకొని యొక యంగవస్త్రమును మీఁదవేసికొని "నారాయణ, నారాయణ" యనుచు పాకవైపునకు వచ్చుచుండెను. వానినిజూచి రామచంద్రుఁడు చేతిలో కొరవిలేనందున కొరవి దయ్యముగాదని నిశ్చయించి, యాబ్రాహ్మణుఁడు తిన్నగా నడచుచున్నను తనభయముచేత నతడు వంకరగా నడచుచున్నట్లు గనఁబడినందున నేదో దయ్యమనుకొని, తరువాత మనుష్యుఁ డని యెఱిఁగి, శోభనాచలమో, వానిమిత్రులో తన్ను చంపుటకు వచ్చుచున్నారని భయపడుచు, నిశ్చేష్టుఁడైయుండెను. ఆ బ్రాహ్మణుఁడు పాకలోనికివచ్చి దుఃఖముతో "ఎంతపని జరిగినది. దైవమా.!" అని విలపించుటచేత తన శత్రుడుగాడని రామ చంద్రుఁడు హీనస్వరముతో నిట్లు పలుకరించెను.

రామ.— అయ్యా! మీరెవరు? బ్రాహ్మణులేనా?

బ్రాహ్మ— బ్రాహ్మణులమే. నీవెవరు? ఇక్కడెందుకున్నావు?

రామ— నే నాత్రేయ సగోత్రుల చిన్నవాఁడను. అమలాపురమునుండి వచ్చు చున్నాను.

ఆధునికకవులు. (౮౬౮-౯ శేషము)

వక౯-లం - వీరభద్రకవి.

ఈ కవి కూచిమంచి తిమ్మకవి జగ్గకవులకాలములోనే పిఠాపురమునందుండి మిక్కిలి ప్రసిద్ధిగన్నవాఁడు. కూచిమంచి తిమ్మకవివలెనే యితఁడును దెందులూరి లింగనారాధ్యుని శిష్యుఁడయి తన వాసవదత్తాపరిణయమునం దాతని నిట్లు స్తుతించి యున్నాఁడు—

సీ. అంభోధిపలయిత కుంభినీజననుత దంభశాంభవకళా జృంభితములు
నందివాహపదార విందవిశ్వాసమరంద సంపాదనేందిందిరములు
స్వేక్షణాదర నరాధ్యక్ష లక్ష్మీప్రదానక్షమ సామ్రాజ్యదక్షిణములు
ఊహాపదాత్మ బోధాహతస్వాంత సందేహలీలాపశ్యతోహరములు
ధరతాగుణమణి హారి దెందులూరి। లింగగురువర సత్కృపాపాంగవీక్ష
ణములు సతతంబు శుభనిదానంబులౌచు। శిష్టజనముల దయను రక్షించుఁగాత!

ఈ కవి గౌరీకాళ్యాణమను నామముతోఁ గాళిదాసకృతమయిన కుమారసంభవమును దెలిఁగించుటయేకాక సుబంధకవి విరచితమయిన వాసవదత్తను వాసవదత్తా పరిణయమను పేరితో నాంధ్రీకరించి దాని పీఠికాపురాధీశ్వరుఁడయిన రావు మాధవరాయనిం గారి కంకితముచేసెను. పద్మనాయకుల సంభవుఁడైన శ్రీ రామచంద్ర మాధవరాయ నృపాలుఁడు తన్నుఁ బిలిపించి వాసవదత్తను దెనిఁగింపనడిగిన కథను కవి వాసవదత్తా పరిణయమునం దిట్లు చెప్పికొనియున్నాఁడు—

శా. శ్రీమచ్చంద్రకళాకిరీట పదరాజీవద్వయీభావనా
సామర్థ్యోదిత వాక్ప్రపంచఘటనాచాతుర్య పద్యోజ్జ్వన
స్తోమానవద శేముషీనిజవిలాసున్వక్కలంకాన్వయుఁ
బ్రేమావ్యాస్పను వీరభద్రుని ననుం బిల్పించి యుప్పొంగుచున్.

క. తాతలతరముననుండియు। నీతని జనకుండుమనకు హితుఁడుకవీంద్రుం
డీతని చేతంగృతి వి। ఖ్యాతిగఁ జైకొంమనుచు హర్షంబొదవన్.

గీ. సవినయంబున సముచితాసనమునందు। నంతికంబునఁ గూర్చుండనాజ్ఞయొసఁగి
మందహాసాంచిత ముఖారవిందుఁడగుచు। నతిదయాస్ఫూర్తి నిట్లని యానతిచ్చె.

క. శ్రీవెలయనుభయభాషల। నీవలెఁ గృతిఁ జేయఁగలరె నేఁటికవీంద్రుల్
భూవిశ్రుతకవితావి। ర్భావయశస్సాంద్ర వీరభద్రకవీంద్రా.

సీ. మీతాతలోకవిఖ్యాత భాషాఖిలశేషాహి యాచంద్రశేఖరుండు
మీతండ్రి చాటువాగాతత చిత్రప్రబంధకల్పనశాలి భాస్కరుండు

మీతల్లితండ్రి పురాతన సత్కవినాథులకెన విశ్వనాథసుకవి
మీమేనమామ సుత్రామవైభవుఁడు సద్యఃకృతిమతి వేంకటాద్రిసుకవి
చదువఁగ దయె శ్రీసతీశప్రసాదగరిమ । బాల్యముననుగుమార సంభవము తెనుఁగు
చేసికవులెంచఁ బ్రఖ్యాతిఁ జెందితీవు । కలరెనీసము లాధునికులుకవీంద్ర.

ఉ. అత్యలఘుక్రియా నిపుణుఁడై ధరణీతలమేలు విక్రమా
దిత్యసభాంతరంబునఁ బ్రతిష్ఠితుఁడై ఘనధీసమగ్రతన్
సత్యవతీ తనూభవునిజాడఁ బ్రసిద్ధికినెక్కి నవ్య సా
హిత్యమునన్ సుబంధుసుకవీంద్రుఁడు ప్రస్తుతిఁగన్నవాఁడిలన్.

గీ. ఘనతరమనీష నమ్మహాకవివరుండు । ప్రతిపదశ్లేష గద్యప్రబంధమత్యు
దారతనుజెప్పె వాసవదత్తయనఁగ । నార్యులాకథ కడుచోద్యమనిరిసభను.

మ. స్తవనీయంబగు తత్కథాక్రమము భామాయోషిదంఘ్రిస్ఫుర
న్నవమంజీరనినాదమేదురనితాంత ప్రౌఢవాగ్గుంభనన్
భవదీయోక్తుల నాంధ్రకావ్యముగ వైదర్భీగతింగూర్చు త
త్కవినవ్యోక్తులు కొన్నినీకవితకుం గైదండ గావింపఁగన్.

క. వరమతి వాసవదత్తా । పరిణయమును జెప్పి యీప్రబంధము విద్వ
త్పరిగణ్యులుగమాకుం । దిరముగ నంకితముచేయు ధీరవిచారా.

భర్తృహరియొక్క సుభాషితరత్నావళిని తెనిఁగించిన యేనుఁగు లక్ష్మణకవి మొదలైన వారీకవితో సమకాలికులు. సమకాలమునందున్న కవులు కూచిమంచి తిమ్మకవిని బాగడక యీతనిని బాగడుటచేఁ దిమ్మకవి కవిత్వమునకంటె నీతనికవిత్వమునం దప్పటివారి కధికాదరమున్నట్టు స్పష్టమగుచున్నది. ఏనుఁగు లక్ష్మణకవి తన రామవిలాసమునందుఁ బూర్వకవులను స్తుతిచేసినపిమ్మట

గీ. దిట్టకవి విశ్వనాథుఁ బ్రార్థించి కొలుతు । నతని నందనుఁడగు వేంకటాద్రికవికి
వాక్యపూజలు గావింతు వక్కలంక । వీరభద్రుని భావింతు గౌరవమున.

అని యీ వీరభద్రకవిని జేర్కొనియున్నాఁడు. ఆకాలమునందుండిన యీదరపల్లి భవాని శంకరకవియుఁ దాను దెనిగించిన ధర్మఖండములో

మ. హరితుల్యుండగు రావుమాధవ నృపాలాగ్రేసరున్ గావ్యచా
తురిమెప్పించి తదీయసత్కృప నిరల్గోరంబుగాఁబొంది బం
ధురతేజుండగు వక్కలంకకులపాథోరాశిరాకాసుధా
కిరణుండైతగు వీరభద్రసుకవిం గీర్తింతు నానెచ్చెలిన్.

అని వీరభద్రకవిని బ్రశంసించియున్నాఁడు. సమానకాలము వారిట్లు మెచ్చుటచేతనే

యీకవి యసమానకవిత్వ ప్రౌఢిమగలవాఁడని తేటపడుచున్నది. ఈ వీరభద్రకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; భారద్వాజగోత్రుఁడు; భాస్కరకవిపుత్రుఁడు; చంద్రశేఖరకవిపౌత్రుఁడు; దిట్టకవి విశ్వనాథకవి దౌహిత్రుఁడు. ఈతనితల్లి జగ్గాంబ; మేనమామ దిట్టకవి వేంకటాద్రికవి. ఈకవి తండ్రితాతలనుండియుఁ బిఠాపుర సంస్థానమునందుండినవాఁడు. తండ్రితరమువారును తల్లితరమువారునుగూడ సత్కవీశ్వరులు. ఈకవి మాతామహుఁడైన విశ్వనాథకవి పెద్దాపురసంస్థానస్థాపకుఁడయిన శ్రీవత్సవాయ ముసలి తిమ్మరాజుగారికిఁ దాను రచించిన శేషధర్మ ప్రబంధము నంకితముచేసెను. శేషధర్మరత్నాకరమను పేరితో నీగ్రంథమునే రాజమహేంద్ర నివాసుఁడగు కొండయ కొమరుఁడగు శ్రీనివాసకవియు రచియించెను. వీరభద్రకవి ౧౭౫౦ వ సంవత్సర ప్రాంతము వఱకును జీవించియుండవచ్చును. ఇతఁడు తన వార్ధకదశలో పిఠాపురమునువిడిచి వృద్ధగౌతమీతీరమునందున్న ముమ్మిడివరము ప్రవేశించి సన్యాసాశ్రమమును స్వీకరించి యక్కడనే సిద్ధిపొందెనఁట. ఈకవి విరచిత గ్రంథములనుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

వాసవదత్తాపరిణయము.

శా. భల్లూకంబులఁజూచి తే తిమిరసంపల్లాలితాంగ ప్రభో
ద్యల్లీలన్ ఘననీలనీల ఘనసఖ్యంబెప్పుడుం జేయఁగా
వల్లీవేల్లితవామలూరువుల క్రేవంగొంటు జంటీఁగలం
దెల్లంగుయ్యిడఁ దేనియల్గ్రొ నెడు భుమీశావిచిత్రంబుగన్.— ఆ. ౨.

శా. ప్రచ్ఛాయస్థల పల్లవాస్తరణ నిద్రాయోగ్యముల్ పాటలీ
గుచ్ఛాకల్పమరున్మనోజ్ఞతరముల్ కూలంకషాభ్యంతర
స్వచ్ఛాంభఃపరిషేవణార్హములు పశ్చాద్భాగ సౌభాగ్యముల్
స్వచ్ఛందస్థితి గ్రీష్మవాసరము లెంచం జాలమించెం ధరన్.— ఆ. ౩.

కుమారసంభవము.

చ. హరుఁడఖిలేశుఁ డవ్వనరుహాక్షితపః ప్రతిఘాతహేతువై
పరగినతత్సపర్యలకు భావమునంగడు మెచ్చియొప్పెఁ దా
నరయ వికారకారణములంటిన నిశ్చలతం దనర్చు నె
వ్వరి హృదయారవిందములు వారలె ధీవరులెంచిచూడఁగన్.— ఆ. ౧.

చ. మలయవసుంధరాధర సమాగత బంధురగంధవాహ రా
జుల నెదిరించుచున్ వివిధసూనగుళుచ్ఛరజః పరంపగల్

కలయఁగఁజూపులడ్డు కొనఁగాఁ గనుగానకదర్పమేర్పడన్
జెలఁగిమృగంబులవ్విపినసీమనటించె మధూదయోన్నతిన్.— ఆ. ౨.
ఉ. అన్నతలంచురూపము హితాళితలంచుఁ గుటుంబు తల్లిదా
నెన్నుసువస్తువుల్ వరులనేర్చుతతిన్ బురవైరినెంచినన్
గన్నులు మూసిపుట్టుటయె కానఁగరాదు దిగంబరుండునుం
జిన్నము సొమ్ము లేదు తెలిసెం దగఁ డాతఁడు నీకుమానినీ.— ఆ. ౩.
ఉ. క్రొత్తలుచేసి గేహములు గోవజవాజిని బచ్చికస్తురిన్
మెత్తిరిగోడలందుపయి నిద్దపుఁ జాయలపొలసున్నముల్
చిత్తరువుల్ లిఖించిరి విచిత్రగతిన్నయనోత్సవంబుగా
సత్తతినుత్తముల్ ప్రతిగృహంబున శోభనశోభ సంధిలన్.— ఆ. ౪.

ఏనుఁగు - లక్ష్మణకవి.

ఈకవి బహుగ్రంథములుచేసి ప్రసిద్ధికెక్కినవాఁడు. ఈతఁడుచేసిన గ్రంథములలో రామవిలాస ప్రబంధము కడపటిదిగాఁ గనఁబడుచున్నది. ఈ ప్రబంధము పెద్దాపుర సంస్థానమందుండిన శ్రీవత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది. ఈ గోపరాజు తన్నుఁగూర్చి పలికినట్లు కవి తన రామవిలాసములో నీపద్యములఁ జెప్పుకొన్నాఁడు—

సీ. సుమచిరాపస్తంబసూత్రు వాధూలసగోత్రు సద్వినయాదిగుణసమేతు
నేనుఁగు లక్ష్మకవీంద్రుని పౌత్రుని శ్రీమాచిరాజు నృసింహమంత్రి
దౌహిత్రు భూవరాస్థానపూజ్యుఁడు తిమ్మమంత్రికిఁ బేరమాంబకు సుపుత్రు
ధన్యుననంతాభిధానానుజుని వీరభద్రునకగ్రజు భాగ్యవంతు
లలితకవితాకళాధుర్యు లక్ష్మణార్యు । నన్నుఁ బిలిపించి యుచితాసనమునునుంచి
చాలఁగరుణించి తనముఖాబ్జమున మంద । హాసమమరంగ నిట్లనియానతిచ్చె.
సీ. సృజియించినాఁడవు సేతురామేశ్వరమహిమంబు పాండిత్య మహిమమెఱయఁ
గల్పించినాఁడవు ఘనుతెన్న జాహ్నవీమాహాత్మ్య కృతిసుధామధురఫణితి
నిర్మించినాఁడవు నిర్జరభాషచే శతకంబు భాస్కర స్వామికెలమి
రచియించినాఁడవు రుచిరంబుగా సుభాషిత రత్నమాలిక శివునిపేర
రమ్యవిశ్వేశ్వరోదాహరణ నృసింహ । దండకాది స్తుతి ప్రబంధములుగూర్చి
సములలోనుత్తమఖ్యాతినమరినావు । లలితగుణధుర్య యేనుఁగు లక్ష్మణార్య.

గీ. వాణిజాసన నారీముఖారవింద । సారసౌరభ ఘన ఘనసారసాంద్ర
వీటికాబంధుర సుగంధ విభవమధుర । లలితవాగ్ధుర్య యేనుఁగు లక్ష్మణార్య.
గీ. ధీరులునుతింప నిప్పుడు మీరుసేయు । భాసురంబగు రామవిలాసకావ్య
మంకితముచేయు మాపేర నచలధీర । ధరణి నాచంద్రతారకస్థిరముగాఁగ.

పైపద్యములవలన నితఁడు రామేశ్వరమాహాత్మ్యము, గంగామాహాత్మ్యము, గీర్వాణ సూర్యశతకము, సుభాషితరత్నావళి, విశ్వేశ్వరోదాహరణ నృసింహదండకాదిస్తుతులు, రామవిలాసము, చేసినట్టు తెలియవచ్చుచున్నది. మఱియు నితఁడు విశ్వామిత్రచరిత్ర మను మఱియొక గ్రంథమునుగూడ రచించినట్లు సుభాషితరత్నావళి యవతారికలోని యీ క్రిందిపద్యమువలనఁ గానవచ్చుచున్నది—

క. రామేశ్వరమహిమము వి । శ్వామిత్రచరిత్ర సూర్యశతకంబును గం
గామాహాత్మ్యము మొదలగు । శ్రీమత్కృతిరత్నములు రచించితిమఱియున్.

ఆఱువేలనియోగియైన యీ కవి యాపస్తంబసూత్రుఁడు; వాధూలసగోత్రుఁడు; తిమ్మకవిపుత్రుఁడు; లక్ష్మణకవిపౌత్రుఁడు; మాదిరాజు నృసింహుని దౌహిత్రుఁడు. ఈతని తల్లిపేరు పేరమాంబ; అన్న యనంతకవి; తమ్ముఁడు వీరభద్రుఁడు. ఈకవి వంశమునకు మూలపురుషుఁడు పైఁడిపాటి సింగన్న. ఈ కవి పూర్వులయింటిపేరు పైడిపాటివారయినను సింగన్నవంశజులలో నొకఁడగు జలపాలామాత్యుఁడు పెద్దాపుర సంస్థానాధీశ్వరుఁడగు గజపతిరాజుచే నేనుఁగును బహుమానమందుటచే నప్పటి నుండియు నేనుఁగువారని మాఱినది. ఈ యంశమే సుభాషితరత్నావళ్యవతారికలో నిట్లు చెప్పఁబడినది—

సీ. పరమేష్ఠితుల్య ప్రభావుండు వాధూలుఁడను ఋషీంద్రుండొప్పు ననఘమూర్తి
యమ్మునినాథువంశమ్మున క్షీరాంబునిధి సుధాకరుఁడు జన్మించినట్లు
ప్రభవించి శ్రీపైఁడిపాటి సింగనమంత్రి వంశాగ్రగణ్యుఁడై వఱలునతని
మహిమసంతానక్రమముననను జలపాలసచివుఁడొప్పె బలారిసచివసముఁడు
గజపతిక్షితి భర్తచే గజముతోడ । నగ్రహారములతఁడు పరిగ్రహించె
నెలమి నేనుఁగువారన్న యింటిపేరు । గలిగెనతనికి గజలాభ గరిమవలన.
గీ. ఈదృగ్గజపతి దత్తసోమేశ్వరాగ్ర । హారశాసనుఁడై మహోదారభాగ్య
మహిమగలిగిన జలపాల మంత్రిమణికి । గరికిరాజు జనించె విఖ్యాతయశుఁడు.

ఈకవియొక్క పూర్వికులు చిరకాలమునుండి పెద్దాపురసంస్థానమున నుద్యోగములలో నుండుచువచ్చిరి. వారిలోఁ గొందఱు కవులు సహితముండిరి. పయిపద్యమునఁ బేర్కొనఁబడిన గరికిరాజునకు మనుమఁడును కవికిఁ బితామహుఁడును పెద్దాప

గ్రామమునకు కరణము నయిన యేనుఁగు లక్ష్మణకవి పెద్దాపుర సంస్థానమునందుండి వత్సవాయ వంశజులయిన యచ్చటిరాజుల కనేకకృతు లంకితముచేసెను. ముందుగాఁ గవి తన తాతనుగూర్చి సుభాషితరత్నావళిలో చెప్పిన పద్యములనుమాత్ర ముదాహరించి యతఁడు రచించిన గ్రంథనామములను కృతిపతుల నామములను రామవిలాస కృతిపతిని గూర్చి చెప్పునప్పుడు ముందు వివరించెదను —

ఉ. సారదయారసద్రుహిణ సారథికిన్ గురురాజమంత్రికిన్
పేరమయందు నందనుఁడు పేర్మి జనించె విలాససంపదన్
మారుఁడు విక్రమంబునఁ గుమారుఁడు లక్ష్మణశౌరి భూరి శో
భారవి సాహితీ విజితభారవి ధీరవిచారవిశ్రుతిన్.

ఉ. దండి మనోజ్ఞ శబ్దకవితాఝురిచే నుపమాసమృద్ధి చే
రెండవ కాళిదాసు రసరీతితరంగితసూక్తిఁ గుండలిం
ద్రుండని ధీరు లెంచఁగఁ గృతుల్ రచియించినధన్యునిన్ మహా
పండితమాన్యు నెన్నఁదగు భాజితసూర్యుని లక్ష్మణార్యునిన్.

గీ. కృతలొసఁగి వత్సవయ తిమ్మనృపతిచేతఁ। దురగమణిభూషణాంబ రాందోళికాది
పూజఁగైకొని పెద్దాపురవరాను। శాసనుండయి లక్ష్మణశౌరితనరె.

కవియొక్క యన్నయైన యనంతార్యుఁడు గౌరీపరిణయకావ్యము రచించినట్లు సుభాషిత రత్నావళిలోనే యీ క్రిందిపద్యమునఁ జెప్పఁబడినది—

క. గౌరీపరిణయకావ్యము। సూరీంద్రులు మెచ్చఁజెప్పి శుంభత్కవితా
పారీణ బిరుదనుందిన। భూరియశో ఘనుఁడనంత బుధవరుఁడలరున్.

లక్ష్మణకవి రచియించిన రామవిలాసమునుబట్టి యితనికాలమును దెలిసికోవచ్చును. ఇతఁడు కూచిమంచి తిమ్మకవికి బంధువయిననుకాకపోయినను, అతనితో సమకాలికుఁ డయినందునకు సందేహము లేదు.

క. హాటకగర్భవధూ లీ। లాటన చలితాంఘ్రినూపురారావశ్రీ
పాటచ్చరములు తేనియ। తేటలు మాకూచిమంచి తిమ్మయమాటల్.

అను కూచిమంచి తిమ్మకవినిగూర్చిన పద్య మీతఁడుచెప్పినదైన నయియుండవచ్చును. రామవిలాసము వత్సవాయ గోపరాజున కంకితము చేయఁబడినది. కవికృతినాయకుని

సీ. తనమహౌదార్యంబు తనమహౌదార్యంబుకరణి జీమూతలాఘువమొనర్పఁ
దనవినిర్మలకీర్తి తనవిక్రమస్ఫూర్తిపగిదిఁ బద్మాహితోపమవహింపఁ
దనసువిద్యాభూతి తనరూపవిఖ్యాతిగతిఁ గమలోద్భవ గరిమమీఱఁ
దనకార్ముకప్రౌఢి తనప్రతాపనిరూఢిభాతి ధనంజయ ప్రథిమఁబూన

ధరణినుతికెక్కె నిజభుజాదండమండ । లాగ్రదర్శనచకితమత్తా నృపుండు
వత్సవాయసింహాద్రి భూవరసుతుండు । ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

సీ. శారదనీరదనారద పారదహారదరస్ఫూర్తి నవహసించి
శరదిందుకరకుంద శరబృందవరచందన హరిచందనకాంతి లహరిమీఱి
హరికాంతహరికుంత హరిదంతకరిదంత విధుకాంత పృథుకాంత విభ హసించి
పురవైరి ధరనీరి గిరిదారి హరిశౌరి చరణనిర్ఝరవారి సురుచిఁ గేరి
పాండురాఖండ నిజకీర్తిమండలంబు । పుండరీకభవాండంబు నిండి మెఱయఁ
బ్రాభవము గాంచె సింహాద్రిరాజసుతుఁడు । ప్రణుతగుణశాలి గోపభూపాలమౌళి.

ఇత్యాదిపద్యములతో నెంతవర్ణించినను, ఈ గోపరాజు పెద్దాపుర సంస్థానాధీశ్వరుఁడు గాక తత్సంస్థానాధిపతియగు తిమ్మజగపతి మహారాజుగారి కాప్తబంధువయి గౌరవము నొందినవాఁడుగా నుండెను. అప్పుడు ప్రభువుగానుండిన జగపతిమహారాజుల పుత్రుఁడగు తిమ్మజగపతి మహారాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౭ వ సంవత్సరమువఱకును రాజ్యపాలనము చేసిరి. ఈయన సింహాసనమునకు వచ్చినది ప్రమాదిసంవత్సర పుష్య శుద్ధ దశమి. గతదినమునం దీయన తండ్రిగారగు రాయ జగపతి రాజుగారు శ్రీపూసపాటి యానందగజపతి రాజుగారితో ఉందూరువద్ద జరిగిన యుద్ధములో హతులైరి. ఆంగీరస సంవత్సర కార్తికశుద్ధ ప్రథమదినమున జననమొందినందున, జనకుని మరణమునాఁటి కీయనకు వయస్సెనిమిదిసంవత్సరములు. ఈయన నలువదియైదుసంవత్సరములు జీవించి పింగళ సంవత్సరాశ్వయుజ బహుళ పంచమినాఁడు పరలోకగతులైనారు. ఈయన కాలమునందుండి యీయనను బహుపద్యములతో స్తుతించినవారగుటచే నేనుఁగు లక్ష్మణకవిగారు ౧౭౮౦-౯౦ సంవత్సరములవఱకును జీవించియున్నట్టు కనఁబడుచున్నది. అందుచేత నీకవి కూచిమంచితిమ్మకవి మరణానంతరమున నిరువదియేండ్లు జీవించియుండవచ్చును. పెద్దాపురపురాజులగు వత్సవాయ వారు తాము మొదటినుండియు విద్వాంసులయి విద్వత్కవుల నాదరించుచుండినట్లు వారి వంశచరిత్రమువలన విస్పష్టమగుచున్నది. ఈవంశపువారి మూలపురుషుఁడు సూర్యవంశ్యుఁడయి కృష్ణామండలములోని గుడిమెట్ట రాజధానిగాఁగల చాగి పోతరాజయినట్టు రామవిలాసములోని యీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది—

గీ. సహ్యజాతీరమునకు భూషణమనంగ । సిరులకిరవగు గుడిమెట్టపురమునకును
రాజధానిగ సత్కళాభోజరాజు । చాగిపోతక్షమాభర్త జగతి నేలె.

ఈ చాగిపోతరాజుయొక్క శాసనములు గుడిమెట్లలోను నవాబుపేటలోను బెజవాడలోను ౧౨౩౦ వ సంవత్సరమువఱకును గానఁబడుచున్నవి. ఈతనియింటిపేరు సాగి

వారేయయినను, ఈతనివంశమువారిలో నొకఁడగు రామనృపాలుఁడు

"తగవత్సవాయాఖ్యనగరంబు నిజనివాసము చేసె నదికారణముగ సాంగి
వంశమునకు వత్సవాయనామములోక । సుప్రసిద్ధమగుచు సొంపు గాంచె"

తన నివాసమును వత్సవాయనగరమునకు మార్చినందున గృహనామము వత్సవాయ వారయినది. వీరివంశజులలో నొకరగు (పేరరాజ సుతులయిన) ముసలితిమ్మరాజు గారు ౧౫౫౫వ సంవత్సరమునకు సరియైన యీ నందనసంవత్సర భాద్రపద బహుళ సప్తమినాఁడు పెద్దాపుర సంస్థానమును సంపాదించి ౧౬౦౭వ సంవత్సరమునకు సరియైన పరాభవ సంవత్సర మార్గశిర బహుళ ద్వితీయవఱకు నేఁబదిరెండు సంవత్సరముల రెండుమాసముల యిరువదియైదుదినములు రాజ్యము చేసి లోకాంతరగతులయిరి. భట్టుకవి విశ్వనాథకవి విరచితమైన శేషధర్మములను గృతినందినదీయనయని రామవిలాసములోని యీ పద్యము తెలుపుచున్నది—

సీ. బిరుదాంకపురిని సుస్థిరము గానిర్మించెఁ బాలముస్నీటినిబోలుచెఱువు
తిరుపతివల్మీకగిరిఁ బూలపల్లెను ఫలవృక్షవనములు నిలిపెఁబాల
నృహరిగేహతటాక నిక్షేపవంతులు కామముగాఁ బెద్దాపురమునను నిచె
విశ్వనాథకవీంద్ర విరచిత శేషధర్మప్రబంధము సాదరముగనందె
విప్రవంశప్రశస్తులు వెలయఁజేసెఁ । బుత్రులనుగాంచె నీతిని బుధనిధులై
వత్సవాయాన్వయమునకు వన్నెఁదెచ్చె । మొప్పె పేరయతిమ్మ ధాత్రీశ్వరుండు.

ఈ తిమ్మరాజుగారు డెబ్బదియాఱు సంవత్సరములు బ్రతికి కాలధర్మము నొందఁగా, శ్రీముఖసంవత్సర కార్తిక శుద్ధ పంచమినాఁడు జననమొందిన యీయనపుత్రుఁడు రాయపరాజుగారు ౧౬౦౭వ సంవత్సరమునందు తండ్రిపోఁగానే రాజ్యపరిపాలన మారంభించి నలువదిరెండు సంవత్సరములు రాజ్యము చేసి ౭౫ ఏండ్లు బతికి ౧౬౪౯వ సంవత్సరమునకు సరియైన సర్వధారి సంవత్సర మాఘ శుద్ధ సప్తమినాఁడు పరమపద ప్రాప్తినొందిరి. ఈయన హరిభక్తిసుధోదయమను గృతినందినట్లీ క్రిందిపద్యము చెప్పుచున్నది—

సీ. శ్రీరామునకుఁ గట్టనూరనుగట్టించె గుళ్లు మంటపములు గోపురములు
గంభీరజలతటాకంబు త్రవ్వించె గృహాస్థపురంబున సుస్థిరముగఁ
బొలుపుగా వాల్మీకి పురికాంద్రకోటను ఫలభూజవాటికల్ పదిలపఱిచెఁ
బ్రశస్తవ్యమగు హరిభక్తిసుధోదయంబను మహాకృతిరత్న మందుకొనియెఁ
బేరుగలుగు మహాత్ముడు పేగునదిమి । మెచ్చఁదగినధర్మములు తెచ్చుకొనియెఁ
బగతురగువారి గుండియల్లదిరుకులుకొనఁగఁ । దిమ్మనృప రాయపక్షమాధీశ్వరుండు.

 (సశేషము) కం. వీరేశలింగము.

భామినీవిలాసమున శృంగారవిలాసము. (౪౬౮-శేషము)

మ. చనె నాభిక్షుకుఁ డెందు నేఁడు? బలియజ్ఞాంగణ మంటెందు నూ
నిని? బృందావనమింతె? నేఁడలఁతఁడన్వా? యామ్యగంబె? చెలుం
గనపండి స్వఃతేనగా, మునలియుక్షు స్వామి? క్రేఁడే యెలుం
గుచు దీఁ న్సభి, యంచుమా, కునుకఁ బల్కుల్లీల, మిమ్మేలెడిన్. ౧౯౪.

తే. గీ. ముకురమునఁ గాంచుచును బరిభోగముద్ర,
వెనుకఁ గూర్చున్న వల్లభు బింబమాత్ర
బింబమునఁ గానిపించిన, బిసరుహాక్షి
సిగ్గుపాటున నేపేవా సేనెఁబనులు. ౧౯౫.

వెలిగెను వేఁడి వేల్పిపుడు వృక్షపు నీడకుఁ జేరుకొందమా
నిలువఁగ లేను లక్ష్మణుఁడ? నేత? నిశా వ్రవిసుద్దియేది? యాఁ
జలివెలుఁగీతఁ డెట్లుపడుచా? యిదికంటివి, లోఁగురంగ మిం
దలయుట నెంచునంటి ప్రియ? హా! విధువక్త్రి? మృగాక్షి? జానకీ. ౧౯౬.

తే. గీ. అగచరులు రామవిరహానలాభితప్త । సహ్యశైలాగ్రముల శీతసమయమందు
సుఖశయానులు పవమానసూను పైని । క్రుద్ధులగు చంద్రు హిఁడతక్రూరుఁడనుచు.

క. మలయాచల సంభూతము । పొలయఁగ మారుతము మందముగఁ దుదిసంజ,
న్లలన యొకర్తుక వానర । బలములఁ గదించె విరహాభారార్దితయై. ౧౯౭.

చ. చలితతటివల్ప, పూర్వదివసమ్ము నభుక్తి, నిశవ్రతమ్ము, పెం
డిలి, పసువమ్ము, న్జలము నిండఁగఁ గట్టు, శరీరపాటవో
జ్జ్వలదశఁ దీర్ఘయాత్ర, నెఱసంపదఁ జాగము, గోరుకొంద్రు సూ
రులఁ దను దప్పివాని నితరుల్ వ్రతుర్త్తిమాలి యద్దిరా. ౧౯౮.

ఆ. గీ. పాలొసంగు ముద్దరాల! మేయును బూరి । లేఁగనీను; నెఱుఁగ లేవు సుమ
కొమ్ము కానిమాయ; నమ్ముకొమ్మొ వరించె । లక్కగే వె నుడులు పెక్కులేల.

తే. గీ. ఇలు తేఁడు శేఁగు నఱుక, । స్నేహ్యాసఁగ న్నేనకునకుఁ, జెవులంబడ నా
పలుకులు లతాంగినూతి స । లిలమునఁ బడవేసె గొడ్డలి వలియదనునన్. ౨౦౧.

ఆ. గీ. తలను మోచి చేర్చి ధాన్యపుగంపను, । జెప్పెభయముతోఁ గృషీవలుండు
వైద్యతోడఁ జందువంక బోలెడు నెఱ్ఱ । వ్యాధి కాంతగుబ్బఁ బ్రబలెననుచు.

ఆ. పెండ్లివేళఁ గొండవిల్లు దాలుపు మేను । భసితసితము పులకభరితమునగు
చెల్లవానిమించు; నెందుఁ గంపఁడు దోఁచు । భూతి శేషుఁడయ్యు మొలచినట్లు.

మ. కలియంగొప్ప గవన్వసించు సురనాగసై)ణము శ్వేల్ప్రమాఁ
కలక్రొంబుఫ్వాలదండలుం జిలువ రాగుంఫమ్ములు న్వార్చకో,

ములికిం గూడినలచ్చి చేతఃలిఁపుంచేసె జాల్మాన్సఁగా
నలికాషిం ద్రిపురారి వింటి మరియత్యా కృష్ణుకేలున్నిముక్. ౨౦౩.

క. మునిజనమానసభవనా, । మనసిజఘనగహనదహన, మార్కండేయా
వన, సవనాశన, పవనా । శనరాజాభరణ, చరణసంశ్రిత భరణా. ౨౦౪.

ద్రుతవిలంబితవృత్తము.

నవనవారిద సంనిభకంధరా, । భువనపావన పూర్ణసుధాంధరా,
నవనవస్ఫురణ శ్రుతిసుందర । స్తవనసంస్థిత సాధుజనాదరా. ౨౦౫.

క. శ్రీకోటిలింగపతి గా । త్రా కాంకరపర్తి రాజరాజనరేంద్రా
ర్త్యా, కేసికకర్తిసనా । మాకుండికుల సదనుగ్రహా, వ్యాసేశా. ౨౦౬.

గద్య. ఇది శ్రీమద్వేంకట దంపతిపుత్ర చిరాయుఃపాత్ర సీతారామా గ్రజాంబా వ్యా
సేశ్వరైశ్వర్యకనామ కన్యామాసావరజావరజ కులదేవా పరనామధేయపు
మపత్యాది శ్రేయస్కామవ్యాసమూర్తి శాస్త్రాంధ్రీకృత భామినీ విలాసమున
శృంగార విలాసము ద్వితీయము ద్వితీయము.

భామినీవిలాసమున కరుణావిలాసము.

క. శ్రీసత్యశ్రీధాన సతీ । భాసురమానస విషాదపదతా పాదో
దాసీనదక్షయజ్ఞ మృ । గా సుహృతివ్యాధరూప, హైమవతీపా.

తే. గీ. విముఖమైయయ్యొయో విధివెలయ, బంధు । రత్నము నిప్పుడు విబుధపురమున కేగ,
మనము? యెవ్వరితోఁ జెప్పుకొనెను నీదు । పెనగొవరు చల్లపలుకుల దేర్తు నిన్ను.

తే. గీ. ఆట్టె మడఁతువమును పటియట్టె నేఁడు । నెదురుకొని కామమంత్రి సద్భుశవికాసి
సరససీతుల మధురవచనరచనల । నించుకేనన్ను సొగియింపవేలబాల! ౨.

తే. గీ. అన్నిసుఖములు విస్మృతి తెన్నపట్టెఁ । విద్యయుమగ్లేశసంచిత విముఖియయ్యెఁ
నాహరిణశాబనయనయే నాహృదిబసఁ । దాపుకొని విడదెప్రుడథ దేవతవలె.

చ. ముదిదయసంతతంబు గలమానిని? నీవపవర్గ మంగళా
స్పదమునసంభ్రమంబునఁ బాదము లానుచుమానిరిద్దియుం
గదఁయటుగానఁ గన్గొనవు గల్యమున దలి నల్లగల్వపూ
ల్మదమునఁ మాలఁబుష్పనయనమ్ముల క్రేవల నన్ను భామిని. ౪.

తే. గీ. పరిణయప్రుఁదతి నిపు మత్కరముఁ బట్టి । సన్నెకలు గ్రొక్కితివి పదస్థలనభీతిఁ
నోవిలాసిని? నేఁ డెటులొంటి దివికి । నెక్కదని నూఱు దామల నెవపయువిమ. ౫

మ. శ్రవణానందవర్ణ రాజి గతదోషస్తోమ సాలంక్రియా
నివహశ్రీరసభావ పూర్ణ గుణమాణిక్యర్ధియా యింతి మ
త్కవితారీతి మనోభిరాము చనదే కాలంబు నన్నా మనో
భవనంబు న్విడనాడితత్ప్రదమదుర్భాగ్యాతిరేకంబునన్. ౬.

మ. సరసీజమ్ముల చింతయాంతయును సంశాంతించెఁ; బింబమ్ము చాం
దిరముం జెందె నతుల్యమాధురము; పిస్తీర్ణత్వముం జెందెడి
న్స్వరప్రష్టాఘుమహోదినాదములు మత్ప్రాణ ప్రియా? నీవు ని
ర్జరలోకమ్మున కుండి చన్నది మొదల్రామామణీ భామినీ. ౭.

తే. గీ. కానికారు మెఱుఁగు కాంతులు వోసమ । హేంద్రసుఖములిచ్చి యున్నె నాళు
రాసిరివలె నుండ్రో రహితు భూపతివిడి । పోయి తీయభాగ్యచేయి వదలి. ౮.

క. ఎదొ నాదుమదిలసితమ్మున । నుదయించిన కినుకకువశ మొందితో? కరభో
రు? దొలఁగినను, సతివయ్యఁగ । నుదవేగిరి ముత్తిసకియలు వడివడిగనే. ౯.

ఆ. గీ. ముద్దుగావ్యరూపముం బరిణతిం జెందె । నమృతసారసరసమైన నీవి
లాసములవిలేమిల నాలలితశీల, । హృద్యకవితమాకు నెట్లు వెలయు. ౧౦.

ఆ. గీ. అందమైన నీదు మందహాసపుఁజిగి । రమ్యసేలసేల రాక రాక
యనిరి సుకవు; లిప్పుడదివో మునిందిరా । విభవమీవు నెంద విలయమబల? ౧౧

తే. గీ. చిఱుఁగవు సుధచే నభిషిక్తుఁ జేసె । నన్నదాఁచితుఁగనుపిరల్ల తొగల
నిత్యకళ్యాణము యి కామని దయదాత్రి । పోవదెదనుండి వాగ్గృహదేవి దయిత.

తే. గీ. రమణ? నాథ? మనోహర? ప్రముఖ శబ్దములనా సంగితి దేవేంద్రభువన సౌఖ్య
మవనిగత, వయ్యోదివికేగి హారిణాబ । నేత్రవిడిచెద నెటు వన్ను నేలభూళి.

తే. గీ. ఉజ్జ్వలంబైన లావణ్య, ముపమలేని । శీల, మతిలోక మడఁకువ, సుగుణములు పొత్తు
నయము, నటువన్ను విడిచి యనాథుల, నెటు । లేగితివి దివిలోకసుందరి? కటకటా.

క. కనకపరకాంతి, పతి శు । ద్ధిని వంసెగ లెప్పుడు నెందుఁదొగడెడు నిన్నే
మనజాక్షి? చిత్తహారన, । నగ్నికఁగలంకునఁ దలంతుఁ గీలిదహించెన్. ౧౫.

శా. దృక్తాపమ్ము హరించెఁ గప్పురపు వత్తిన్నించుచుఁ గ్గంధరా
సక్తంబై యుతసౌఖ్యమిచ్చెను వికాసశ్లాఘ్యపద్మస్రగ
త్యక్తిం; జిత్తచమత్కృతుల్సలిపెఁ గప్యద్రాముద్రావఁ బరి;
స్ఫక్తిన్ట్రీక్ష నరాంగనల్పోవిడెనా వామాక్షిదేవీప్రభన్. ౧౬.

తే. గీ. భామినీ? కనవైతివ పతికిననృ్య । సాభిలాషము గాఁస్వప్నమందునైన
యట్టినీ వెట్టుపురుషునపాస్త గుణునిఁ । బరునిఁ బొందఁగ నరిగితి పలుకుమహహ.

క. తలఁచుచు దయితని గుణముల । దలిమమ్ము నిప్పుడు గన్నతను గాత్రియొ హా
పిలిచిన నీక్షణమూఁతోనఁ । దలఁపము గాయయ్యయో విధాత? ఘనదయా.
తే. గీ. అమృతపుంజల్లుఁ జల్లువ్యాహారరీతి । యాకృతియు నీవికవివతంసాభినంద్య,
హితజగద భద్రకరుణాసుధార్ద్రకృతియు । మెచ్చనెవఁకె మది తేటహృద్యదవని
క. శరణాగతశాస్త్రీయా । చరణప్రవణాంతరంగ సంరక్షణ, దు
శ్చరణపరాయణ హరణా । దరణా, ర్చాకరణశరణతాధృత కరణా. ౨౦.
ఉత్సాహ. రాజరాజమిత్ర, మిత్రరాజవహ్నినేత్ర, గో
రాజదహన ధర్మరాజ రాతుసాంబురాజ వా
రాజవార్ధి మహిత్రృహృదయహరివినుతిపాత్ర వి
భ్రాజిసచ్చరిత్ర గోత్రరాజజార్ధగాత్రకా. ౨౧.
పంచచామరము. సనాతనాఘనాత నార్యసంఘకామితార్థదా
ఘనాఘనాభకంఠకాంతి, కార్తికాబ్దపారదా
వనీధరేంద్ర చంద్రదుగ్ధవారిరాశి నారదా
భ్రనగ్యదారగౌర, పాదభక్తవైరిదర్పదా.
గద్య ఇది శ్రీవ్యాసేశ్వర కరుణాపరాయణ వేంకటాంతర్వాణి పుత్రాకుండి వ్యాస
మూర్తిశాస్త్ర్యాంధ్రీకృత భామినీవిలాసమునఁ గరుణావిలాసము తృతీయము
సంపూర్ణము.

భామినీవిలాసమున శాంతవిలాసము.

క. శ్రీకేవలతాతృప్తిల । తాకందా, సత్యశుభవిధానాస్పందా,
లోకత్రయసంహృతి లీ । లాకలితానంద, చిద్విలాసానందా.
చ. ఘనవిషయాటవీవిటపిఘర్షణ జాతకృశానుచండకీ
లనికరమూర్ఛనాతి వికలంబగు నామది యిద్దియౌఁ జకో
రనిభ మమందమిందిర సరాగము నొందు సమస్తమాధురీ
ఖనికరషండనాభముఖ కైరవబంధు వెల్లకాలమున్. ౧.
చ. జలనిధినందనీనయన సారససంశ్రయ? కల్యవారిజా
వళిగురుసుందరత్వమద భంజనముర్తి త్రిజగత్ప్రకాశన
మ్ములగు విలోచనమ్ముల సముజ్జ్వలదగ్నిజయిస్వకీయ్వరా
విలతరభంగురుష్ణను సవేగము శీతలుగా నొనర్పుమీ. ౨.

భాస్కర-రసోల్లాసము (౪౬౮-పుట శేషము)

మఱునాఁడుజాము ప్రొద్దెక్కినతర్వాత రామయ్యగారి బంట్రౌతువచ్చి లేపు వఱకును నాకుఁదెలివిరాలేదు. అప్పుడు లేచి తొందరతో రామయ్యగారి యొద్దకు వెళ్లఁగా "నిన్నసాయంకాలము మిమ్ము వ్రాయుమన్న జాబితా యెంతవఱకువచ్చినది. ఓక కష్టానగారు దానికోసరము రెండు గడియలనుండి నిరీక్షించియున్నారు." అని యాయన యడిగెను. ఆమాట వినఁగానే నేను నిశ్చేష్టుఁడనయితిని.

నేను—ఆజాబితా—

రామ—ఆజాబితే వేగము తెండి రాత్రిశాస్త్రిగారితో యెక్కడనో సంగీత వినోదము చిత్తగించబోయినారు గాబోలు, జాము ప్రొద్దెక్కినదాకా తెలివిరాలేదు.

నేను—చెట్లసంగీతము విని యింటికిఆలస్యముగా వచ్చాము.

రామయ్యగారు నేను పరిహాసమాడుచుంటినని తలఁచికొంత పరుషముగా "వేళాకోళాలకేమిగాని జాబితా తెండి" అనెను.

నేను— వేళాకోళము కాదు. నిజంగానే జగన్నాథపురంవెళ్లి అక్కడసంగీతపు చెట్లపాట జాము రాత్రిదాకావిని శాస్త్రిగారియింట భోజనముచేసి రెండు జాములకు ఇంటికివచ్చాము. జాబితాయిప్పుడె వ్రాసితెస్తాను.

రామ— ఇదివఱకూ జాబితావ్రాయనేలేదూ! స్వయంగాచేసుకోని పని యెప్పుడు యెవరికివేళకు అయినది? యెవరినోనమ్మని నేను మిమ్మిన్నినమ్మియుంటినందుకు నాకు తగినపనిఅయినది. చెట్లుఆకులు గలగలలాడడంవిన్నట్టూ యింతముఖ్యమయినపని మఱచిపోవడము మాత్రం వింతగావుంది.

అని కష్టానువంకఁదిరిగి, "మీరువెళ్లి మీయోడమీఁది నాసామగ్రిని మరల పడవలమీఁదికి దింపించివేసి మీప్రయాణము సాగించుకొండి. ఈవారము మేము సరకు పంపలేము' అనిచెప్పెను.

నాఁటినుండియు ఆయన నాకు ముఖ్యమయిన పనులేవియు నొప్పగించుట మానెను. ఇంతేకాదు. మొదటనన్ను నేదినములునయిన తరువాత నన్నుఁబిలిచి, "మీరుమరొకపనికోసము ప్రయత్నము చేయండి" అనిమెల్లఁగాఁజెప్పెను. కాని యది నాకప్పుడు మిక్కిలి విచారము కలిగింపలేదు. శాస్త్రిగారితో నాకు మైత్రి దినదినమును హెచ్చుచుండెను. జిల్లాయంతయును ఆయనచేతిలోనుండెను. నాకుఁదగిన యుద్యోగమేదో ఆయన యిప్పింపఁగలఁడన్న నమ్మకము పూర్ణముగానుండెను. రామయ్యగారు ఆప్రకారముగాఁజెప్పి యొకనిమిషమూరకుండి మరల నావంకఁదిరిగి, "మా చెల్లెలివూళ్లోవున్నన్నాళ్లు మిరాయింట్లో నేవుడవచ్చును. అద్దె యియ్యనక్కరలేదు." అని నన్నుఁబంపివేసెను.

నేనింటికివచ్చి యీవృత్తాంతమును నాభార్యతోఁ జెప్పియది యేమో చెప్పఁ బోవుచుండఁగా దిగ్గునలేచి శాస్త్రిగారియింటికిఁ బోయితిని. నాఁటనుండి రాత్రియుఁ బగలును మప్పాతిక శాస్త్రిగారితో నేఁ బ్రొద్దుపుచ్చుచుంటిని. శాస్త్రిగారు కచేరిపని కచేరిలోనే ముగించి తక్కినసమస్తకాలములయందును సాములు, సంగీతము, ఇష్టాలాపములు మొదలగువినోదములతో ప్రొద్దుపుచ్చుచుండిరి. నామాటలయందాయనకు మిక్కిలి యాదరమున్నమాట యిదివఱకే చెప్పియున్నానుగదా? కాకినాడలోనున్నప్పుడు తఱచుగా నన్నాయనభోజనమునకయినను మాయింటికిఁ బోనీయకుండెను సరిగదా, ఆయనయుద్యోగవశమున గ్రామాంతరమునకుఁ బోయినప్పుడును నన్నుఁ దనతోఁ గూడఁ దీసికొనిపోవుచుండెను. ఆయన యే గ్రామమునకుఁ బోయినను అక్కడిసాములును సాంగీతకులును నెవ్వండ్రయిన నున్నారేమోయని నదియేయాయన తెలిసికొనెడి మొదటివిషయమైయుండెను. అక్కడిసాములును సాంగీతకులును ఆయనబసలోఁ గలుపెట్టుకొనియుండవలయును. ఇట్టివినోదములలో మూఁడునాలుగు నెలలగుచుఅ కును నాయవస్థనాకుఁ బూర్ణముగా నెప్పుడును స్మరణకు రాలేదు. తుదకొకనాఁడు ప్రాతఃకాలముననలేచి నేను శాస్త్రిగారియింటికిఁ బోవుచుండఁగా నాభార్యబిడ్డను చంకఁ బెట్టుకొని నాయొద్దకువచ్చి కన్నులనీరు నించుకొని, "ఈపూఁటకు బియ్యము లేవు. ఈ అందె అమ్మిరూపాయలుపుచ్చుకుని రెండురూపాయలబియ్యం తెప్పించండి." అని తన కాలి అందెతీసియిచ్చెను. "శాస్త్రిగారికి నామీఁదబాగా అభిమానము కలిగించి. ఇఁక మనమెన్నాళ్లో శ్రమపడనక్కరలేదు. ఆయన కొద్దిరోజులలోనే నాకెక్కడో మంచిపనిచెప్పిస్తాడు." అని నాభార్యమొగమువంకఁ జూచి యందు సంతోషముగాని నమ్మకమునుగాని సూచించుచిహ్నమేదియుఁ గానక విచారించుచు నాఁడు తప్పక నాస్థితి శాస్త్రిగారితోఁ జెప్పి సహాయమునుగోరనిశ్చయించుకొని అందెను బుచ్చుకొని యంగడికిఁ బోయి బియ్యము తెప్పించి యింటఁ బోయించి వెంటనే శాస్త్రిగారియింటికి వెళ్లితిని. నేను వెళ్లినప్పటికి ఆయన యెవ్వరితోనో కొందఱుగొప్పయుద్యోగులతో మాటలాడుచుండినందున అప్పుడు నాయవస్థనుగూర్చి మాటలాడుటకు వల్లకలుగదయ్యెను. మఱునాఁడు శాస్త్రిగారు ఏలూరినుండివచ్చినసాని చేత నాడించుచుఁ బాడించుచు వినోదించుచుండినందున నాఁడును నేను చెప్పఁదలఁచుకొన్నమాటల కవకాశము చిక్కినది కాదు. ఇట్లు నాఁటికినాలుగు నెలదినములయ్యెను. నాభార్యతన రెండవకాలియందెయిచ్చి మరలసామగ్రి తెప్పించుమని యడిగి, "ఇక్కడ శాస్త్రిగారి దయ మనమీఁద ఎప్పటికివచ్చునో? మనవాళ్లనుచూచి చాలరోజులయింది. ఒకమాఱు ఇంటికివెళ్లివత్తామా?" అనెను. అప్పుడు మేము వెళ్లినయెడఁ గార్యముచెడునని చెప్పి

లేఁచివెళ్లుమఁ బ్రోవలో, ఇంటిలో క్రొత్తగురాలగు నాభార్య దారిద్ర్యముచేతను అందు వలనఁగలిగిన బెంగచేతను తనవారి నందఱిని విడిచి దూరదేశమున నుండుటచేతను కృశించుచుండఁగా, ఎవ్వనికో యొకదానికి తన్నిశ్రమకుఁ బాలుపఱుచుకొనుచున్నదో యని నేను దినమునందొక నిమిషమైనను ఇంటనుండక నిత్యమును శాస్త్రిగారియింటనే భోజనముచేయుచు ఆయనతో మిక్కిలి వినోదములతోఁ బ్రొద్దుపుచ్చుచుండుట తలఁచుకొని, నేను చేయుచుండినది మిక్కిలి క్రూరకృత్యమని తెలిసికొని, శీఘ్రముగా శాస్త్రిగారి సహాయమువలన నేదో గొప్పపని సంపాదించి, యంతకుమునుపు చేసిన యకార్యమున కెల్లను ప్రతీకారముగా దానిని సుఖపెట్టుటకు నిశ్చయించుకొంటిని. నాఁడెట్లో నాస్థితి శాస్త్రిగారికి వినిపించి యేదయినను తగినపని నాకిప్పింపుఁడని యడిగితిని. ఆయన తప్పక యిప్పించెదనని చెప్పి ప్రస్తావమును వినోదాలాపములలోనికి మార్చెను. నామనోరథమును శాస్త్రిగారితోఁ జెప్పితినిగదా యనియు ఆయన వల్లెయనెను గదా యనియుఁ దృప్తుఁడనయి యీవృత్తాంతమును నాభార్యతో సంతోషపూర్వకముగాఁ జెప్పితిని. కాని యామాట నాకుఁగలిగించినంత సంతోషము దానికిఁగలిగించినట్టు కనఁబడలేదు. అయినను దానియవిశ్వాసమును బెంగను మాటలతోఁగాక సరిగా నుద్యోగము సంపాదించి క్రియలతోనే పోఁగొట్టెదనంటిని.

మఱి రెండు వారములవఱకును శాస్త్రిగారుగాని నేనుగాని ఆమాటలను తలఁపెట్టలేదు. కాని యొకనాఁటి ప్రాతఃకాలమున నేను శాస్త్రిగారియింటికిఁబోవుటకుఁ బయనమగుచుండఁగా నాభార్య “మీరు రాత్రికిగాని యింటికిరారేమో. ఇప్పుడే కొంత సామాను తెప్పించాలి. కాలికడియము నాకు వచ్చేదిగాదు. మీరుతీసి చూడండి, రాకుంటే కంసాలికి కబురుపంపుదాము.” అనెను. ఈమాటలు దానినోటినుండివచ్చినప్పుడు దానిముఖమున కోపముగాని పరిహాసముగాని కనఁబడక యెప్పటిశాంతమే యెప్పటిప్రేమయే కనఁబడుటవలన నామనస్సు మఱింత ఖిన్నమయ్యెను. నాఁడు శాస్త్రిగారిని గట్టిగా నడుగ నిశ్చయించుకొని దాని కాలికడియము తీయఁబోవుచుండఁగా మాపొరుగుననున్న రత్నము పెద్దనాయుఁడుగారి కూఁతురు అప్పటివఱకును అక్కడఁగూర్చుండి నాభార్యవద్ద చదువుకొనుచుండినది లేచియింటికి వెళ్లి మరలివచ్చి తననాయనమ్మ నాభార్యనెందుకో పిలిచెనని చెప్పెను. మా పెరటికిని రత్నమువారి పెరటికిని ఒకచిన్నగోడమాత్రము హద్దగుటవలన నాయఁడుగారి తల్లియు నాభార్యయుఁ దఱచుగాఁ గలసిమాటాడుచుండుటయు, ఆ చనవువలన నాయఁడుగారికూఁతురు అంతకుమునుపు రెండు నెలలనుండి నాభార్యవద్ద చదువు నేర్చుకొనుచుండుటయు, జరగుచుండెను. ఆపిల్ల ఆమాట చెప్పఁగానే నాభార్య లేచి పెరటిగోడవద్దకు వెళ్లి పావుగడి

యలో మరలివచ్చి "నాయఁడుగారి అమ్మన్నవెళ్లి తననాయనమ్మతో మనమనుకున్న మాటలుచెప్పింది. ఆవిడ మనచిక్కులు తనతో చెప్పనందుకు కొప్పడి యేనిమిదిరూపాయలియ్యవచ్చింది. నేను సంశయించగా ఆసొమ్ము ధర్మానకిచ్చినట్టుభావించవద్దనిన్ని, తన మనుమరాలికి చదువు చెప్పుతూవున్నందుకు సంతోషించి తానాచిక్కుసమయములో సాయముచేస్తూవున్నాననిన్ని, మీకుపనిఅయినదాకా నాకు కావలసినప్పుడల్లా తనతో చెప్పవలసినదనిన్ని చెప్పి, ఆరూపాయలు నామీఁదబడవేసింది. నేనాపిల్లకుచెప్పడానికి నాకువచ్చినచదువెంతఅని యింకా నేనంటూ రూపాయలుమళ్లీ యియ్యబోతూవుండగా నామాటలుచెవిని బెట్టక ఆవిడలోపలికి పారిపోయింది." అనిచెప్పెను. సిగ్గును దుఃఖమును నన్ను నాభార్యవంకఁజూడనిచ్చినవికావు. ఆమనోవికారములను కాఁచుకొనుటకయి వడిగాలేచి మాయిద్దఱి పూర్వస్థితియునప్పటిస్థితియుఁబోల్చి చూచుకొనవిచారించుచువెళ్లిశాస్త్రిగారినిస్పష్టముగానడిగితిని. తానుపదునయిదుదినములలోఁబీఠపురము వెళ్లివలసియుండెననియు, ఆవెళ్లినప్పుడు రాజుగారితో స్వయముగా మాటాడెదననియు నాయనయుత్తరమిచ్చెను. అయన తానన్న ప్రకారముగాఁబీఠపురము వెళ్లెనుగాని రాజుగారితో నన్నుగుఱించి మాటాడలేదు. తొందరచేత నీప్రస్తావము తేవల్లలేకపోయెననియు మఱియొకమాఱు తప్పక మాటాడెదననియు ఆయనమరలఁ జెప్పెను. కాని ఆయనమఱియొకమాఱు వెళ్లినప్పుడును మఱేదో వంకచెప్పి, యింకొకమాఱనెను. ఇట్లయిదాఱునెలలుజరగెను. శాస్త్రిగారు జమీందారులనుజూచినప్పుడు తనలాభమేదో చూచుకొనుటయే కాని తనయాశ్రితులకువారిచేతనుపకారముచేయించుటయెన్నఁడును లేదనికొందఱుచెప్పిరిగాని నాపట్లను అట్లుజరగుట సంభవింపదని నేనునమ్మియుంటిని. ఈయాఱునెలలలోను నెలకిరువదిదినములు ఇష్టాలాపములాడుచుఁ బాడుచు నేను శాస్త్రిగారియింటనే భోజనముచేయుచుంటిని. పాపము నాభార్య నాయఁడుగారి తల్లి యిచ్చినరూపాయలతో నెట్లో యిల్లుగడపుచుండెను. ఇట్లుండఁగా శాస్త్రిగారుపదిదినములు మంచముపట్టి సఖరోగజర్జరితమయినతనదేహమునుఅకాలమృత్యువుపాలుచేసెను.

ఇట్లు, శాస్త్రిగారు నాకేదో మహోపకారమును జేయుదురన్నయాశ తుదముట్టఁగా నటుపిమ్మటఁగాకినాడలో నుండ నొల్లక నాఁటిరాత్రియే బయలుదేరి యేలమంచిలికిఁబోనుద్దేశించి నాభార్యతోఁజెప్పఁగానది యంతకుమునుపే యీమార్గముపదేశించినదగుటవలన వెంటనే యనుమతించెను. కాని బండియద్దెకును దారిబత్తెమునకును చిల్లిగవ్వయయినను మాయొద్ద లేదయ్యెను. అప్పుడు నాభార్య తనకాలికడియములను— పుస్తెలతప్ప నిదే దాని యొడలనున్ననగలు— నాచేతబలవంతముగాఁ దీయించి యవియమ్మి సొమ్ముపుచ్చుకొని బండికుదుర్చుకొని రమ్మని చెప్పెను.

540 (సశేషము) ములుసు. పాపయ్యశాస్త్రి.

జ్యోతిశ్శాస్త్రసంగ్రహము. (౫౦౧-పుట శేషము.)

ఆఱవ ప్రకరణము.

లఘుగ్రహములు.

గ్రహములను లఘుగ్రహములనియు గురుగ్రహములనియు రెండుభాగములుగా విభజింపవచ్చుననియు, పరిమాణమునందు మిక్కిలి చిన్నవిగానుండి సూర్యునికి సమీపముగానున్న బుధుఁడు శుక్రుఁడు భూమి అంగారకుఁడు లఘుగ్రహములనియు, పరిమాణమునందు మిక్కిలి పెద్దవిగానుండి సూర్యునికి దూరముననున్న బృహస్పత్యాదులు గురుగ్రహములనియు, రెండవప్రకరణమునందుఁ జెప్పఁబడెనుగదా? లఘుగ్రహములలో బుధశుక్రులు భూమికంటెఁ దాము సూర్యునికి చేరువగా నుండుటచే వాని కక్ష్యలు భూకక్ష్యకు లోపలనున్నవనియు, అంగారకగ్రహము భూమికంటెఁ దాను సూర్యునికి దూరముగా నుండుటచే దానికక్ష్య భూకక్ష్యకు వెలుపలనున్నదనియు, మన మీవఱకే తెలిసికొనియున్నాము. ఇప్పుడాగ్రహములనుగూర్చి వేర్వేర వివరింతము.

౧ బుధుఁడు.


బుధగ్రహము భూమికంటె మిక్కిలి చిన్నది. భూమియొక్క వ్యాస మెనిమిదివేల మైళ్లు; బుధునియొక్క వ్యాసము మూడువేలమైళ్లు. అందుచేత బుధగ్రహము భూమిలో సగమైనను లేదు. పెద్దవస్తువు తనకొక చిన్నవస్తు వెంతసమీపముననుండునో యంత బలముతో దానిని దనవంక కాకర్షించుట వస్తుధర్మమయినందున, సూర్యుఁడు దూరముననున్న మనభూమి నాకర్షించుదానికంటె సమీపముననున్న బుధుని నెక్కువ బలముతో నాకర్షించుచుండును. అట్టి యాకర్షణాధిక్యముచేత సూర్యమండలములోఁ బోయి పడకుండుటకయి బుధగ్రహమున కా యాకర్షణమునకుఁ దగినట్లుగా వేగ మధికమయియుండవలెను. అట్టి వేగాధిక్యములేక బుధునకును భూమికున్నంత వేగమే యున్నపక్షమున బుధగ్రహము చిరకాలముక్రిందటనే సూర్యునిలోఁబడి యడఁగిపోయియుండును. సూర్యునినుండి భూమికిఁగల దూరము ౯౧౦౦౦౦౦౦ మైళ్లయియుండఁగా, సూర్యునినుండి బుధునికిఁగల దూరమించుమించుగా నందులో మూడవవంతయియున్నది. అయినను భూమి సెకనుకు (క్షిలిప్తకు) పదునెనిమిదిమైళ్లచొప్పున నడుచుచుండఁగా, బుధగ్రహము సెకనుకు (విలిప్తకు) ఇరువదితొమ్మిదిమైళ్లచొప్పున సంచారము చేయుచున్నది. భూమి యొక్కసారి పూర్ణముగా తన కక్ష్యలోఁదిరిగి మరల యథాస్థానమునకు వచ్చుటకు ౩౬౫¼ దినములు కావలసియుండును; బుధగ్రహము తన కక్ష్యలో ౮౮ దినములలోనే యొక్కసారి పూర్ణముగా సూర్యునిచుట్టును దిరిగి మరల యథాస్థానమునకు రాఁగలుగుచున్నది. సూర్యునిజుట్టి యొకగ్రహ మొకసారి

ప్రదక్షిణము చేసి వచ్చు కాలమే సంవత్సరమయినందున, భూలోకములోని వారికి సంవత్సరమునకు ౩౬౫ దినములయి యుండఁగా బుధలోకములోనివారికి ౮౮ దినములే యగును. అందుచేత మన భూమిలో ముప్పదిసంవత్సరములు జీవించినవాఁ డక్కడ నూటయిరువది సంవత్సరములు జీవించినవాఁడగును సూర్యబింబము మనభూమినుండి కనఁబడుదానికంటె బుధలోకమునుండి నాలుగునరరెట్లు పెద్దదిగా కనఁబడును. ఆ పెద్దతనమునకుఁ దగినట్లే కాంతియు వేఁడిమియుఁగూడ హెచ్చుగానుండును. మనకు చంద్రుఁడున్నట్టుగా బుధున కుపగ్రహమేదియు నున్నట్టు కనఁబడదు. దినప్రమాణము మాత్ర మించుమించుగా మనభూమిలో నెంతయుండునో బుధునిలో నంతేయుండును సూర్యునిచుట్టును గల యాయా గ్రహకక్ష్యలు కేవల వలయములుగాక త్రినాభిచక్రములనఁబడెడు దీర్ఘవృత్తములుగా నున్నవని మనమిదివఱకే తెలిసికొనియున్నాము. బుధకక్ష్య భూకక్ష్యకంటె నధిక దీర్ఘమయినదిగా నున్నది. అందుచేత నుచ్చస్థానమునందున్నప్పటికంటె నీచస్థానమునందున్నప్పుడు సూర్యునికి మనభూమి ముప్పదిలక్షల మైళ్లకంటె నెక్కువ చేరువగా నుండకపోయినను, బుధగ్రహము నూటయేఁబదిలక్షలమైళ్ల చేరువగానుండును. దీనినిబట్టి కలుగు ఋతుభేదములనుబట్టి బుధమండలములో శీతోష్ణము లత్యంత వ్యత్యాసము కలవిగానుండును. భూమియందువలె నచ్చట ఋతువులు నెలలకొలఁది యుండక యెనుబదియెనిమిది దినములలోనే యన్ని ఋతువులు నొక్కసారి వచ్చిపోవును అక్కడ మన మండువేసవికాలమునకంటె నుష్ణము నాలుగుమడుఁగు లెక్కువగానున్నను, శీతము మాత్ర మెప్పుడు నింతకంటె నెక్కువగానుండదు. మన భూలోకములో నుండువారికి పురాణములలో వర్ణింపఁబడిన నారదాదులకువలె బుధలోకమునకుఁ బోవుట సాధ్యమయ్యెడుపక్షమున, వారికక్కడ నెండవేఁడిమి దుస్సహమయి ప్రాణములు నిలుపుకొనుటకు శక్తులు కాకపోవుదురు. అయినను సర్వశక్తుఁడయిన యీశ్వరుఁడాలోకమునకుఁ దగినట్టుగా నక్కడ నెట్టి యద్భుతజంతువులను సృజించియున్నాఁడో యెవ్వరెఱుఁగఁగలరు? మన భూమివలెనే బుధమండలమును వాతావరణము కలదయి యధికముగా మేఘములతోఁ గప్పఁబడియున్నది. గ్రహములన్నిటిలోను బుధగ్రహము సూర్యునికి మిక్కిలి చేరువగానున్నది. సూర్యుని కింతకంటె సమీపముననున్న గ్రహమేదియు నేటివఱకును గనఁబడలేదు. సదా సూర్యునికి మిక్కిలి సమీపమునందుండి సూర్యకిరణములలో మునిఁగియుండుటచేతను చిన్నదగుటచేతను బుధగ్రహము కంటికగపడుటయే కష్టము. అయినను సూర్యబింబమునకుఁ బడమటివైపున నున్నప్పుడు కొంతకాలము సూర్యోదయమునకుముందు తూర్పుదిక్కునను, సూర్యబింబమునకుఁ దూర్పువైపున నున్నప్పుడు కొంతకాలము సూర్యాస్త


మానమునకుఁ దరువాతఁ బడమటిదిక్కునను, చుట్టుపట్లఁగల నక్షత్రములకంటె నధిక ప్రభతో స్పష్టముగా బుధగ్రహము సూర్యునికిఁ గొంచెము మీఁదుగా తెల్లగా కనఁబడును. ఉచ్చమునందున్నప్పటికంటె నీచమునందున్నప్పుడు బుధబింబము మూడురెట్లు పెద్దదిగాఁ గనఁబడును అయినను సూర్యునికి సమీపమునందుండి పెద్దదిగానున్నప్పుడు బుధగ్రహము మనకు నేత్రగోచరముగాక సూర్యునికిఁ బడమటనుగాని తూర్పునఁగాని మిక్కిలి దూరముననున్నప్పుడుమాత్రమే ప్రాతఃకాలముననో సాయంకాలముననో కంటి కగపడును. అది మిక్కిలి యధికకాలమున్నప్పుడు సహితము సూర్యుఁడు లేనప్పుడు దిఙ్మండలముపయిని రెండుగంటలకంటె నెక్కువకాలముండదు. మాఘ ఫాల్గున చైత్రమాసములలో సూర్యునికుత్తరపువైపున సాయంకాల నక్షత్రముగా సూర్యాస్తమానానంతరమునను, శ్రావణ భాద్రపదాశ్వయుజ మాసములలో సూర్యునికి దక్షిణపువైపున ప్రాతఃకాలనక్షత్రముగా సూర్యోదయ పూర్వమునను, రెండు గంటలకు లోపలికాలములో బుధగ్రహమును జూడవచ్చును.

మనభూమికిని సూర్యునికిని నడుమనుండు గ్రహములకన్నిటికిని దాముండెడు స్థానవిశేషములనుబట్టి చంద్రునికివలెనే తప్పక కళాభేదములుండి యుండవలెను. అందుచేత బుధబింబమునకు కళలలో వృద్ధిక్షయములు కలుగుచునే యుండునుగాని, వానిని మనము మనదృష్టిచేతఁ గనిపెట్టలేము అయినను దూరదర్శక యంత్రసాహాయ్యమును గొనిచూచినప్పు డవి మనకంటికి స్పష్టముగాఁ గానఁబడును. రేఖగానుండునప్పుడు బింబమునం దగపడు హెచ్చుతగ్గులనుబట్టి జ్యోతిశ్శాస్త్రవేత్తలు బుధునిలో భూమిలోనుండు వానికంటె నున్నతములయిన పర్వతములున్నవని కనుఁగొనియున్నారు. గ్రహములలో నేవియు స్వయంప్రకాశములుగాక యన్నియుఁ దమకాంతిని సూర్యుని వలననే పొందునవిగా నున్నవి. బుధగ్రహము సూర్యునికిని భూమికిని నడుమగా ననఁగా నీచస్థానమునకు వచ్చినప్పుడు కాంతిగల యర్థభాగము సూర్యునివైపుననుండి కాంతిహీనమగు నర్థభాగము మనవైపునకుఁ దిరిగియుండుటచేత మన కది యదృశ్యమగును. ఈ బుధసంగమమును మనవారు బుధాస్తమానమని చెప్పుదురు. ఈకాలము బుధగ్రహముతో సంబంధించి నంతవఱ కమావాస్యవంటిది. బుధునికిని భూమికిని మధ్యకు సూర్యుఁడు వచ్చినప్పుడనఁగా బుధగ్రహముచ్చస్థానమునందున్నప్పుడు మనకది పున్నమనాఁటి చంద్రునివలె పూర్ణబింబముతోఁ గనఁబడును. నీచమునందున్న యస్తమాన సమయమునకంటె నిటువంటి సమయమునందు బుధబింబము భూమికి డెబ్బదివేలమయిళ్లధికదూరమున నుండునుగాన, పూర్ణముగా నుండునప్పుడు బింబము చిన్నదయి నీచస్థానమునందున్నప్పుడు కనఁబడుదానిలో మూడవవంతుగాఁ గనఁబడును. ఈ క్రింది

పటమునఁ జూపఁబడినట్లు బుధుఁడు నీచస్థానమునుండి కొంచెము దూరముగాఁబోయి నప్పుడు రేఖగాను, మఱికొంత దూరము పోయినప్పుడు పాతికబింబముగాను, కనఁబడును—



ఈప్రకారముగానే పయికిఁ బోవుకొలఁదిని అంతకంతకు వృద్ధినొందుచువచ్చి సగము బింబమును ముప్పాతికబింబమునయి కడపట నుచ్చస్థానమును జేరునప్పటికి నిండు బింబమయి, మరల నక్కడనుండి బైలుదేఱి నీచస్థానమువంక నడుచునప్పు డంత కంతకు క్షీణించుచు నాయాస్థాన విశేషములయందు ముప్పాతికబింబమును సగము బింబమును పాతికబింబమునయి రేఖయయి కడపట నీచస్థానమున నదృశ్యమగును. ఈ క్రిందిపటమువలన బుధగ్రహ మాయాస్థానములయందున్నప్పుడు తోఁచు పరిమాణ విశేషములును కళా విశేషములును దెలియవచ్చును—



సూర్యునికిని భూమికిని నడుమ నీచస్థానమునం దెప్పుడైన బుధగ్రహము సరిగా భూసూర్యులతో సమకక్ష్యయందు వచ్చుట తటస్థించినపక్షమున, అప్పుడది సూర్యబింబము మీఁద నల్లగా గుండ్రని మచ్చవలె నిలిచి దాని నాచ్ఛాదించును. ఈ బుధగ్రస్త సూర్యగ్రహణమును మనవారు బుధక్రాంతి యందురు. బుధక్రాంతియందు బుధగ్రహము నల్లని చుక్కవలె సూర్యబింబముమీఁద నొకప్రక్కనుండి యొకప్రక్కకు ప్రాఁకినట్లుండును. నడువవలసిన దూరమునుబట్టి యొకప్పు డెక్కువ కాలమును మఱియొకప్పుడు తక్కువ కాలమును పట్టినను, మొత్తముమీఁద బుధగ్రహము సూర్యునియొక్క యొకప్రక్కనుండి యొకప్రక్కకుఁ జేరుటకు నాలుగుగంటల కాలమగునని చెప్పవచ్చును. సూర్యబింబముయొక్క మధ్యభాగము మీఁదుగా నధికదూరము నడువవలసివచ్చినందున ౧౭౯౯ వ సంవత్సరము మెయి నెల యేడవ తేదిని పట్టిన బుధక్రాంతి యేడుగంటల పదునెనిమిది నిమిషములకాలముండినది; సూర్యబింబముయొక్క కొన నడ్డముగా నల్పదూరముమాత్రమే బుధుఁడు నడువవలసి వచ్చినందున ౧౭౮౨ వ సంవత్సరము నవంబరు నెల పండ్రెండవ తేదిని గలిగిన బుధక్రాంతి యొకగంట పదునాలుగునిమిషముల కాలమేయుండినది. బుధక్రాంతులు వైశాఖమాసములోను కార్తికమాసములోను దక్క నితరమాసములలోఁ గలుగవు. కంటికగపడుటనుబట్టి మనము భావించు రీతిని సూర్యుఁ డొకసారి సంవత్సరములో భూమిచుట్టును క్రాంతిమండలములోఁ దిరుగునప్పుడు బుధకక్ష్యతోడి సంపాతస్థానములయందుఁ బ్రతిసంవత్సరమును రెండుసారులు బుధునితో సంగమించును. ఈ సంపాతస్థానములు క్రాంతిమండలములో నొకదానికొకటి యెదురుగానుండును గాన, ఆ జేసిమాసముల కొక్కొక్కపర్యాయమనఁగా వైశాఖమాసములోను కార్తికమాసములోను సూర్యుఁడు బుధునితో సంగమించును. ఆసమయములయం దెప్పుడయిన భూ బుధ సూర్యకక్ష్యలు సమసూత్రమునందుండుట సంభవించెనా యప్పుడు బుధక్రాంతికలిగి బుధగ్రహము సూర్యునికడ్డముగా నొకకొన నుండి యొకకొనకు జరగినట్లు కనఁబడును. బుధక్రాంతులనఁబడెడు బుధగ్రస్త సూర్యగ్రహణములు ౧౮౯౧ వ సంవత్సరము మెయి (వైశాఖ) మాసము తొమ్మిదవ తేదిని, ౧౮౯౪ వ సంవత్సరము నవంబరు పదవ తేదిని (జయసంవత్సర కార్తిక శుక్ల ద్వాదశీ శనివారము).కలిగినవి ఇఁక ౧౯౦౭ వ సంవత్సరమునఁగాని యీలోపలమరలఁగలుగదు.

సూర్యునికిని బుధునికిని గల దూరము ౩౪౪౭౫౦౦౦ మైళ్లు; మిక్కిలి సమీపము నకు వచ్చినప్పుడు ౨౯౩౦౫౦౦౦ మైళ్లుమాత్రమే. బుధుఁ డుచ్చస్థానమునందుండు నప్పుడు భూమినుండి ౧౩౨౦౦౦౦౦౦౦ మైళ్లదూరమునను, నీచస్థానమునందుండు నప్పుడు ౪౯౨౨౩౦౦౦ ల మైళ్లదూరమునను, ఉండును. బుధునియొక్క గతివేగము

గంటకు ౧౦౦౦౦౦ల మైళ్లు దినప్రమాణమనఁగాఁ దనయక్షముమీఁద తిరుగు కాలము ౨౪ గంటల౫ నిమిషములు వ్యాసము ౩౦౬౮ మైళ్లు. బుధునివంటి గోళములను పదునేడింటి నొక్కటిగాఁజేర్చి ముద్దచేసినపక్షమున మనభూమి యంతటిగోళ మొకటి యేర్పడును. ఇటువంటి బుధుని పౌరాణికకథలు బృహస్పతి భార్యయైన తారకు చంద్రునితోడి జారసంగమమువలనఁ గలిగిన పుత్రునిగాఁ జెప్పుచున్నవి.

౨. శుక్రుఁడు.

లఘుగ్రహములలో రెండవదియగు శుక్రగ్రహము స్థానవిశేషముచేతను, పరిమాణమునందును, సాంద్రతయందును, ఋతుప్రమాణమునందును, గతియందును, కక్ష్యాకారమునందును, ఇంచుమించుగా భూమిని బోలియుండును. మనభూమికివలెనే శుక్రునికిని చుట్టును వాతావరణమున్నది. ఆ వాతావరణములో వివిధవర్ణములు పొందెడు మేఘములు సదాక్రమ్ముకొనియుండును. సూర్యుఁడు సమీపమగుటచేత నధికముగా సోఁకు కిరణముల వేఁడిమిని తగ్గించుటకయి మేఘములు దట్టముగా వ్యాపించున ట్లేర్పాటుచేయఁబడెనని కొందఱూహించుచున్నారు శుక్రకక్ష్య బుధకక్ష్యకును భూకక్ష్యకును మధ్యగానున్నది అందుచేత శుక్రలోకములో నుండువారికి సూర్యబింబము మన భూమిమీఁదనుండి కనఁబడుదానికంటె ద్విగుణ పరిమాణము కలదిగా కనఁబడును అక్కడ సూర్యతేజస్సును వేఁడిమియుఁగూడ భూమిమీఁదకంటె ద్విగుణముగానుండును. శుక్రబింబము ౨౩ గంటల ౧౬ నిమిషములలోఁ దన యక్షముమీఁద నొకసారి యాత్మప్రదక్షిణము చేయునుగనుక, దినప్రమాణ మక్కడ దాదాపుగా ముప్పావుగంట తక్కువగా మన భూమిమీఁదవలెనేయుండును. సూర్యుని చుట్టును దిరుగవలసిన శుక్రునికక్ష్య భూకక్ష్యకంటెఁ జిన్నదగుటచేత, శుక్రమండలములో సంవత్సరప్రమాణము ౩౬౫ దినములుండక ౨౨౪ దినములు మాత్రమే యుండును. శుక్రమండలములోని పర్వతములు భూమండలములో మహోన్నతములయి యున్న హిమవత్పర్వతాదులకంటెను మహోన్నతములుగానున్నవి. అక్కడి పర్వతములలోఁ గొన్నిటి యెత్తు ౨౮ మైళ్లని యొకానొక పండితుఁడు వ్రాసియున్నాఁడు గాని యది యింకను నూహగానే యెంచవలసియున్నది. బుధగ్రహమునకుఁ గలుగు కళాభేదములనుగుఱించి మనమింతకుముందు విమర్శించియున్నాము. బుధగ్రహము నకువలెనే శుక్రునికిని కళలలో వృద్ధిక్షయములు కలుగును గాని యంత్రసాహాయ్యము లేక కేవలదృష్టితో మనము వానిని గనిపెట్టలేము. బుధునివలెనే శుక్రుఁడును భూమికిని సూర్యునికిని నడుమనున్నందున (అనఁగా శుక్రకక్ష్య భూకక్ష్యకు లోపలనున్నందున) గతివిశేషమునుబట్టి శుక్రగ్రహ మొకప్పుడు భూమికిని సూర్యునికిని నడుముగా రాక

తప్పదు. అట్టి సమయమునందు శుక్రబింబముయొక్క కాంతిహీనమైన యర్ధభాగము క్రిందికి మనవైపునను కాంతిమంతమైన యర్ధభాగము పైకి సూర్యునివైపునను ఉండుట చేత, మన కప్పుడది యమావాస్యనాఁటి చంద్రబింబమువలె నదృశ్యమగును. శుక్ర బింబము సరిగా సూర్యుని కెడమవైపునకుఁగాని కుడివైపునకుఁగాని వచ్చినప్పుడది మన కర్ధబింబముగా కనఁబడును. శుక్రబింబము సరిగా సూర్యునివెనుకకుఁ బోయి నప్పుడనఁగా సూర్యబింబము శుక్రునికిని భూమికిని నడుమను వచ్చినప్పుడు కాంతిమంత మయినశుక్రుని యర్ధభాగము మనవంకఁ దిరిగియుండును గాన మనమప్పుడు పూర్ణిమ నాఁటి చంద్రబింబమునువలె శుక్రబింబమును బూర్ణముగాఁ జూడఁ గలుగుదుము. బుధ గ్రహమువలెనే శుక్రగ్రహముచు మనకు నీచస్థానమునందున్నప్పు డదృశ్యమగుచు నుచ్చ స్థానమునందున్నప్పుడు పూర్ణబింబముగా దృశ్యమగుచు నుండునని యింతవలనఁ దేలినదిగదా. దూరమునకుఁ బోయినకొలఁదిని వస్తువు చిన్నదగుచుండుటను మనము చూచుచునే యున్నప్పుడు, బింబము నీచస్థానమునం దున్నప్పుడు పెద్దదిగాను ఉచ్చ స్థానమునందున్నప్పుడు చిన్నదిగాను కనఁబడునని వేఱుగఁ జెప్పనక్కఱయే లేదుగదా? శుక్రబింబ మప్పుడప్పుడు భూమికి ౨౮౫౩౦౦౦ మైళ్లదూరములోనికి వచ్చును. శుక్రబింబము భూమినుండి విస్తారదూరము పోయినప్పుడు ౧౬౬౩౦౮౦౦౦ మైళ్ల కును ౧౬౨౧౫౭౦౦౦ మైళ్లకును నడుముగానుండును. ఈ దూరభేదమునుబట్టి పరి మాణముకూడ భిన్నముగానే కనఁబడుచుండును. బుధునివలెనే శుక్రుఁడును గొంత కాలము సాయంకాల నక్షత్రముగాను, కొంతకాలము ప్రాతఃకాలనక్షత్రముగాను, ఉండును. అయినను శుక్రుఁడు బుధునివలె నాకాశమున నల్పకాలముమాత్రమే యుండక యధికకాలముండుచు దిఙ్మండలముపైని మఱింత యున్నతస్థానమును బొందు చుండును. సూర్యోదయమునకుఁ బూర్వమునఁ గనఁబడుచుండునప్పుడు శుక్రుని వేగుఁ జుక్క యందురు. రాత్రులయందుఁ జంద్రుని తరువాత శుక్రుఁడే యధికకాంతితోఁ బ్రకాశించుచుండును. భూమికి చేరువగానుండి మిక్కిలి పెద్దదిగా కనఁబడవలసి నప్పుడు శుక్రబింబము కాంతిహీనమయి మనకు నేత్రగోచరము కాకుండును; కాంతి మంతమయి పూర్ణముగా కనఁబడవలసినప్పుడు దూరముగాఁ బోవుటచేత చిన్నదయి సూర్యకాంతిచేత తిన్నగాఁ గనఁబడక సామాన్యనక్షత్ర సదృశమగును; ఈ రెండు స్థితులయందునుగాక ప్రక్కల నుండునప్పుడుమాత్రమే బింబమర్ధకాంతి కలదేయయినను మనకధికకాంతితోఁ బ్రకాశించును. అప్పుడు దాని కాంతి గుడ్డివెన్నెలవలె నుండును.

నీచస్థానమునందు గతి విశేషముచేత సూర్యుఁడును శుక్రుఁడును భూమియు సరిగా సమసూత్రమునందు వచ్చుట తటస్థించినప్పుడు మనకు శుక్రగ్రస్త సూర్య